ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

సజల శ్రద్ధ


సంకల్పం
సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

సంపుటి 6
సంచిక 3
జూన్ 2005
పార్థివ వైశాఖం - జ్యేష్ఠం
విడిప్రతి రూ॥ 8.00
సం॥ చందా రూ॥ 85
3సం॥ చందా రూ॥ 250
10 సం॥ చందా రూ॥ 750

కూర్పు
సుందర్ గ్రాఫిక్స్


## నవయుగానికి అధిదేవత గాయత్రి

'సయత్ కృత్స్నాం గాయత్రీ మన్వాహ తత్ కృత్స్నం ప్రాణం దధాతి'

- అని శతపథ బ్రాహ్మణం చెపుతోంది.

అనగా -

సమిష్టిగతమూ, వ్యక్తిగతమూ అయిన జగత్తులో వ్యవస్థను ఏర్పరచేదీ, సమన్వయాన్ని నిర్మాణం చేసేదీ గాయత్రి.

ఈ ఋషి వాక్కు విశ్వమంతటా అక్షరాలా అమలు జరిగే తరుణం ఆసన్నం అవుతోంది. వాస్తవానికి - నవ సమాజ నిర్మాణానికీ, వికాసానికీ అత్యావశ్యకములైన సద్గుణాలనూ, సత్ ప్రవృత్తులనూ, సద్ విధానాలనూ సూత్రబద్ధం చేస్తే - ఆ దివ్య సూత్రమే మూడు చరణముల గాయత్రీ మహామంత్రం. మానవాళి మొత్తానికి ఆధ్యాత్మికమైన మూలాధారాన్ని ప్రసాదించే మహత్తర తత్వాలన్నీ ఆ మంత్రంలో ఇమిడి ఉన్నాయి.

అవివేకం అనే మహా రాక్షసుడు మానవ జీవనంలోని ప్రతి రంగాన్నీ నేడు ఏలుతున్నాడు. ఫలితంగా మానవ జాతి అనైతికం అయిపోతోంది. అనాగరికం అయిపోతోంది. భ్రష్టం అయిపోతోంది. మనిషి ఆలోచనలలో సద్ వివేకాన్ని ప్రతిష్ఠిస్తే తప్ప - మానవాళికి పురోగమనం గగన కుసుమమే అవుతుంది. గాయత్రీ ఉపాసన అంటే సద్ వివేక ఉపాసన, సద్ జ్ఞాన ఉపాసన. ప్రతి జీవన రంగాన్నీ ఆరోగ్యప్రదంగా, సమర్థవంతంగా, వివేక వంతంగా తీర్చిదిద్దే వెలుగుల వెల్లువను ఉపాసకుని అంతఃకరణలో ఉప్పొంగజేసే దివ్య మంత్రం గాయత్రి.

కనుకనే మన మహర్షులూ, మహా మనీషులూ గాయత్రీ మంత్రాన్ని ఏకగ్రీవంగా ప్రస్తుతించారు. అవతార పురుషులందరూ భగవతి గాయత్రిని ఇష్టదేవిగా కొలిచారు.

ఈ విధంగా ప్రాచీన కాలం నుండి భారతీయ సంస్కృతికి ఊపిరిగా విలసిల్లింది గాయత్రి. వేదమాతగా, దేవమాతగా, విశ్వమాతగా లోకోత్తర భూమికను నిర్వహించింది గాయత్రి. ఈ బీజమంత్రం నవయుగంలో విశ్వసంస్కృతికి మూలాధారం అవుతుంది. నవయుగానికి కల్పవృక్షం అవుతుంది. ఈ మంత్రంలో అంతర్గతంగా ఉన్న జ్ఞాన విజ్ఞానాలు ఆధారంగా వ్యక్తిలో ఉత్కృష్టతా, సమాజంలో సువ్యవస్థా తిరిగి ప్రస్థాపించబడతాయి. నవయుగంలో విశ్వమంతా సమత-మమత-శుచితల త్రివేణిలో స్నానం చేసి పునీతం కావలసి ఉంది. ఆత్మవత్ సర్వభూతేషు, వసుధైక కుటుంబకమ్ - అనే సార్వజనీన, సార్వకాలిక సూత్రాలను మానవాళి తన దైనందిన జీవితంలో ప్రతిబింబించవలసి ఉంది. ఇందుకు కావలసిన సిద్ధాంతపరమూ, వ్యవహారపరమూ అయిన సత్యాలన్నీ గాయత్రీ మహామంత్రంలో బీజరూపంలో ఉన్నాయి.

అందువల్ల -

కృతయుగ అవతరణకు దారిచూపే దివ్యజ్యోతి గాయత్రి. యుగశక్తి గాయత్రి.

మహాకాలుని సంకల్పం ఇది.

తిరుగులేని సంకల్పం ఇది.

**నమస్కరించే వ్యక్తికన్న యోగ్యునికి మాత్రమే నమస్కారం పొందే అధికారం ఉంటుంది.**

## విషయ సూచిక


**ముఖ చిత్రం : గాయత్రీ మాత**

| | | |
|---|---|---|
| 1. | **సంపాదకీయం :** | |
| | శక్తి సాధన | 1 |
| 2. | **విషయ సూచిక** | 2 |
| 3. | **వేద మంత్రం** | 3 |
| 4. | **ధర్మ శాస్త్రాల సారం గాయత్రి** | 4 |
| 5. | **మహాకాలుని వజ్రాయుధం గాయత్రి** | 7 |
| 6. | **గాయత్రీ ఉపాసన ద్వారా మానవ జీవన సార్థకత** | 10 |
| 7. | **మూడు చరణాలు, మూడు దివ్య జాగృతులు** | 13 |
| 8. | **గాయత్రీ మంత్ర వైజ్ఞానిక స్వరూపం** | 16 |
| 9. | **జ్ఞానమూలక సమాజానికి మూలాధారం గాయత్రి** | 17 |
| 10. | **గాయత్రీ సాధన కురిపించే వరాల జల్లు** | 19 |
| 11. | **మూర్తీభవించిన గాయత్రీ మహాశక్తి ఆయన** | 23 |
| 12. | **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం - 1** | |
| | గాయత్రి పంచముఖముల సందేశం | 26 |
| 13. | **కబీరు జయంతి వ్యాసం :** | |
| | ఆచరణలో ఆధ్యాత్మ : కబీరు జీవన వేదం | 28 |
| 14. | **తత్వ చింతన :** | |
| | పరమాత్మ ప్రథమ నామం - ఓం | 33 |
| 15. | **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 18** | |
| | సిద్ధిమార్గంలో పయనించే సంకల్పం - 1 | 37 |
| 16. | **నావారితో నామాట: మహోద్యమం విరాట్ యాత్ర-5** | |
| | 2020 నాటికి కృతయుగ వాతావరణం | 43 |
| 16. | **నావారితో నామాట:** | |
| | శతజయంతి ఉత్సవాలకు షడ్వర్ష ప్రణాళిక | 46 |
| 19. | **వార్తలు :** | |
| | విశాఖజిల్లా జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానోత్సవం | 47 |


## యుగశక్తి గాయత్రి

*గాయత్రి యుగశక్తి, యుగ పరివర్తన కోసం అవతరించిన మహాశక్తి. పూజ్యవరుల తపోబలంవల్ల ఈ శక్తి నేడు వ్యక్తి వ్యక్తికీ అందుతోంది. ఈ శక్తితో తనను తాను కలుపుకున్న ప్రతి వ్యక్తీ బ్రాహ్మణుడు అవుతాడు - అతడు ఏ కులంలో జన్మించినా. గాయత్రీ పరివార్ ఇలా విలక్షణమైన సామాజిక విప్లవాన్ని సాధించింది.*

*గాయత్రి సద్‌బుద్ధికి అధిష్ఠాన దేవత. గాయత్రీ మంత్రం శబ్దశక్తి యొక్క అసాధారణ ప్రయోగం. అనాగరికుణ్ణి నాగరికుడుగా చేసే రసాయనం అది.*

*గాయత్రి ఆదిశక్తి, చిన్మయ శక్తి, ప్రాణదాత్రి. అది మనందరిలో ప్రాణాగ్ని కుండలిని రూపంలో విలసిల్లుతోంది. గాయత్రితో ముడిపడిన వ్యక్తి సుసంస్కారితుడు అవుతాడు. వ్యవహార రీత్యా క్షాళన పొందిన వ్యక్తిగా, పరిష్కరించబడిన చింతన కలిగిన వ్యక్తిగా రూపొందుతాడు.*

*గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలలో ధర్మశాస్త్రమంతా ఇమిడి ఉంది. ధర్మానికి మూలమైన వేదానికి ఆధారం ఇది.*

*గాయత్రీ మంత్రం సవితా దేవతను ప్రార్థించే మంత్రం. వేదమాత గాయత్రికి చేసిన ప్రార్థన ఇది.*

*అందరికీ సద్ బుద్ధినీ, అందరికీ ఉజ్వల భవిష్యత్తునూ ప్రసాదించాలనే ప్రార్థన రూపంలో ఈ మంత్రంలోని భావాన్ని ప్రతి ఆరాధనా విధానంలో, ప్రతి పంథ్‌లో, ప్రతి సంప్రదాయంలో, ప్రతి మతంలో మనం దర్శించగలుగుతాము.*

## చందాదారులకు విజ్ఞప్తి

యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందాను

ఐష్ట్ర జూఈజుఖజుఊఽజు ష్ట్రజుఖజుఊష్ట్ర ఊష్ట్రఏఐఊ - ఓఏఐ -ఈశ్రీ - ఽఖఈ పేరుమీద బ్యాంకు డ్రాఫ్టు ద్వారాకాని, చెక్కుద్వారాకాని పంపగోరుతాము.

**చెడు ఆలోచనలను అదుపు చేయాలంటే, సత్కర్మలలో మునిగిపో.**

# వేద మంత్రం

**బణమహాం అసి సూర్య బడాదిత్య మహాం అసి ।**
**మహాంస్తే మహతో మహిమా త్వమాదిత్య మహాం అసి॥**

-అథర్వవేదం 13/2/29

**భావార్థం** : ఓ మనుష్యులారా ! మీ ఆత్మ సూర్య సమాన తేజస్వి, ప్రకాశవంతము, గొప్పది. మీ శక్తిని తెలుసుకోండి. చూడండి ! మీ మహిమ ఎంత గొప్పదో !

**సందేశం** : ఆత్మ, పరమాత్మల మధ్య గొప్ప సన్నిహిత సంబంధమున్నది. మన శరీరంలో ప్రకాశిస్తూన్న ఆత్మ ఆ పరబ్రహ్మ పరమేశ్వరుని అంశమే. ఆయన సత్తా అన్ని ప్రాణులలోనూ నిండిఉన్నది. భగవంతుడు తన ప్రతినిధి రూపంలో ఆత్మను పంపగా, అది ఈ శరీరం ద్వారా ఎల్లప్పుడూ దేవత్వం వైపు పురోగమిస్తున్నది. మన దౌర్భాగ్యమేమిటంటే - అజ్ఞానవశమున మన ఆత్మనే మరచిపోయాము, దుమ్ముధూళి చేత దానిని అణచిపెట్టాము.

ఏవిధంగా సూర్యుడు సమస్త ప్రపంచానికి తేజస్సు, ప్రకాశం, శక్తి, జీవనం ప్రదానం చేస్తున్నాడో, అదే విధంగా ఆత్మ అనుదానం చేస్తున్నది. ఆత్మ 'ఇందు' అని కూడా చెప్పబడింది. 'అహమింద్రో న పరా జిగ్యే' - నేను ఇంద్రుడను, ఎన్నడూ పరాజయుడను కాను. ఆత్మ శక్తి అపరిమితం. ఎవరిలో ఆత్మబలమున్నదో వారెన్నడూ పరాజితులు కారు. ఆత్మబలంలో విజయమున్నది; లేమిలో పరాజయమున్నది. మనుష్యుడు తన ఆత్మ పరమాత్మల సంబంధాన్ని శ్రద్ధతో విశ్వాసపూర్వకంగా స్వీకరిస్తే, అతడు తనను సర్వశక్తిమంతుడుగా తెలుసుకోగల్గుతాడు, అతని హీన భావన దూరమవుతుంది. అతడప్పుడు ఏ కార్యంలోనూ పరాజితుడు కాడు. ఆత్మబలం మనుష్యుని మృత్యుంజయునిగా చేస్తుంది.

ఆత్మబలం ఒక అంతరంగ జ్యోతి. రోగం, శోకంవంటి దోషాలను ఆత్మబలం భస్మం చేసి వేస్తుంది. పవిత్ర కర్మల ఫలితంగా ఆత్మదోషాలు తొలగిపోతాయి. అంతఃకరణలో దాని జ్యోతి ప్రకటితమవుతుంది. ఈ జ్యోతి శక్తి రూపంలో ప్రకటితమై దోషాలను నశింపచేస్తుంది. ఈ మహాశక్తి మనుష్యునిలో ఓజస్సు, స్ఫూర్తి తెచ్చి పెద్దపెద్ద కార్యాలు చేయగలిగే సామర్థ్యాన్ని ఉత్పన్నం చేస్తుంది. వజ్ర సమానమై పెద్దపెద్ద విఘ్నాలను తొలగించి అసంభవాన్ని సంభవం చేస్తుంది.

ఆత్మిక బలాన్ని 'అశ్మవర్మమేÊసి' అని చెప్పారు. అనగా - ఇది నా శిలాకవచం. ఈ అఖండిత, అక్షయ ఆంతరిక శక్తిని శిలతో పోల్చుటలోని ఉద్దేశ్యం ఇది పెద్దపెద్ద ఆఘాతాలను తట్టుకోగలుగుతుంది అని చెప్పుట. ఆత్మబలం అజేయం, ఘర్షణ లేనిది. ఇది పాపిని, పాపాన్ని రెండింటిని నశింపజేస్తుంది. ఆత్మబల సంపన్నుడు జీవితంలో ఎన్నడూ దాసుడు, పరాధీనుడు కాలేడు. మనుష్యుడు దీనివలన సమాజంలో అగ్రగామి, యశస్వి అవుతాడు.

ఆత్మయొక్క ప్రచండ శక్తిని తెలుసుకొనుట మన కర్తవ్యం. నిరంతరం ఆత్మ పరిశీలన చేసుకుంటూ, మాలిన్యాన్ని తొలగించుకోవాలి. తద్వారా మన జీవితం ఆత్మజ్యోతితో ప్రకాశించి మనం తేజస్వులం, వర్చస్వులం అవుతాం. ఆత్మయొక్క ఈ శక్తి ప్రపంచంలోని అసంభవ కార్యాలను సంభవ మొనరిస్తుంది. పరమాత్మ శక్తి తర్వాత ఇంకేదైనా శక్తి ఉంటే అది మన ఆత్మదే.

మన శక్తిని తెలుసుకొనుటయే ఈశ్వర ఉపాసన.

ఆత్మ దర్శనంతో జీవన లక్ష్యం ప్రాప్తిస్తుంది.

H H H

**స్వాధ్యాయం అంటే అర్థం - ఆత్మ శిక్షణ.**

# ధర్మ శాస్త్రాల సారం గాయత్రి

గాయత్రీ మంత్రం ఒక అగాధ సముద్రం. దాని గర్భంలో దాగి ఉన్న రత్నాలను కనుగొనడం మామూలు విషయం కాదు. ఈ మహాసాగరం నుండి అందరూ తమతమ ప్రజ్ఞ, యోగ్యత, ఆకాంక్షలకు అనుగుణంగా రత్నాలను వెలికితీశారు. కాని ఆ అక్షయ భండారం ఆవలిగట్టు ఎవరికీ దొరకలేదు. గాయత్రిలోని ఒక్కొక్క అక్షరంలో ఒక్కొక్క పదంలో ఎంత లోతైన జ్ఞానం దాగిఉందో దానిని తెలుసుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరిన విద్వాంసులకుకూడ పూర్తిగా అర్థంకాలేదు. ఎందరెందరో ఋషులు, మహర్షులు మంత్రంలోని ప్రతి అక్షరం మీద విశేష వ్యాఖ్యానాలు చేశారు. తమతమ దృష్టికోణాలకు అనుగుణంగా గాయత్రీ మంత్రంలోని పదాలకు అర్థాన్ని తీశారు. ఆ అర్థాలు ఎంత విస్తృతమైనవో, ఎంత మార్మికమైనవో ఈ చిన్న వ్యాసంలో చెప్పడం సాధ్యం కాదు. ఈ వ్యాసంలో గాయత్రీ మంత్రం యొక్క అర్థాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. రండి! ముందు గాయత్రీ మంత్రంలోని ఒక్కొక్క పదంలోని అర్థాన్ని చూద్దాం-

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యమ్ ।**
**భర్గో దేవస్య ధీమహి । ధియోయోనః ప్రచోదయాత్ ॥**

| | |
|---|---|
| ఓం :- | బ్రహ్మ |
| భూః :- | ప్రాణస్వరూపుడు |
| భువః :- | దుఃఖనాశకుడు |
| స్వః :- | సుఖ స్వరూపుడు |
| తత్ :- | ఆ |
| సవితుః :- | తేజస్వి, ప్రకాశవంతుడు |
| వరేణ్యం :- | శ్రేష్ఠుడు |
| భర్గో :- | పాపనాశకుడు |
| దేవస్య :- | దైవస్వరూపుడు (ఇచ్చేవాడు) |
| ధీమహి :- | ధారణ చేయుట |
| ధియో :- | బుద్ధిని |
| యో :- | ఏదయితే |
| నః :- | మాయొక్క |
| ప్రచోదయాత్ :- | ప్రేరేపించుగాక |

అర్థం:- ప్రాణస్వరూపుడు, దుఃఖనాశకుడు, సుఖస్వరూపుడు, శ్రేష్ఠుడు, తేజస్వి, పాపనాశకుడు, దేవ స్వరూపుడు అయిన ఆ బ్రహ్మను మేము ధారణ చేయుచున్నాము. ఆయన మా బుద్ధిని (సన్మార్గంలో) ప్రేరేపించుచున్నాడు.

ఈ అర్థాన్ని పరికిస్తే ఇందులో మూడు విషయాలు తెలుస్తాయి. (1) ఈశ్వరుని గుణచింతన, (2) ఈశ్వరుని మనలోపల ధారణచేయుట, (3) సద్బుద్ధి ప్రేరణకు ప్రార్థన. ఈ మూడు విషయాలూ అసాధారణ మహిమగలవి.

మనిషి ఏ విధంగా ఆలోచిస్తూ ఉంటాడో, ఏ వస్తువుల చింతన చేస్తాడో, ఏ తత్వాల మీద ధ్యాన ఏకాగ్రత కలిగి ఉంటాడో - అవన్నీ నెమ్మది నెమ్మదిగా అతడి మనోభూమిలో స్థిరపడి వృద్ధి చెందుతూ ఉంటాయి. ఆలోచనా విజ్ఞాన విస్తృత వివేచన ఇక్కడ చేయడం లేదు. అయితే దాని సారభూతమైన సిద్ధాంతాలను మనం అర్థం చేసుకోవాలి. ఏ విషయాల మీద చిత్త ఏకాగ్రత కలుగుతుందో ఆ దిశలోనే మన మానసిక శక్తులు ప్రకాశిస్తాయి. తమ అద్భుత సామర్థ్యంతో సూక్ష్మలోకం నుండి మనిషికి పలువిధాల అంతరంగ-బహిరంగ, దృశ్య-అదృశ్య సహకారాన్ని అందించి, ఆ మార్గంలో విజయాలు లభించే సాధనాలను, ఉపకరణాలను తీసుకువస్తాయి. చింతనకు అలాంటి మహిమ, గొప్పదనం ఉన్నాయి. ధ్యానయోగ మహిమ

**స్వాధ్యాయంద్వారా శిక్షణ పరిపూర్ణం అవుతుంది.**

రహస్యమేమీ కాదు.

## ఈశ్వర గుణాల చింతన

గాయత్రీ మంత్ర ప్రథమ భాగంలో కొన్ని ఈశ్వర గుణాల చింతన ఉన్నది. అవి మానవ జీవితానికి అత్యంత మహిమాన్వితమైనవి. ఆనందం, దుఃఖనాశనం, శ్రేష్ఠత్వం, తేజస్సు, నిర్భయత్వం, ఆత్మయొక్క సర్వవ్యాపకత, 'ఆత్మవత్ సర్వభూతేషు' అన్న నమ్మకం - వీటిమీద ఏకాగ్రతతో ధ్యానాన్ని కేంద్రీకరిస్తే మస్తిష్కం ఈ తత్వాలను తనలో వృద్ధి చేసుకుంటుంది. మనసు వీటివైపు ఆకర్షింపబడుతుంది. ఈ గుణాల అభ్యాసం మొదలవుతుంది. ఆ ఆధారం మీదే మనసు పని చేస్తుంది. ఆత్మ సచ్చిదానందమైనదని, దుఃఖశోకరహిత బ్రాహ్మీస్థితిలో ఉంటుందని, శ్రేష్ఠమైనదని, తేజస్వియని, నిర్మలమైనదని, అంతటా వ్యాపించి ఉంటుందనే చింతనను లోతైన అనుభూతితో, శ్రద్ధాపూర్వకంగా చేస్తే - ఆత్మ స్వర్గతుల్య దివ్యభావనలతో నిండిపోతుంది. అది ఈ దివ్య ఆనందాన్ని ఆలోచనా క్షేత్రం వరకే పరిమితం చేయదు. క్రియారూపంలోకి తీసుకువచ్చి దృఢమైన ఆనందాన్ని అనుభవించే దిశగా అడుగు ముందుకు వేయిస్తుంది.

## పరమాత్మను ధారణచేసుకునే ప్రతిజ్ఞ

గాయత్రీ మంత్ర రెండవ భాగంలో పైన చెప్పిన గుణాలు గల తేజోపుంజాన్ని, పరమాత్మను మనలో ధారణ చేసుకునే ప్రతిజ్ఞ ఉన్నది. ఈ దివ్యగుణాలు గల పరమాత్మను కేవలం చింతనవరకే పరిమితం చేస్తే సరిపోదు. గాయత్రి దృఢ సందేశం ఏమిటంటే - ఆ బ్రహ్మను, ఆ దివ్య గుణాలు గల పరమాత్మను మన లోపల ధారణ చేయాలి. మన కణకణంలో కలగలుపుకోవాలి. పరమాత్మ మన కణకణంలో వ్యాపించి ఉండడాన్ని చూడాలి. ఆ దివ్య గుణాలు గల పరమాత్మ మనలోపలా బయటా ఆవరించిఉన్నట్లు , ఆ దివ్య గుణాలలో, ఈశ్వరీయశక్తిలో మన 'అహం' పూర్తిగా లగ్నమైనట్లు భావన చేయాలి. ఇలాంటి ధ్యానంతో భూలోకంలో ఉంటూ కూడా బ్రహ్మలోక ఆనందం అనుభవమవుతుంది. ఈ అనుభవం భవిష్యత్తులో గంభీరమైన బహిరంగ ప్రభావాన్ని తప్పకుండా చూపుతుంది.

## సద్బుద్ధికోసం ప్రార్థన

గాయత్రీ మంత్రం మూడవ భాగంలో పరమాత్మునికి మా బుద్ధిని ప్రేరేపించమనే ప్రార్థన ఉన్నది. మాకు సాత్విక బుద్ధిని ప్రసాదించాలి. మా మస్తిష్కాన్ని చెడు ఆలోచనలు, కుసంస్కారాలు, నీచ కోరికల నుండి, దుర్భావనల నుండి రక్షించి, సత్వ గుణాలతో, చురుకైన బుద్ధితో, వివేకంతో, మంచి జ్ఞానంతో నింపాలి.

ఈ ప్రార్థనలో ప్రథమ భాగంలో చెప్పిన దివ్య గుణాలను పొందడానికి, రెండవ భాగంలో చెప్పిన బ్రహ్మను ధారణ చేయడానికి, మూడవ భాగంలో మన బుద్ధిని సాత్వికంగాను, ఆదర్శాలను ఉన్నతంగాను చేసుకొని ఉన్నత దార్శనిక ఆలోచనాధారలను స్మరిస్తూ , తుచ్ఛమైన కోరికల ఊపుతో నాట్యం చేసే దుర్బుద్ధిని మానసిక లోకంనుండి బహిష్కరించడానికీ ఉపాయం ఇవ్వబడింది. బుద్ధిలో కల్మషం దూరమయ్యే కొలదీ దివ్యగుణ సంపన్నుడైన పరమాత్మ అంశలు తమకు తామే మనలో వృద్ధి చెందుతూ ఉంటాయి. అదే అనుపాతంలో లౌకిక, పారలౌకిక ఆనందాలు కూడ వృద్ధి చెందుతాయి.

## జ్ఞానం, కర్మ, ఉపాసన

గాయత్రీ మంత్ర గర్భంలో ఉన్న పైన చెప్పిన విషయాలలో జ్ఞానం, కర్మ, ఉపాసన మూడూ ఉన్నాయి. సద్గుణాల చింతన జ్ఞానం. బ్రహ్మను ధారణ చేయడం కర్మ. అభీష్టాన్ని పొందడం అనేది క్రియా ప్రణాళిక, ఉపాసన. వేదాలలోని అన్ని మంత్రాలూ ఈ సత్యాన్ని విస్తారంగా ప్రకటించడానికే ఆవిర్భవించాయి. వేదాలలో జ్ఞానం, కర్మ,

**అహంకారమనే రోగం నయం కానిదే ఆధ్యాత్మిక ఆరోగ్యం చేకూరదు.**

ఉపాసన - ఈ మూడూ ఉన్నాయి. గాయత్రీ మంత్రంలో కూడ ఆ మూడు గుణాల వర్ణనే వ్యావహారికంగా, సంక్షిప్తంగా, సర్వాంగపూర్ణంగా ఉన్నది. ఈ నిజాన్ని, ఈ బీజాన్ని సహృదయంతో, నిష్ఠా శ్రద్ధలతో అంతఃకరణంలో చొప్పించుకోవడానికి చేసే ప్రయత్నమే గాయత్రీ ఉపాసన. ఈ ఉపాసనతో సాధకునికి అన్ని విధాలా శుభమే శుభం.

పరమాత్ముని ప్రార్థించేందుకు సర్వోత్తమ మంత్రం గాయత్రి. సంసారంలో, జీవితంలో అన్నిటికంటే గొప్పదైన వస్తువుకోసం ఈ మంత్రం ద్వారా పరమాత్ముని యాచించడం జరిగింది. 'బుద్ధి వికాసం సన్మార్గంలో ఉండాలి' - ఇది ఎంతో ప్రయోజనకరమైనది. దీనిని పొందడాన్ని ఈశ్వరుని కృపకు ప్రత్యక్ష చిహ్నంగా భావించవచ్చు. ఈ మంత్రం ద్వారా ఋషులు మన ధ్యానాన్ని అన్నిటికంటే గొప్పదైన ఈశ్వర ప్రాప్తివైపు ఆకర్షింపజేశారని నమ్మవచ్చు. గాయత్రీ ప్రతిష్ఠ అంటే సద్బుద్ధి ప్రతిష్ఠ. మన బుద్ధిని శుద్ధి చేసుకోవడమే గాయత్రీ మార్గం. అందులోని కలుషిత దృష్టికోణాన్ని తొలగించి దూరదృష్టిగల దృష్టిని స్థాపించడమే గాయత్రీ మార్గం. ఈ లక్ష్యసాధనకు పరమాత్మ సహకారాన్ని కోరే ప్రార్థన ఈ మంత్రంలో చేయబడింది.

## శ్రేష్ఠ సంస్కారాల ముద్ర

గాయత్రీ మంత్రంలో సంబోధించిన పరమాత్ముని గుణాలు మానవ జీవనానికి అత్యంత అవసరమైనవి. సవిత, వరేణ్యం, భర్గ, దేవ ఈ నాలుగు పదాలలో తేజస్విగా, ప్రతిభావంతుడుగా, శక్తిశాలిగా, శ్రేష్ఠుడుగా, సంయమశీలుడుగా సేవాతత్పరుడుగా తయారయ్యే శిక్షణ ఉన్నది. పరమాత్మ ఈ గుణాలు కలవాడు. ఈ గుణాలే గాయత్రీ ఉపాసకులలో రావాలి. కనుకనే వాటి గురించిన సంకేతాలే ఈ మంత్రంలో ఇవ్వబడ్డాయి. తరచుగా ఈ విశ్లేషణతో పరమాత్మను స్మరిస్తూ ఉండడంతో, ఈ గుణాల ఛాయ మనసు మీద పడుతుంది. అలాంటి సంస్కారాలే మనసులో పాదుకుంటాయి. ఈ విధంగా గాయత్రీ ఉపాసకులు శ్రేష్ఠత్వ దిశగా ముందుకు సాగుతారు.

ఇది గాయత్రిలోని స్థూలమైన అర్థం. దానిని సూక్ష్మరూపంలో చూస్తే - ఈ 24 అక్షరాలలో ప్రపంచంలోని సమస్త విద్యలను, కళలను, శక్తులను, సంపదలను హస్తగతం చేసుకోగలిగే రహస్యాలు దాగి ఉన్నాయి.

అనువాదం: డి.వి.ఆర్. మూర్తి

H H H

## సప్త మాతృకలు దేవీ స్వరూపాలు

ఒక భక్తుడు భావాతిరేకంతో ప్రార్థిస్తున్నాడు - "నా ప్రభూ! ద్వారం తెఱువు, నేను నీ దగ్గరగా రాగల్గుతాను."

అటు వైళ్తూఉన్న ఒక సంత్ ఇలా అన్నాడు - "ఇంకా లోతుగా వెళ్ళి చూడు, ఈశ్వరుని మందిర ద్వారం ఎప్పుడైనా ఎవరికైనా మూసి ఉన్నదా? నీ తల్లి యొక్క, కుటుంబం యొక్క సేవచేసి చూడు. నీ తల్లి ఒడిలో కూర్చుని చూస్తే భగవానుడు నీకు కన్పడతాడు."

భక్తునికి సరియైన దారి దొరికింది. వనాన్ని వదలి కుటుంబమనే తపోవనానికి వెళ్ళిపోయాడు. వస్తుతః సృష్టికర్త యొక్క కళాకౌశలం, సుందర అలంకరణ యొక్క అద్భుత సమ్మిశ్రణం స్త్రీ శరీరంలోనే ఉన్నది. ఆమె చరణ ధూళి నుండి భృకుటి భంగిమ వరకు ఉప్పొంగే దివ్య తరంగాలలో ఉచ్చస్థాయి అనుదానాల భాండారాలు తొంగిచూడటాన్ని దర్శించవచ్చు. ఆమె పవిత్ర కోమలత్వంలో పుష్పముల సారతత్వం నిండి ఉన్నది. శ్రద్ధ, కరుణ, మమత, క్షమ, తుష్టి, తృప్తి, శాంతి అనే సప్త మాతృకలు దేవి స్వరూపాలుగా లెక్కించబడతాయి. ఆ ఏడింటి సమన్వయం చూడాలనుకుంటే, భావనేత్రాలు తెఱుచుకుంటే స్త్రీలో వాటిని ప్రత్యక్షంగా దర్శించవచ్చు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**పాపం తనతోపాటు ఈ ప్రపంచంలోకి తన శిక్షనుకూడా తెస్తుంది.**

# మహాకాలుని వజ్రాయుధం గాయత్రి

గాయత్రి, యజ్ఞం భారతీయ సంస్కృతికి జననీ జనకులు. గాయత్రి వేదమాతగా, దేవమాతగా, విశ్వమాతగా గుర్తించబడింది. వేదాల నుండి సమస్త ధర్మశాస్త్రాల వరకు దివ్యజ్ఞానమంతా గాయత్రీ బీజాక్షరాల విపుల జ్ఞానమే. యోగం, సాధన, తపశ్చర్యల శక్తి ధారలు గాయత్రి నుండి ఉద్భవించినవే.

## బ్రహ్మాస్త్రం గాయత్రి

గాయత్రీ మంత్రంలో 24 అక్షరాలున్నాయి. తత్వజ్ఞానులు ఈ అక్షరాలలో బీజరూపంగా ఉన్న శక్తులను తెలుసుకున్నారు. వాటినే 24 అవతారాలు, 24 ఋషులు, 24 శక్తులు, 24 సిద్ధులుగా చెప్పవచ్చు. ఈ ఉపాసనతోనే మనీషులు దేవర్షి, బ్రహ్మర్షి, రాజర్షి అనే పదవులను అలంకరించారు. స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు ఎటువంటి కుల, సాంప్రదాయాల భేదం లేకుండా గాయత్రీ ఆరాధన సంతోషంగా చేయవచ్చు. తమ శ్రద్ధను బట్టి లాభాన్ని పొందవచ్చు. గాయత్రీ మంత్రంలోని నాలుగు చరణాల వ్యాఖ్యానాలే నాలుగు వేదాలుగా ఆవిర్భవించాయి. అందువలన గాయత్రిని వేదమాత అన్నారు. జ్ఞాన వివేచనలోనే ఇతర శాస్త్రాలు, పురాణాలు రచింపబడ్డాయి. భారతీయ తత్వదర్శనం, జ్ఞాన విజ్ఞానం గాయత్రీ బీజాల నుండే ఉత్పన్నమైనాయి. ఈ ఉపాసన, ఆరాధన ఆధారంగానే ప్రాచీన భారతానికి చెందిన మహాపురుషులు దేవతుల్యులుగా తయారయ్యారు. కనుక గాయత్రిని దేవమాత అని అన్నారు.

గాయత్రిని ఆత్మశక్తి, బ్రహ్మవిద్య అంటారు. దానిని అమృత కలశంతో పోల్చారు. ఆత్మకల్యాణానికి, ఈశ్వర దర్శనానికి ఆధారం, మార్గదర్శనం గాయత్రీ మంత్రంలో ఉంది.

గాయత్రి నాల్గవ నామం కామధేనువు. అయిదవది బ్రహ్మాస్త్రం. కామధేనువు అనగా తల్లిలాగా పోషించేది, ప్రగతిని, సంపదను ప్రసాదించేది. బ్రహ్మాస్త్రం అంటే పతనాన్ని, ఆపదలను, విఘ్నాలను ఖండించేది. అథర్వణ వేదంలోని ఒక మంత్రంలో - గాయత్రి దీర్ఘజీవనాన్ని, ప్రాణాన్ని, పరాక్రమాన్ని, సుసంతతిని, కుటుంబ సభ్యులను, నిర్మల యశస్సును, సాధనాలను, వైభవాన్ని, బ్రహ్మవర్చస్సును, ఆత్మబలాన్ని ప్రసాదిస్తుందని చెప్పబడింది. సరియైన రీతిలో శరణుజొచ్చిన వారు వాటిని సహజంగానే పొందగలిగారు.

## గాయత్రి ఋతంభర ప్రజ్ఞ

సద్‌జ్ఞాన అధిష్ఠాత్రి, ప్రత్యక్ష ఋతంభరా ప్రజ్ఞ అయిన గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలలో మానవుని చింతనను, శీలాన్ని, ఉన్నతంగా తీర్చిదిద్దే తత్వాలన్నీ నిండిఉన్నాయి.

ప్రతి ధర్మపరాయణునికి గాయత్రిని ఆశ్రయించడం అత్యవసరంగా మారింది. భారతీయ ధర్మం ప్రకారం నిత్య ఉపాసనా విధానాన్ని 'సంధ్యావందనం' గా చెప్పవచ్చు. శరీరంలో వెన్నెముక స్థానం ఎలాంటిదో సంధ్యావందనంలో గాయత్రి స్థానం అలాంటిది. భారతీయ ధర్మానికి రెండు చిహ్నాలున్నాయి. ఒకటి - శిఖ, రెండు - సూత్రం (యజ్ఞావతీతం). ఈ రెండూ గాయత్రికి ప్రతీకలు. శిరస్సు అనే శిఖరంపై గాయత్రీ జ్ఞాన ధ్వజంగా శిఖను, గాయత్రీ మంత్రంలోని 9 పదాలను 9పోగులుగా, మూడు వ్యాహృతులను మూడుముడులుగా కలిగిన యజ్ఞోపవీతాన్ని భుజంపై ధరించే నియమం ఉన్నది. మస్తిష్కం జ్ఞానానికి, శరీరం కర్మకు ఆధారాలు. ఈ రెంటిమీదనే శిఖ, సూత్ర రూపంలో గాయత్రిని ప్రతిష్ఠించడం జరిగింది. ఈ 24 అక్షరాలలో ఉన్న ప్రేరణలకు అనుగుణంగానే ఆ రెండింటి ఉపయోగం, నిర్వహణ ఉండాలని ఆర్షగ్రంథాలు, ఆప్తవచనాలు చెబుతున్నాయి. శాస్త్రాలలో గురుమంత్రం అన్నపేరు గాయత్రికే ఇవ్వబడింది. విద్యారంభం, వేదారంభం, ఉపనయనం మొదలైన సంస్కారాలలో గాయత్రి ఆధారంగానే దీక్ష ఇవ్వబడుతుంది. ఇతర మంత్రాలను దేవ మంత్రాలు, సాధనా మంత్రాలు, సాంప్రదాయ మంత్రాలు మొదలైన పేర్లతో పిలవవచ్చు. కాని అనాది గురుమంత్రం అని గాయత్రినే పిలుస్తారు. రాముడికి గురువైన వశిష్ఠుడు, కృష్ణునికి గురువైన సాందీపుడు ఈ గురుమంత్రాన్నే ఇచ్చారు. విశ్వామిత్ర మహర్షిద్వారా రామునికి బల, అతిబల అనే శక్తులు ఈ సాధన ద్వారానే లభించాయి. క్షత్రియుడైన విశ్వామిత్రుడు ఈ సాధన ద్వారానే బ్రహ్మర్షి అయ్యాడు.

**అధ్యయనం లేనిదే ఆలోచన సంస్కరించబడదు.**

## మహర్షులు కీర్తించిన గాయత్రి

గాయత్రిని మించి పవిత్రతను ప్రసాదించే మంత్రం మరొకటి లేదనేది మను భగవానుని కథనం. నియమిత రూపంలో మూడు సంవత్సరాలు గాయత్రీ జపం చేసేవారు భగవంతుని పొందుతారు. ఏ ఇతర సాధనాలు చేసినా చేయకపోయినా గాయత్రి జపంతోనే సిద్ధులు పొందవచ్చు. నిత్యమూ ఒక వెయ్యి జపం చేసేవారు పాముకుబుసం విడిచినట్లుగా పాపాలనుండి విముక్తి పొందుతారు - అని ఆయన వివరించారు.

శంఖ ఋషి అభిప్రాయం ప్రకారం - నరకం అనే సముద్రంలో పడిపోయే వారి చెయ్యి పట్టుకొని రక్షించేది గాయత్రియే. దీనిని మించిన ఉత్తమమైనదేదీ స్వర్గంలోను, భూమి మీదా లేదు. గాయత్రిని తెలుసుకున్నవాడు నిస్సందేహంగా స్వర్గాన్ని పొందుతాడు. పుష్పాల సారం తేనె, పాల సారం నెయ్యి అయినట్లే - సమస్త వేదాల సారం గాయత్రి అని వ్యాసమహర్షి చెప్పారు. సిద్ధింపబడిన గాయత్రి కామధేనువుతో సమానం. గంగ శరీర పాపాలను నిర్మలం చేస్తుంది. గాయత్రీ రూపంలో ఉన్న బ్రహ్మగంగతో ఆత్మ పవిత్రమవుతుంది. గాయత్రిని వదలి ఇతర ఉపాసనలు చేసేవారు పంచభక్ష్యపరమాన్నాలను వదలి భిక్ష ఎత్తే మూర్ఖులతో సమానులు. కార్యసిద్ధికి, తపస్సిద్ధికి గాయత్రీ కంటే శ్రేష్ఠమైనది మరొకటి లేదు.

బ్రహ్మాది దేవతలు కూడా గాయత్రీ జపమే చేస్తారు. అది పరమాత్మను సాక్షాత్కరింపజేసేది. అనుచిత కార్యాలు చేసేవారి దుర్గుణాలు గాయత్రి ద్వారా తొలగిపోతాయి. ఇది భరద్వాజ మహర్షి బోధన.

నారదుడు ఇలా చెబుతున్నాడు - భక్తి రూపమే గాయత్రి. భక్తి రూప గాయత్రి ఎక్కడ ఉంటుందో అక్కడ శ్రీమన్నారాయణుడు నివాసం ఉంటాడు. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు.

యాజ్ఞవల్క్యుడు గాయత్రిని "సర్వకామ ధుక్" అని చెప్పాడు. అనగా గాయత్రీ ఉపాసన ద్వారా నెరవేరని కోరిక అంటూ లేదు.

వశిష్ఠుని కథనం - మందమతులు, దుర్మార్గులు, అస్థిరమైన మనసు గలవారు కూడ గాయత్రీ ప్రభావంతో ఉన్నత స్థితిని పొందుతారు. తరువాత సద్గతి పొందడం తథ్యం. పవిత్రంగా, స్థిరంగా గాయత్రీ ఉపాసన చేసేవారు ఆత్మబలాన్ని పొందుతారు.

యోగానికి మూలం గాయత్రి. గాయత్రితోనే అన్ని యోగాల సాధన జరుగుతుందనేది గౌతమ ఋషి అభిప్రాయం.

మహర్షి ఉద్దాలకుడు ఈ విధంగా చెబుతున్నాడు - గాయత్రిలో పరమాత్ముని ప్రచండ తేజస్సు నిండి ఉన్నది. దానిని ధారణ చేసే వారి వైభవాన్ని దేనితోను పోల్చలేము.

దేవగురువైన బృహస్పతి అభిప్రాయం ఈ విధంగా ఉన్నది - దైవత్వానికి, అమృతత్వానికి ఆది జనని గాయత్రి. దీనిని పొందిన తరువాత ఇక పొందవలసినది ఏదీ ఉండదు.

ఋషులందరూ పై అభిప్రాయాలే వెలిబుచ్చారు. వీటితో ఒక విషయం స్పష్టమవుతున్నది. ఏ ఋషులైనా ఇతర విషయాలలో అభిప్రాయభేదాలు కలిగి ఉండవచ్చుగాక. కాని గాయత్రి విషయంలో వారందరికీ సమానమైన శ్రద్ధ ఉన్నది. వారంతా తమ ఉపాసనలో గాయత్రికే ప్రథమ స్థానాన్ని కల్పించారు. శాస్త్రాలలో, గ్రంథాలలో, స్మృతులలో, పురాణాలలో గాయత్రీ మహిమను, సాధన మహత్తును తెలియజేసే వేలాది శ్లోకాలున్నాయి. వాటన్నింటినీ సంగ్రహిస్తే ఒక పెద్ద గాయత్రీ పురాణం తయారవుతుంది.

## మహామనీషులు పొగడిన గాయత్రి

మహాత్మా గాంధీ ఇలా అనేవారు - "గాయత్రీ మంత్ర నిరంతర జపం రోగులను బాగు చేయడానికి, ఆత్మోన్నతికి ఉపయోగపడుతుంది. స్థిరచిత్తంతో, శాంత హృదయంతో చేసే గాయత్రీ మంత్ర జపం సంకటాలను దూరం చేసే శక్తిని కలిగిఉంటుంది."

లోకమాన్య తిలక్ ఇలా చెబుతూ ఉండేవారు - 'ఏ బహుముఖ దాస్య బంధనాలలో భారతప్రజలు చిక్కుపడి ఉన్నారో, అది రాజకీయ సంఘర్షణతో అంతం కాదు. అందుకోసం ఆత్మలోపల సత్యాసత్యాల వివేకంతో పాటు చెడు

**ఆలోచన సంస్కరించబడనిదే వివేకం ఉదయించదు.**

మార్గాన్ని వదలి శ్రేష్ఠ మార్గంలో నడిచే ప్రేరణ ఇవ్వగలిగిన ప్రకాశాన్ని ఉత్పన్నం చేయాలి. గాయత్రీ మంత్రంలో ఈ భావనే ఉన్నది'.

మహామనా మదన్‌మోహన మాలవ్యాగారు ఇలా చెప్పారు - "ఋషులు మనకు ఇచ్చిన అమూల్య రత్నాలలో ఒక అనుపమాన రత్నం గాయత్రి. దీనితో బుద్ధి పవిత్రమవుతుంది. ఈశ్వర ప్రకాశం ఆత్మలోకి వస్తుంది. ఈ ప్రకాశంతో అసంఖ్యాకమైన ఆత్మలకు భవ-బంధనాల నుండి రక్షణ దొరికింది. గాయత్రీ మంత్రంలో పరమాత్మ పరాయణత పట్ల శ్రద్ధను ఉత్పన్నం చేసే శక్తి ఉన్నది. అంతేగాక అది భౌతికమైన కొరతలను దూరం చేస్తుంది".

రవీంద్రనాథ్ టాగూర్ మాటలలో - "భరతవర్షాన్ని జాగృతం చేసే మంత్రం ఎంత సరళమైనదంటే ఒక శ్వాసలోనే దానిని ఉచ్చరించవచ్చు. అదే గాయత్రీ మంత్రం. ఈ పునీత మంత్రాన్ని అభ్యసించడంలో ఏ విధమైన తార్కిక ఊహాపోహలకు, అభిప్రాయభేదాలకు, కలహాలకు, సంశయాలకు తావు లేదు."

అరవింద యోగి అనేక చోట్ల గాయత్రీమంత్ర జపాన్ని నిర్దేశించారు. అత్యంత గొప్పకార్యాలను చేయగలిగే శక్తి గాయత్రిలో ఉందని చెప్పారు. ఆయన ప్రజలకు సాధనాపరంగా గాయత్రీ మంత్రాన్నే చెప్పారు.

## సామూహిక జపం మహిమ

స్వార్థంలో పరమార్థం. లౌకికంలోనే పారలౌకిక కల్యాణం కలిసి ఉండడమే పరిపూర్ణ యోగంగా చెప్పవచ్చు. ఈ శిక్షణ అంతా గాయత్రీ ఉపాసనలో ఉన్నది. వ్యక్తిగత ప్రగతితో పాటు సమాజ అభ్యున్నతి, విశ్వ అభ్యున్నతులే పరమాత్మ అభీష్టం. ఆ ప్రక్రియను గాయత్రీ మంత్ర ఉపాసన పూర్తి చేస్తుంది. ఈ విషయంలో సామూహిక పురశ్చరణల మహాత్మ్యం వేలరెట్లు ఎక్కువగా ఉంటుంది. గాయత్రీ పరివార్ ద్వారా దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో గాయత్రీ మంత్ర జపం, మంత్రలేఖన, మహాపురశ్చరణలు జరుగుతున్నాయి. తమ లాఠీలతో గోవర్ధనగిరిని ఎత్తిన గోపబాలుర లాగా - అవి యుగ భయాన్ని, ఆపదల పర్వతాన్ని ఎత్తిపడవేస్తాయి. సుఖ, శాంతులకు జన్మనిస్తాయి. దూరదృష్టి కలవారు వివేకంతో చూస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

## అవిశ్వాసంపై వజ్రాయుధం గాయత్రి

మన యుగంలోని పరిస్థితులు అద్భుతమైనవి. ఇందులో కంసుడు, రావణుడు లాంటి ఆక్రమణదారుల బాధలు, దుర్భిక్షం, దుర్ఘటనలు లాంటి దైవీ ఆపదలు లేవు. అయినా చారిత్రక మహాసంకటాలతో పోల్చి చూస్తే పరిస్థితి ఎక్కువ భయాన్నే కలిగిస్తుంది. ఆపదల నూతన స్వరూపం విశ్వాస సంక్షోభం. దీని కారణంగా మానవుల అంతరాళాల్లో ఆదర్శాలపట్ల అశ్రద్ధ పెరిగింది.

ఈ పరిస్థితులు మానవుని సామాన్య ప్రయత్నంతో చాలా అరుదుగానే చక్కదిద్దబడతాయి. ప్రగతి కోసం చేసే ప్రయత్నంలో అడుగడుగునా అపజయం ఎదురై నిరాశపరుస్తుంది. ఇలాంటి అగమ్య పరిస్థితులను చక్కదిద్దే మహాకార్యాన్ని సృష్టికర్త యొక్క సూక్ష్మచేతన, దివ్య ప్రేరణలే చేపట్టగలవు. ప్రస్తుతం ఈ కార్యమే జరుగుతున్నది. సమయ ఆవశ్యకతకు అనుగుణంగా మహాకాలుని ప్రచండ క్రియలు యుగ అవతార ఉద్దేశ్యాన్ని పూర్తి చేయడం కోసం క్రమంగా పదునెక్కుతూ వస్తున్నాయి.

ఈ యుగ మహారాక్షసుడు అశ్రద్ధ. వాడు ప్రజల మనసులలోని లోతైన పొరలలో చొరబడడంలో విజయం సాధించాడు. ఇంత లోతుగా భౌతిక ఉపాయాలు, చికిత్సలు ప్రవేశించలేవు. గుంపులో చిక్కుకుపోయిన ఏనుగును తెలివైన ఏనుగే తన బుద్ధితో బయటకు తీసుకురాగలదు. అశ్రద్ధను నివారించడంలో చురుకైన భావశ్రద్ధే సమర్థంగా పనిచేస్తుంది. ఇందువలననే ఈ సారి యుగ అవతారం ఋతంభరా ప్రజ్ఞ రూపంలో జరుగుతోంది. గాయత్రి మహాశక్తి అవతరణే ఈ యుగంలో అశ్రద్ధ అనే ఆపదను దూరం చేయడానికి ఏకైక మార్గం. గాయత్రీ మహాపురశ్చరణ ఈ అవసరాన్నే పూర్తి చేస్తుంది. ఇందులో భాగం పంచుకునే సౌభాగ్యం అసాధారణమైనది. ఈనాటి చిన్న చిన్న సాధకులు ఈ సాధనా ప్రతాపంతో రేపు మహాపురుషుల స్థాయికి చేరుతారు. వ్యక్తిగత సుఖశాంతులయితే వారికి వడ్డీగా లభిస్తాయి.

అనువాదం : డి.వి.ఆర్.మూర్తి

**వివేకం లేనిదే జ్ఞానం లభించదు.**

# గాయత్రీ ఉపాసన ద్వారా మానవ జీవన సార్థకత

హిందూ ధర్మ శాస్త్రాలలో ఆత్మశక్తిని ప్రసాదించి మనోవాంఛలను సిద్ధింపజేసే అనేక మంత్రాలు చెప్పబడ్డాయి. వాటన్నింటిలో గాయత్రి సర్వశ్రేష్ఠమైనది. నాలుగు వేదాలలో గాయత్రితో సమానమైన మంత్రమేదీ లేదనేది విశ్వామిత్రుని అభిప్రాయం. గాయత్రీ మంత్రాన్ని పఠిస్తే వేదపఠన ఫలితం లభిస్తుంది.

## మనిషి ఆత్మకు కాయకల్పం

ఆయుర్వేద శాస్త్రాలలో మానవ శరీర పరిమాణాన్ని మార్చి కాయకల్పం చేసే అనేక ప్రయోగాలు చెప్పబడ్డాయి. అదేవిధంగా గాయత్రీ మంత్రాన్ని స్వచ్ఛమైన హృదయంతో జపం చేస్తే మనిషికి ఆత్మికమైన కాయకల్పం జరుగుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అంతేగాక హృదయం నుండి అన్నిరకాల వికారాలూ తొలగిపోయి సత్వగుణ తత్వాలు అభివృద్ధిచెందుతాయి. దీని ప్రభావం వల్ల వివేకం, దూరదృష్టి, తత్వజ్ఞానం ఉదయించి అనేక అజ్ఞానజనిత దుఃఖాలు నివారింపబడతాయి. గాయత్రి సాధన వలన మనిషిలో అన్నిరకాల విఘ్నాలను, బాధలను, ప్రతికూల పరిస్థితులను నవ్వుతూ సహించగలిగే దృఢమైన శక్తి ఆవిర్భవిస్తుంది. మంచి - చెడు అన్ని పరిస్థితులలోను సమాన భావంతో మనిషి శాంతియుత జీవనాన్ని సాగిస్తాడు. సృష్టిలోనే అన్నిటికంటే గొప్పదైన ఆత్మబలం లభిస్తుంది. తద్వారా అతను అనేకరకాల ప్రాపంచిక ప్రయోజనాలు పొందడమే గాక, అతడి మనోవాంఛలు కూడ సహజంగానే తీరుతాయి.

## ఆత్మోద్ధరణకు గాయత్రి

గాయత్రీ మంత్రం చూడడానికి పెద్దదేమీ కాదు. దాని భావం కూడ ఏ సాధారణ విద్యావంతుడయినా మామూలుగా అర్థం చేసుకొని గుర్తుపెట్టుకోగలిగినంత సరళమైనది. అయితే ఆ మంత్రంలో ఇహ, పరలోకాలలో పెద్దపెద్ద కార్యాలను సిద్ధింపజేసుకునే శక్తి ఉన్నది.

దయానంద స్వామి ఉపదేశాలను వినడానికి ఒక బీద దూదేకులవాడు వచ్చేవాడు. ఒకసారి అతను 'స్వామీ నేను అంతగా చదువుకున్నవాడిని కాను. మీ ఉపన్యాసాలు పాండిత్యంతో నిండి ఉంటాయి. అందువలన నాలాంటి అవివేకులకు కూడా ఉపయోగపడే ఉపాయం ఏదయినా చెప్పండి' - అని అడిగాడు. అది విని స్వామీజీ గాయత్రీ మంత్రాన్ని అర్థసహితంగా వ్రాసి ఇచ్చి, "ఈ అర్థాన్ని స్మరిస్తూ మంత్రాన్ని జపించు. నీ వృత్తి నీవు నిజాయితీగా చేసుకో. మంచి జరుగుతుంది'' - అని చెప్పారు. ఇదే ప్రకారం స్వామి వివేకానంద తన ఉపన్యాసంలో ఈ విధంగా చెప్పారు - ఆత్మహత్య చేసుకునే వారికి ఒక చిన్న చాకు ఉంటే చాలు. దానిని గొంతులో పొడుచుకొని ప్రాణాలు తీసుకోవచ్చు. కాని ఇతరులను చంపడానికి పెద్ద పెద్ద ఆయుధాలు అవసరమవుతాయి. అదే విధంగా ఏ వ్యక్తి అయినా తననుతాను ఉద్ధరించుకోవడంకోసం 'ఓం', గాయత్రీ మంత్ర జపం చేస్తే సరిపోతుంది.

సర్ మోనియర్ విలియమ్స్ "బుద్ధిజం'' అనే పుస్తకంలో ఇలా వ్రాశాడు - "క్రీస్తు మినహా క్రైస్తవమతంలో మరేమీ లేదు. హజరత్ మొహమ్మద్ లేకుండా ఇస్లాం మతం లేదు. బౌద్ధ మతంలో బుద్ధుడు మినహా మరేమీలేదు. నేను క్రైస్తవుడినైనా ఒక సత్యాన్ని చెప్పడానికి వెనుకాడను. హిందువుల మూలమంత్రం గాయత్రి. ఏ ఋషి, ముని మహాపురుషుడు జీవించి ఉన్నా, ఉండక పోయినా - అది ఉంటుంది. హిందూ ధర్మం ఏ మహాపురుషుని మీదా ఆధారపడిలేదు. ఈ మంత్రం ద్వారా ప్రతి మనిషి నేరుగా పరమేశ్వరుని నుండే జ్ఞానాన్ని పొందవచ్చు.''

గాయత్రీ మంత్రం మనిషి యొక్క ఆత్మిక, మానసిక ఉన్నతికి అన్నిటికంటె గొప్ప సాధనమని పై ఉదాహరణలు స్పష్టం చేస్తున్నాయి. అన్ని ఉపనిషత్తుల సారం గీత అని ఏవిధంగా చెప్పబడిందో, గాయత్రీ మంత్రం వేదాల సారమని చెప్పడంలో

**సదాలోచన స్వర్గంగా, దురాలోచన నరకంగా రూపొందుతాయి.**

కూడ ఎటువంటి సందేహమూ లేదు. గాయత్రీ మంత్ర జపంద్వారా దేవతలందరి అనుగ్రహాన్ని పొందవచ్చు. విష్ణు ఆరాధన, సూర్య ఆరాధన, నిర్గుణుడైన పరమాత్మ ఆరాధన కూడ చేయవచ్చు.

## గురుమంత్రం గాయత్రి

బ్రహ్మచారులలో ఉండే తేజస్సు గాయత్రీ మంత్ర జపంతో వచ్చినదే. గృహస్థుల వద్ద కనిపించే వైభవం, సమృద్ధి గాయత్రివే. వానప్రస్థంలో లభించే శక్తి, సంతోషం కూడ గాయత్రివే. బాలకుడు యజ్ఞోపవీత ధారణ చేసిన క్షణంనుండి సన్యాసంలాంటి సర్వోత్తమ స్థితిలోకి ప్రవేశించే వరకూ మార్గదర్శిగా, సహాయకారిగా, శక్తిదాతగా ఉండేది గాయత్రియే. వారికి గాయత్రియే సర్వస్వము. దేనితోను సరితూగని మహాశక్తిని మన ప్రాచీన ఋషులు గాయత్రీ మాత రూపంలో మనకు అందించి వెళ్ళారు.

యజుర్వేదం మొదటి అధ్యాయంలో ఒక మంత్రం ఉంది. అందులో మానవ దేహం ఎక్కడ నుండి వచ్చింది? దాని ప్రయోజనం ఏమిటి? అనే విషయం చెప్పబడింది. నిజానికి ఈ రెండు విషయాలూ చాలా గొప్పవి. ఈ జ్ఞానం తెలియక పోవడం వలననే మానవుడు అజ్ఞానాంధకారంలో దెబ్బలు తింటూ చెడుమార్గంలో పయనిస్తాడు. మనం ఎవరం? ఈ ప్రపంచంలోకి రావడానికి గల ఉద్దేశ్యం ఏమిటి? అన్న విషయాన్ని ఖచ్చితంగా తెలుసుకోగలిగితే మన మార్గంలో ఎదురయ్యే కఠిన పరిస్థితులు తేలికైపోతాయి. నిరంతరం ప్రగతి మార్గంలోనే ముందుకు పోగలుగుతాము. యజుర్వేదంలోని ఆ మంత్రం -

**కస్త్వా యునక్తి సత్వా యునక్తి కస్మై త్వా యునక్తి ।**
**తస్మై త్వా యునక్తి కర్మణే వాం వేషాయవామ్ ॥** (1-6)

అర్థం: నిన్ను ఎవరు నియుక్త పరిచారు? అనగా ఈ శరీరంతో ఆత్మ సంబంధాన్ని ఏర్పరచినది ఎవరు? దీనికి జవాబుగా పరమాత్మ నీ శరీరాన్ని, ఆత్మను నియోగించాడని చెప్పబడింది.

రెండవ భాగం - ఏ ప్రయోజనం కోసం నిన్ను నియోగించాడు ? దీనికి జవాబు - (1) ఆ పరమాత్మ భజన, దర్శన సంయోగం కోసం. (2) సత్య వ్రతం, యజ్ఞం, ధర్మ ప్రచారం, శుభ గుణాలు, విద్యను ధారణ చేయడం కోసం. (3) జ్ఞానాన్ని పొందడం కోసం. ఈ మూడు సూత్రాలు నాలుగు వేదాలలో నిరూపించబడ్డాయి. గాయత్రీ మంత్రంలో కూడ ఈ మూడింటిని తార్కికంగా సమన్వయం చేయడం జరిగింది. అది కూడ ప్రతివ్యక్తీ సంక్షిప్తంగా, ఎల్లప్పుడూ గుర్తుంచుకొని మననం చేసుకోగలిగే విధంగా ఉంది. ఈ కారణంగానే దీనికి గురుమంత్రం, మహామంత్రముల హోదా ఇవ్వబడింది.

## ఇంద్రియాలపై అదుపు

ఇది తన పేరుకు తగ్గట్టుగానే మానవ జీవితాన్ని సార్థకం చేసే అమోఘ సాధనం. గాయత్రీ ఉపాసన ద్వారా వ్యక్తిలో భారీ ఆంతరంగిక మార్పులు జరుగుతాయి. అందులో ప్రముఖమైనది సత్వ గుణాలు వృద్ధి చెందడం. శరీరంలో నిండిఉన్న రోగ, మల, విష, విజాతీయ పదార్థాలు నశించి, వాటి స్థానంలో శుద్ధ రక్తం, వీర్య పరిమాణం వృద్ధి చెందడంతో ఇది సమానం. ఈ పరివర్తన మనకు ప్రత్యక్షంగా తెలియకపోయినా, దాని ప్రభావం మన శారీరిక ఆరోగ్యం మీద స్పష్టంగా తెలుస్తుంది. గాయత్రి ద్వారా సత్వగుణాలు వృద్ధి చెంది దిగువ శ్రేణి తత్వాలు నివారించబడతాయి. దీనితో సాధకునికి సూక్ష్మ కాయకల్పం జరుగుతుంది. మనసు, ఆలోచనలు బాగా ప్రభావితమై ఇంద్రియ భోగలాలసత్వం మందగిస్తుంది. భోజన ప్రియత్వం, అనేక రకాల రుచికర పదార్థాల కోసం వెంపర్లాడడం, మళ్ళీ మళ్ళీ తినడం, ఎక్కువగా తినడం, భక్ష్య - అభక్ష్య పదార్థాల విచక్షణ లోపించడం, చిరుతిళ్ళు, తీపి, గరిష్ఠ పదార్థాల పట్ల అభిరుచి లాంటి చెడు అలవాట్లు క్రమంగా తగ్గిపోతాయి. ఈ విధంగా నాలుక వశంలోకి రావడంతో హానికర ఆహారం అనే ఒక పెను ప్రమాదం తప్పిపోతుంది.

అలాగే కామేంద్రియ ఉద్రేకం కూడ సత్వగుణ ఆలోచనలతో శాంతిస్తుంది. చెడు మార్గంలో, వ్యభిచారంలో,

**దుష్ట సాహిత్యంవల్ల వ్యక్తీ, జాతీ నష్టపోతాయి.**

కోరికలలో మానసిక భ్రమణం తగ్గుతుంది. బ్రహ్మచర్యం పట్ల శ్రద్ధ పెరుగుతుంది. ఫలితంగా వీర్యరక్షణ జరిగి శారీరిక, మానసిక శక్తి వృద్ధి చెందుతుంది.

మానవుడిని పతనంవైపు ఆకర్షించే రెండు బలవత్తరమైన ఇంద్రియాలు స్వాదేంద్రియం, కామేంద్రియం. అవి అదుపులో ఉంటే ఆరోగ్యం వృద్ధి చెందడం, మనసు నిర్వికారంగా మారడం సర్వసాధారణం. దీనితోపాటు సాధన ఫలితంగా సమయానికి నిద్రలేవడం, శుభ్రత, సహకారం లాంటి ఇతర అలవాట్లు కూడ అబ్బుతాయి. ఆరోగ్యం, దీర్ఘ జీవనముల పునాదులు దృఢంగా తయారవుతాయి.

## రక్షకురాలు గాయత్రి

శరీరంలోలాగ మానసిక క్షేత్రంలో కూడ సత్వగుణాలు వృద్ధి చెందడం వలన అపూర్వమైన ఉన్నతి జరుగుతుంది. కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యాలలాంటి దోషాలు తొలగిపోతాయి. వీటి స్థానంలో సంయమనం, నియమం, త్యాగం, సత్యనిష్ఠ, చురుకుదనం మొదలైన గుణాలు ఆవిర్భవిస్తాయి. ఈ పరివర్తన ఫలితంగా జీవితంలో నిత్యం ఎదురయ్యే దుఃఖాల నుండి విముక్తి కలుగుతుంది. విద్య, బుద్ధి, వివేకం జాగృతం కావడంతో - చింత, భయం, అపనమ్మకం, మోహం, మమత మొదలైన మనో వికారాలు తగ్గడం ప్రారంభమవుతుంది. ధర్మ ప్రవృత్తి ఫలితంగా అన్యాయ అనాచారాల మానసిక స్వభావం నశించిపోతుంది. ఇలా మానసికంగా, శారీరికంగా మంచి తత్వాలు వృద్ధి చెందడంతో మనిషికి వాస్తవిక ఆనందం లభిస్తుంది. సాధకుడు స్వయంగా సాంసారిక దుర్గుణాల నుండి వైదొలగి ఆత్మానందాన్ని అనుభవిస్తాడు. అందువలననే శాస్త్రాలలో ఈవిధంగా చెప్పబడింది -

**'గాయంతం త్రాయతే యస్మాత్**

**గాయత్రీ త్వం తతః స్మృతా।'**

అర్థం: గాయత్రిని గానం చేస్తూ, జపించే సాధక గణాన్ని గాయత్రి రక్షిస్తుంది.

గాయత్రీ మంత్ర సాధన వలన అన్ని రకాల మనోవాంఛలు తీరుతాయి. నిష్కామ భావనతో జపించే వారికి అన్ని రకాల సాంసారిక ఫలాలు లభించడమే కాక, వారు ముక్తిని కూడ పొందుతారు. కనుకనే మన ప్రాచీన ఋషులు, మునులు విశ్వకల్యాణార్థం దీనిని ప్రకటించారు. ఆచారాల ద్వారా దీని ఉపాసనకు ప్రాచుర్యం కల్పించారు.

అనువాదం : డి.వి.ఆర్. మూర్తి

H H H

## ఏది నాటామో అదే కోసుకుంటాము

ఎవరికో ఏదో మరెవరికో మరేదో ఇస్తున్నాడని భగవంతుని నిందిస్తూ ఉన్నారు. పక్షపాతిగా భావిస్తున్నారు. ఒక దార్శనికుడు ఇదంతా వింటూ ఉన్నాడు. వారిని అతడు పొలానికి తీసుకువెళ్ళాడు. ఒకదానిలో గులాబి నాటి ఉన్నది. మరొకదానిలో పొగాకు. ఒకదాని నుండి సుగంధం మరొకదాని నుండి దుర్గంధం. దార్శనికుడు ఇలా అన్నాడు - "నేల చాల చెడ్డది. ఎవరెవరికి ఏదేదో ఇస్తున్నది. దాని పక్షపాతం చూడండి.'' జనం అన్నారు. "కాదు, నేల తప్పు లేదు. నాటిన వారి కృత్యాల ఫలితం''. నవ్వుతూ దార్శనికు డన్నాడు - "భగవానుని సృష్టి ఒకవిధమైన పొలం వంటిది. పరిస్థితులను బట్టి ఎవరు ఏది నాటారో వారు దాన్నే కోసుకుంటారు.''

స్త్రీని హేయమైన స్థితిలో ఉంచే దోషం కూడా సమాజానిదే. సమాజ మనే పొలంలో ఎటువంటి పరిస్థితులు ఉంటాయో అటువంటి మనుష్యులు జన్మిస్తారు. స్త్రీల వెనుకబాటుతనం పెద్దల నిరుత్సాహం యొక్క పరిణామమే.

- ప్రజ్ఞాపురాణం నుండి

**శారీరిక హానికన్న సౌశీల్య హాని భయంకరమైనది.**

# మూడు చరణాలు, మూడు దివ్య జాగృతులు

### మూడు చరణాలు, మూడు శరీరాలు

గాయత్రి త్రిపద. మూడు చరణములు కలిగినది. ఈ చరణాలు మూడింటిలో సంపదలన్నీ నిండి ఉన్నాయి. వాటిని పొంది మనిషి నిజమైన మనిషి అవుతాడు. జీవాత్మ ఆవరణలు మూడింటినీ ఛేదించి, వాటిని వికసింపజేసుకుని దైవీ స్థితిని పొందుతాడు. మనిషి అస్తిత్వంలో మూడు భాగాలు ఉన్నాయి - స్థూలం, సూక్ష్మం, కారణం. ఈ శరీరాలు మూడింటిలో ఒకదానిని మించిన సామర్థ్యం మరోదానికి ఉంది. వీటిలో అస్తవ్యస్తత ఏర్పడితే, వికృతి ఏర్పడితే - ఇవి విలక్షణములైన తమ శక్తులను కోల్పోతాయి. ఫలితంగా వీటినుండి పొందవలసిన ప్రయోజనం పొందలేము. అంతే కాదు. ఇవి జబ్బుపడి కష్ట నష్టాలు కలిగిస్తాయి. అప్పుడు - మహిమలతో కూడిన ఈ శక్తి కుటుంబాలనుండి అందవలసిన హర్షోల్లాసాలూ, అద్భుత ప్రయోజనాలూ అందకుండా పోతాయి. అంతే కాదు. అవి దురవస్థ పాలవుతాయి. నేటి మనుషులలో హెచ్చుమంది ఈ దురవస్థలో చిక్కుకున్నారు.

### శరీరం { మనస్సు

స్థూల శరీరం ఆరోగ్యవంతంగా ఉంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. రోగాలు లేని శరీరం అందంగా, పుష్టిగా ఉంటుంది. వికసించిన పువ్వులా అది అందరినీ ఆకర్షిస్తుంది. హెచ్చు పని చేయడం, కష్టమైన పనులను అవలీలగా చేసి ప్రయోజనం పొందడం, ఇతరులపై తన ముద్ర వేయడం - ఇవన్నీ రోగంలేని వ్యక్తి మాత్రమే చేయగలుగుతాడు.

శరీరాన్ని సాధన చేసి, వ్యక్తులు అద్భుతాలు చేసి చూపుతారు. ప్రజల గౌరవం సంపాదిస్తారు. శిల్పులు, కళాకారులు, వస్తాదులు, క్రీడాకారులు, సర్కస్‌వాళ్ళు సాహసాలు చేసి కొత్త రికార్డులు స్థాపిస్తారు. వీరంతా శరీర సాధనలో నిష్ణాతులు. అయితే, మానసిక ఏకాగ్రతను జోడించడంవల్ల వీరు సాఫల్యాలను పొందగలుగుతారు. మనస్సు సహాయపడనిదే పంచ భూతాలతో కూడిన శరీరం కదలనైనా లేదు. ఈ మనస్సును స్థూల శరీరంలోని ఒక భాగంగా పరిగణిస్తారు. మనస్సును 11వ ఇంద్రియంగా పేర్కొంటారు.

స్థూల శరీరపు సామర్థ్యం ఫలితంగానే మనిషికి ప్రపంచంలో పెక్కు భౌతిక సాఫల్యాలు లభిస్తాయి. సుఖాన్నిచ్చే వస్తువులను పొందడానికీ, ఇతరులకు సహకారం అందించి వారినుండి సహకారం పొందడానికీ శారీరికమైన కార్యశీలత దోహదం చేస్తుంది. కర్మ ప్రాధాన్యం సర్వత్రా కానవస్తుంది. కర్మఫలంనుండే సుఖ దుఃఖాలు లభిస్తాయి. కర్మయొక్క స్థూల ఫలితాలు శారీరిక క్రియాశీలతతో ముడిపడి ఉంటాయి. శిక్ష, బహుమతి ఈ క్రియాశీలత ఆధారంగా లభిస్తాయి. శరీరాన్ని సరైన స్థితిలో ఉంచడం, దానికి తగు శిక్షణ ఇచ్చి ఉన్నత స్థాయి సాఫల్యాలు పొందేందుకు దానిని తీర్చిదిద్దడం - ఇది శరీర సాధన.

### సూక్ష్మ ఆరోగ్య విజ్ఞానం

సాధన విజ్ఞానంలోని మొదటి మెట్టు శరీర ఆరోగ్య రక్షణ, దాని క్రియాశీలతను సూత్రబద్ధం చేయడం, సంస్కరించడం. ఇందువల్ల సాధకుడు రోగముక్తుడు, సమర్థుడు, దీర్ఘజీవి అవుతాడు. యోగంవల్ల కలిగే మొదటి ఫలితం ఇది.

ఆరోగ్య రక్షణకు స్థూలమైన నియమాలు అందరికీ తెలిసినవే. భోజనంలో వస్తువులు ఏ అనుపాతంలో ఉండాలో, వాటిని ఏవిధంగా వండాలో, ఏవిధంగా తినాలో - ఇదంతా ఆహార విజ్ఞానంలో బోధిస్తారు. శ్రమ, వ్యాయామం, దినచర్య, పరిశుభ్రతవంటి అనేక విషయాలు ఆరోగ్య రక్షణకు అవసరం అవుతాయి. రోగాలు వస్తే వాటి చికిత్సకు ఒక శాస్త్రం రూపొందింది. ఇదంతా స్థూల ఆరోగ్య రక్షణ విజ్ఞానం.

**ఆస్తికత్వం స్వర్గమయ సుఖ శాంతులను ప్రసాదిస్తుంది.**

సూక్ష్మ ఆరోగ్య విజ్ఞానం దీనికన్న ఎంతో లోతైనది. దాని వ్రేళ్ళు ఎంతో లోతుకు పోతాయి. ఫలితంగా దాని ఫలితాలుకూడ మరింత తీక్షణంగా ఉంటాయి.

ఆసనాలు, ప్రాణాయామం, నేతి, ధౌతి, వస్తి, నౌలి, వజ్రోలి, కపాలభాతి, ఉడ్డియాన బంధం, జలంధర బంధం, మూల బంధం, ముద్రలు, ఉపవాసం. తపతితిక్ష, చాంద్రాయణం, మౌనం, పరిక్రమ మున్నగు ఎన్నెన్నో శారీరిక సాధనలు ఆరోగ్య అభివృద్ధి మూలాలలోనికి ప్రవేశిస్తాయి. ఆహార విహారాలకు సంబంధించిన మామూలు నియమాలు పాటించినందువల్ల కలిగే ఫలితాలు ఆ లోతుల్లోకి వెళ్లవు.

మామూలు ఆరోగ్య రక్షణ నియమాలను సక్రమంగా పాటించే వ్యక్తులలో పలువురు బలహీనంగా, రోగగ్రస్తంగా ఉండడం మనం చూస్తాం. నాడిని పరీక్షిస్తే దీనికి కారణం తెలియదు. రక్తనాళాలలో, జీర్ణ ప్రక్రియకు తోడ్పడే స్రావాలలో, కొన్ని ప్రత్యేక గ్రంథులలో కొన్ని విలక్షణమైన చిక్కులు ఏర్పడతాయి. ఇవి శరీరశాస్త్రవేత్తలు జరిపే రకరకాల సూక్ష్మ పరీక్షలకు అందవు. ఆ బలహీనత, ఆ రోగం నయం కావు. ఇలాంటి సందర్భాలలో యోగ విజ్ఞాన ప్రయోగాలు ఆశ్చర్యకర ఫలితాలను ఇస్తాయి. పరిశోధనాలయం స్థాయిలో వీటిని విస్తృతంగా పరీక్షించడం సాధ్యం కాదు. అయితే, ఫలితాలనుబట్టి ఈ చికిత్సల ప్రాముఖ్యం రుజువవుతుంది.

గాయత్రి యొక్క ఉన్నత స్థాయి సాధనలలో ఈ చికిత్సలు కూడ జరుగుతాయి. గాయత్రీ సాధనతో పాటు జరిగే ఈ చికిత్సలు సత్ఫలితాలను ఇస్తాయి. విడిగా చేసే చికిత్సలవల్ల ఇలాంటి ఫలితాలు రావడం బహు అరుదు.

## ప్రాణశక్తి ప్రాముఖ్యం

వస్తాదులలో కానవచ్చే బలిష్టత, కళాకారులలో కానవచ్చే చురుకుదనం వేగం, సైనికులలో కానవచ్చే జాగరూకత - ఇవన్నీ కేవలం ఆరోగ్య లక్షణాలు మాత్రమే కావు. వీటిలోని ప్రధానాంశం జీవశక్తి లేదా ప్రాణశక్తి అత్యధికంగా ఉండడం. రక్తం స్వచ్ఛంగా లేకపోయినా, లోపలి అవయవం ఏదయినా క్షీణించినా - ఈ ప్రాణశక్తి ఆధారంగా వ్యక్తి ఆరోగ్యవంతులకన్న మిన్నగా క్రియాశీలంగా ఉండగలుగుతాడు. మహత్తర కార్యాలను సాధించ గలుగుతాడు. ఈ ప్రాణశక్తి ఆధారంగా వ్యక్తి మృత్యువుతో పోరాడగలుగుతాడు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ, అద్భుతమైన కార్యశూరతను చూపగలుగుతాడు.

భీష్ముడు అంపశయ్యపై పరుండినప్పటికీ, ఉత్తరాయణం వచ్చేవరకు జీవించాడు. ఆది శంకరులు మహావ్రణంతో బాధపడుతూన్నప్పటికీ, ఆశ్చర్యకరమైన కార్యశూరతను చూపారు. గాంధీజీ వంటి బలహీనుడు, రాజేంద్రబాబువంటి రోగగ్రస్తుడు ఆరోగ్యవంతులైన వ్యక్తులకన్న మిన్నగా కార్యశూరతను ప్రకటించారు.

యోగ సాధన ఫలితాలు ఆరోగ్యంయొక్క మూలవ్యవస్థ వరకు చేరతాయి. ప్రాణశక్తిని మేలుకొలుపుతాయి. వాటిని పొందడంవల్ల ఎలాంటి స్థాయి శరీరమైనా అద్భుతాలు సాధించగలుగుతుంది.

## శారీరిక క్రియాశీలత { మానసిక తన్మయత్వం

సూక్ష్మ శరీరం అంటే చింతన అనే దివ్యజ్యోతి. మెదడులో చురుకుదనం, జ్ఞాపక శక్తి, దూరదృష్టి, లోతులకు చేరగలిగే నిశిత పరిశీలన, విజ్ఞత - ఇలాంటిని సూక్ష్మ శరీరంవల్ల కలిగే ప్రయోజనాలు. ఒక వ్యక్తి మంద బుద్ధియా, తీక్ష్ణ బుద్ధియా అనే విషయం అతడి విజ్ఞత స్థాయి ఆధారంగా నిర్ణయ మవుతుంది. శారీరిక బలిష్టత ద్వారా, క్రియాశీలతద్వారా లభించే సుఖాలు, ప్రయోజనాల వలెనే - మానసిక సూక్ష్మత ఫలితాలు కూడ తక్కువేమీ కావు. కళాశాలలో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేవారు ఆఫీసర్లు అవుతారు. న్యాయవాదులు, డాక్టర్లు, సాహిత్యకారులు, శాస్త్రవేత్తలు మున్నగు బుద్ధిజీవులు తమ మేధాశక్తి ఆధారంగా డబ్బు సంపాదిస్తారు. వాణిజ్యవేత్తలు, శిల్పులు, కళాకారులు కేవలం శారీరిక శ్రమద్వారా మాత్రమే ఉన్నతి సాధించలేరు. వారి చింతన - ప్రతిభకూడ వారి పనులలో ఏకాగ్రంగా పనిచేస్తుంది. శరీరపు క్రియాశీలత, మనస్సుయొక్క తన్మయత్వం ఎంతగా సమన్వయం పొందితే, అంతగా

**ఈ ప్రపంచంలో ఆలోచనను మించినది ఏదీ లేదు.**

సాఫల్యాలు ఒకదానిని మించి మరొకటి అందుతూ ఉంటాయి.

బుద్ధి వైభవం విలువ గుర్తించబడుతోంది. జ్ఞాన ప్రాప్తి కోసం విద్యాలయాలలో శ్రమ, సమయం, ధనం ఖర్చు చేస్తున్నారు. విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. స్వాధ్యాయం, సంపర్కం, పరిభ్రమణం, ఆలోచనలను కలబోసుకోవడం, అభ్యాసం వంటి ప్రక్రియలద్వారా కూడ జ్ఞానవృద్ధి జరపవచ్చు. శరీర కౌశల్యంవలెనే బుద్ధి వైభవంకూడ అనేక సత్ఫలితాలను సాధిస్తుంది. అభినవ పరిశోధనలలో, వైజ్ఞానిక అన్వేషణలలో, ఆవరణల తెర తొలగించి వాస్తవిక పరిస్థితిని కనుగొనడంలో సూక్ష్మబుద్ధియే పనిచేస్తుంది. రోజువారీ పనులలో, వృత్తులలో సాఫల్యాలను సాధించే మామూలు తెలివితేటలకు మించిన సామర్థ్యం ఇది. దీనికి ఎలా పొందవచ్చో, ఎలా పెంపొందించుకోవచ్చో తెలిపే బహిరంగ ఆధారం ఇంతవరకు కనుగొనబడలేదు. మామూలు తెలివితేటలలో ఒకరిని మించిన వ్యక్తులు మరొకరు మనకు అంతటా కనిపిస్తారు. అయితే, లోతులకు దిగి ముత్యాలను వెదికి తెచ్చే అదృష్టం కొద్దిమందికే కలుగుతుంది. ఈ కౌశల్యం కలిగిన వ్యక్తులు మామూలు పరిస్థితులలో జన్మించినప్పటికీ, మామూలు వ్యక్తులమధ్య పెరిగినప్పటికీ విచిత్రమైన పద్ధతులలో ముందుకుపోతారు. సాఫల్యపు శిఖరాగ్రాలను చేరుకుంటారు. వారి సహచరులు ఆశ్చర్యచకితులై, చూస్తూ ఉండిపోతారు. పరిస్థితుల నుండి అత్యధిక ప్రయోజనాన్ని పొందే విజ్ఞత ఉండడం లేకపోవడం ఈ తేడాకు కారణం.

గాయత్రి సాధన స్థూల శరీరంలో ఆరోగ్యాన్ని నిర్మాణం చేస్తుంది. సూక్ష్మ శరీరంలో మనస్వితనూ, తేజస్వితనూ నిర్మాణం చేస్తుంది. కారణ శరీరంలో భావభరితమైన పులకింతను నిర్మాణం చేస్తుంది.

### కారణ శరీరపు మేలుకొలుపు

భావనల ద్వారానే కారణ శరీరంలోనికి చేరగలుగుతాము. నిష్ఠ, విశ్వాసం, శ్రద్ధల భావభరిత సమన్వయమే భక్తి. ఇదే ప్రేమ సంవేదన. ఈ స్థితి తర్కానికి అతీతమైనది. ఇందులో మనస్సూ, బుద్ధీ అంతగా ఉపయోగపడవు. పొంగిపొరలే భావనా తరంగాలే అంతఃకరణలోని మర్మ స్థానాన్ని తాకగలుగుతాయి. ఇద్దరు ప్రేమికులు కలుసుకున్నప్పుడు - వారు భావోద్వేగంలో తలమునకలు అవుతారు. ఆనందపు పొంగును అనుభూతి పొందుతారు. విశ్వాసపాత్రులూ, ప్రియతములూ, ఆత్మీయులూ అయిన వారిని కలుసుకున్నప్పుడు మనిషి భావోద్వేగంతో పులకించిపోతాడు. భగవంతునిపట్ల అనన్యమైన విశ్వాసంతో పులకించిపోవడం, ఏకాత్మతను పొందడం అనే అనుభూతిని భక్తియోగం అంటారు. లయయోగమనీ, ఆత్మ సమర్పణ అనీ, తాదాత్మ్యం అనీ దీనినే పిలుస్తారు.

'నేను', 'నీవు' - ఈ రెండింటిలో ఒకదానిని నశింపజేయడం గురించి సూఫీ సంత్‌లు, భక్తి యోగులూ ఏకగ్రీవంగా వర్ణిస్తారు. 'నేను' నశిస్తే 'నీవు' మిగులుతుంది. 'నాది అనేది ఏదీ లేదు, అంతా నీదే' - అనే అనుభూతి భక్తియోగంలో కలుగుతుంది. 'అయమాత్మా బ్రహ్మ - ప్రజ్ఞానం బ్రహ్మ - తత్త్వమసి - సచ్చిదానందోహమ్ - శివోహమ్' - అని మరోవిధంగా ఈ సత్యాన్ని ప్రకటించవచ్చు. ఈ అనుభూతిలో 'నీవు' నశిస్తుంది, 'నేను' మిగులుతుంది. రెండు స్థితులలోనూ ఏకత్వం, ఏకరూపతల ప్రతిపాదన, ఒకే సత్తా ప్రతిపాదన, ఉన్నది. భక్తుడూ, భగవానుడూ ఏకమయ్యే స్థితి ఇది. 'అయమాత్మా బ్రహ్మ' - అనే ఆత్మ నికృష్టమైన నరపశువు కాదు; దాని క్రియ, ఆలోచన, ఆకాంక్షలు సరిగా పరమేశ్వరుని క్రియ, ఆలోచన, ఆకాంక్షలవలె ఉంటాయి. పరమాత్మ స్థాయిని చేరిన ఆత్మ తన 'అహం'ను పూర్తిగా కోల్పోయి ఉంటుంది. సంకుచిత స్వార్థపరత్వపు బంధనాలు తెగిపోతాయి. అలాంటి మనిషి లోభ, మోహాల బంధనాలనుండి విముక్తి పొందుతాడు. ఉన్నత స్థాయి ప్రేరణను పరమేశ్వర సంకేతంగా పరిగణించి, దానిని అనుసరిస్తాడు.

త్రిపద గాయత్రిలోని మూడు చరణాలూ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో దివ్య తత్త్వాలను మేలుకొలుపుతాయి; వాటిని సముజ్జ్వలం చేస్తాయి.

H H H

**ఆత్మ ఇచ్చే పిలుపే ఆత్మను మేలుకొలప గలుగుతుంది.**

# గాయత్రీ మంత్ర వైజ్ఞానిక స్వరూపం

**యజ్ఞానాం జప యజ్ఞోఽస్మి** - అని కృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఉపదేశించారు. అనగా - యజ్ఞాలలో నేను జపయజ్ఞాన్ని.

యజ్ఞాలన్నింటిలో జపయజ్ఞం శ్రేష్ఠమైనదని ఈ ఉపదేశం చెపుతోంది. ఇందుకు కారణం ఉంది. ఆధ్యాత్మిక ఉన్నతికి చిత్తశుద్ధి అవసరం. అది ప్రధానంగా జపంద్వారా లభిస్తుంది.

## సకామ జపం, నిష్కామ జపం

జపం చేయడానికి ప్రత్యేకంగా సాధన సంపత్తి ఏదీ అవసరం లేదు. కేవలం దృఢమైన శ్రద్ధతో, ఏకాగ్ర నిష్ఠతో నిష్కామమైన ఉపాసన చేయవలసి ఉంటుంది. కనుక, పేదలూ ధనికులూ, బలవంతులూ బలహీనులూ, పండితులూ పామరులూ - అందరూ జపం చేయగలుగుతారు. సకామ భావనతో, ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం జపం చేసేవారికి ఆ ప్రయోజనం సిద్ధిస్తుంది. నిష్కామ భావంతో జపం చేసేవారికి ఆత్మ నిర్మలం అవుతుంది. మోక్ష మార్గంలో ప్రగతి లభిస్తుంది.

ఇతర మతాల సంగతి అలా ఉంచితే - ఒక్క హిందూ శాస్త్రాలలోనే ఎన్నెన్నో మంత్రాలూ, వాటిని జపంచేసే పద్ధతులూ ఉన్నాయి. ఈ మంత్రాలు చాలావరకు ఎవరో ఒక దేవతకో, దేవికో సంబంధించినవి. వాటివల్ల సాధరణంగా ఒకే వస్తువు లభిస్తుంది. అలాంటి మంత్రాలను జపం చేసేవారి ఉద్దేశ్యం సాధారణంగా భౌతికం, ప్రాపంచికం అయి ఉంటుంది. అయితే, మొదటి విషయం భౌతిక వస్తువులన్నీ నశించేవే. కొద్ది సమయం తర్వాత అవి అంతం కావడం తప్పనిసరి. రెండవ విషయం - అవి ఒక నిర్ణీత పరిమితికి లోబడి ఉంటాయి. కనుక, కోరేవారి సంఖ్య హెచ్చుగా ఉంటే, అవి కోరినంత పరిమాణంలో లభించడం కష్టం. ఆ కారణంవల్ల సకామ జపం యొక్క ప్రాముఖ్యం అత్యల్పం.

## అన్నింటినీ మించినది గాయత్రీ జపం

మనిషికి నిజమైన మేలు ఆత్మ కళ్యాణంలోనే ఉంది. ఆత్మ సూక్ష్మమైనది. కనుక, దానిపై స్థూల పదార్థాలకన్న హెచ్చుగా సూక్ష్మతత్వాలు ప్రభావం చూపుతాయి. ఈ వాస్తవాన్ని భారతీయ ఋషులూ, మునులూ గుర్తించారు. వేలాది సంవత్సరాలు యోగాభ్యాసం చేసి, తపశ్చర్య జరిపి, వాటి ఫలితంగా కొన్ని ప్రక్రియలను కనుగొన్నారు. వాని ద్వారా లౌకిక ప్రయోజనాలనూ, పారలౌకిక ప్రయోజనాలనూ సాధించగలుగుతాము.

ఇలాంటి ప్రక్రియలన్నింటిలో గాయత్రీ జపం అత్యధిక ప్రయోజనాన్నీ, ప్రభావాన్నీ కలిగిస్తుంది. ఈ మంత్రం నూటికి నూరుపాళ్ళు సార్థకమైనది. దీని అర్థాన్ని దృష్టిలో ఉంచుకుని జపం చేసే వివేకవంతుడు తాను కోరిన ప్రగతిని సాధించగలుగుతాడు.

## మనిషి బుద్ధికి మూలం సామూహిక మనస్సు

వైజ్ఞానిక దృష్టిలోకూడ గాయత్రీ జపం మనిషికి ఎంతో మేలు చేస్తుందని రుజువయింది. మనిషి యొక్క మెదడు లేక బుద్ధికి మూలం, జన్మస్థలం ప్రకృతి యొక్క సామూహిక మెదడు లేక మనస్సులో ఉన్నదని నేడు విజ్ఞానశాస్త్ర నిపుణులు కూడ అంగీకరించారు. ఆ జన్మస్థలంనుండి మనం ఎలెక్ట్రోడ్ రూపంలో శక్తిని పొందుతూ ఉంటామని ఆ నిపుణులు కనుగొన్నారు.

ప్రఖ్యాత విజ్ఞాన శాస్త్ర నిపుణుడు సర్ జేమ్స్ జీన్స్ ఈ విషయమై ఇలా చెప్పారు -

కాల ప్రభావం వల్ల జ్ఞాన ప్రవాహం అధ్యాత్మవాదం వైపు మళ్లుతోంది. ఈ బ్రహ్మాండం ఒక పెద్ద యంత్రంగా కాక ఒక పెద్ద ఆలోచన (థాట్)గా కానవస్తోంది.

మనిషి మనస్సు లేక ఆలోచనా శక్తి భౌతిక పదార్థం నుండి అకస్మాత్తుగా ఉత్పన్నం అయిందనే అభిప్రాయం ఇప్పుడు తొలగిపోతోంది. పదార్థాన్ని నిర్మాణం చేసేదీ, దాని వ్యవస్థను నడిపించేదీ మనస్సేనని ఇప్పుడు మనం తెలుసుకుంటున్నాం. దీని అర్థం - ఒక వ్యక్తి మనస్సు ఈ పని చేస్తుందని కాదు. ప్రకృతిలో 'మనస్సు' అనే తత్వం యొక్క అణువులనుండి చేతన ఆవిర్భవిస్తుందనీ, సృష్టిలో చలనం కానవస్తుందనీ - దీని అర్థం.

## విశ్వమనస్సే గాయత్రిలోని 'భర్గ'

ఈ ప్రకృతిలో ఉండే మనస్సునే గాయత్రీ మంత్రంలో 'భర్గ' అని వర్ణించారు. గాయత్రీ మంత్రంలో ఆ 'భర్గ'ను ధ్యానం చేసే సద్బుద్ధిని కోరుకుంటాం.

ఈ ధ్యానాన్ని లేక జపాన్ని విధి విధానం ప్రకారం చేస్తే, మన మనస్సును విశ్వ మనస్సుతో జోడించి ఏకాగ్రం చేయడానికి ప్రయత్నిస్తే - మనం కళ్యాణ మార్గంలో పురోగమించడం తథ్యం.

H H H

**త్యాగంవల్ల శాంతి కాంక్ష సిద్ధిస్తుంది.**

# జ్ఞానమూలక సమాజానికి మూలాధారం గాయత్రి

## జ్ఞాన మహిమగానం గాయత్రి ప్రభావమే

జ్యేష్ఠ శుక్ల దశమినాడు గాయత్రీ జయంతి మనందరికీ అపురూప వరాలను తీసుకొని వచ్చింది. మానవ చేతనపై వరదాయిని వేదమాత అయిన గాయత్రి అవతరణ అందరినీ పులకింపజేసింది. గాయత్రీ మాత జ్ఞాన జనని. గాయత్రీ మహామంత్రంలోని పరమపునీతములైన 24 అక్షరాలు జ్ఞానానికి జన్మస్థలాలు.

21వ శతాబ్దంలో మనం ముందుకుపోతూన్న కొలదీ జ్ఞాన మహిమకూడ పెరుగుతోంది. నేడు గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) ప్రాచుర్యం వహిస్తోంది. అయినా, చర్చ జ్ఞాన విస్తరణపై జరుగుతోంది. జ్ఞానంవల్ల ఏర్పడే సమాజంపై జరుగుతోంది. పాశ్చాత్య దేశాలలోకాని, ప్రాచ్య దేశాలలోకాని - ప్రతి ఒక్కరూ జ్ఞాన మహిమను గానం చేస్తున్నారు. ఇదంతా వరదాయిని అయిన వేదమాత గాయత్రి ప్రభావమే.

## నాలెడ్జ్ సొసైటీ వస్తోంది

పాశ్చాత్య ప్రపంచంలోని నూటికి నూరుపాళ్లు అక్షరాస్యత పొంది అభివృద్ధి పొందిన దేశాలలో ప్రభుత్వపరంగా, ప్రభుత్వేతర రంగాలలో 'నాలెడ్జ్ సొసైటీ' రాబోతూన్నదనే ప్రచారం ఉధృతంగా సాగుతోంది. సగటున 50శాతం నిరక్షరాస్యత ఉన్న ప్రాచ్య దేశాలను ఈ ప్రచారం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. భారత్‌కూడ ఈ రంగంలో శరవేగంతో పురోగమిస్తోంది. ఇది 21 శతాబ్దపు అభినవ చింతన అనీ, అభినవ దృక్పథం అనీ నొక్కివక్కాణిస్తున్నారు.

ఇంటర్నెట్, కంప్యూటర్, టి.వి., ఇన్ఫోటెక్‌ల ఉధృతి పెరిగిన నాటినుంచి 'నాలెడ్జ్ సొసైటీ' నిర్మాణానికి పెక్కు మోడల్‌లు, పెక్కు నమూనాలు రంగంలోకి వచ్చాయి. ఇదంతా తమ ప్రతాపమేనని విజ్ఞానవేత్తలు ప్రచారం చేస్తున్నారు. అయితే - ఇదంతా మానవ చేతనలో వేదమాత గాయత్రియొక్క జ్ఞానమయచేతన అవతరణ ప్రభావమని అధ్యాత్మవేత్తల దూరదృష్టి చెపుతోంది.

20వ శతాబ్దపు చివరి సంవత్సరాలలో టెక్నాలజీ విస్తరణతోపాటు సమాచార ప్రసార రంగంలో అకస్మాత్తుగా విప్లవం వచ్చింది. ఇందువల్ల ప్రపంచ దేశాలకు 'ఇన్ఫర్మేషన్' (సమాచారం) యొక్క శక్తి తెలిసివచ్చింది. ఈ శక్తి ఆధారంగా పెక్కు దేశాలు అహంకారంతో విర్రవీగుతున్నాయి. మరికొన్ని దేశాలు తాము వెనుకబడిపోతున్నందుకు బాధపడుతున్నాయి.

ఇన్ఫర్మేషన్ అన్నింటినీ మించిన మూలధనమని ప్రపంచమంతా గుర్తిస్తూన్నది. డబ్బు, శ్రమ, పదవి, బాహుబలముల ప్రాబల్యంతో ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకునే రాజకీయాలు గతంలో సాగాయి. వాటన్నింటికన్న ఇన్ఫర్మేషన్ మరింత బలమైనదని ఇపుడు గ్రహిస్తున్నారు. జ్ఞానం అనే పెట్టుబడితో రాజకీయ, ఆర్థిక, సమాజిక, సాంస్కృతిక అధికారాలు అన్నింటినీ సంచాలన చేయవచ్చనీ, అదుపు చేయవచ్చనీ ప్రపంచంలోని మహామేధావులూ, నిపుణులూ నేడు వక్కాణిస్తున్నారు. అంతే కాదు. ఈ శక్తితో పాత అధికార పీఠాన్ని ధ్వంసం చేసి కొత్త సమీకరణాలనూ, కొత్త సరంజామాను ఏర్పరచవచ్చుననికూడ వారు వివరిస్తున్నారు. రక్తపు బొట్టు చిందకుండా ఇలాంటి పరివర్తనలను తేవచ్చునని వారు పేర్కొంటున్నారు. ఈ సమాచార ప్రసార విప్లవం ఇపుడు తొలిదశలోనే ఉంది. అయినా - ఇక ప్రపంచంలో కేవలం జ్ఞానం యొక్క పరిపాలన మాత్రమే ఉంటుందని అందరూ అంగీకరిస్తున్నారు.

## భారత్‌లో జ్ఞానానికి శిఖరాగ్ర స్థానం

ఆంగ్ల భాషలో 'ఇన్ఫర్మేషన్', 'నాలెడ్జ్' అనేవి పర్యాయపదాలు. 'నాలెడ్జ్' అంటే జ్ఞానం. జ్ఞాన మహిమ ఇలా పెరగడం పలువురికి ఇబ్బంది కలిగించవచ్చు. ముఖ్యంగా జనసంఖ్యలో మూడింట రెండు వంతులు నిరక్షరాస్యులుగా ఉన్న దేశాలు ఇబ్బంది పడవచ్చు. నిరక్షరాస్యత అనే ఈ ఉచ్చులో భారత్‌కూడ కొంత మేరకు చిక్కుకున్నది. అయితే - భారత

**జీవన సాధన యొక్క ఫలితాల కోసం హెచ్చు సమయం వేచి ఉండ నవసరం లేదు.**

దేశం తన అస్తిత్వపు ప్రారంభంనుండీ జ్ఞానానికి శిఖరాగ్ర స్థానం ఇచ్చింది. వేద రుక్కులు, ఉపనిషత్తుల శృతులు, పౌరాణిక వారసత్వం, దార్శనిక చింతన, తాంత్రిక ప్రయోగాలు, మహర్షుల వైజ్ఞానిక దృక్పథం - ఇవన్నీ ఈ దేశపు మట్టిలో ఫలించాయి, పుష్పించాయి. ప్రపంచానికి మామూలు నాగరికత సైతం తెలియని కాలంలో జ్ఞానపరమైన ఈ బృహత్కృషి అంతా జరిగింది.

భారతవర్షం జ్ఞానాన్ని అన్వేషించడమే కాక, దానిని ప్రసారంచేసే పద్ధతులనుకూడ కనుగొన్నది. సాధు - బ్రాహ్మణ పరంపర, పరివ్రాజకుల వ్యవస్థ, వానప్రస్థ వ్యవస్థ - వీటన్నిటి లక్ష్యం జ్ఞానాన్ని సర్వజన హితాయ సర్వజన సుఖాయ వినియోగించడం. ఒక విధంగా - ఇదంతా జ్ఞాన జనని వేదమాత అయిన గాయత్రి మహిమను గానం చేయడమే. ఈనాడు ఈ మహిమను అంగీకరించడానికి విశ్వమంతా ఉవ్విళ్లూరుతోంది. అధికార సమాజం, పెట్టుబడి కేంద్రిత సమాజం, శ్రమ ఆధారిత సమాజం - వీటి యుగం గతించిపోయిందని నిపుణులంతా వక్కాణిస్తున్నారు. ఇకముందు జ్ఞాన మూలక సమాజమే ఏర్పడుతుంది. జ్ఞాన ఆధారిత సమాజమే బ్రతికి బట్టకట్టగలుగుతుంది. జ్ఞాన విహీన సమాజం బ్రతకలేదు. ఒకవేళ బ్రతికినా బానిసగా, జీవచ్ఛవంగా బ్రతుకు వెళ్లదీయవలసిందే.

## జ్ఞానమంటే ఏమిటి?

మరి జ్ఞానానికి ఏ అర్థం చెప్పాలి? ఇది మహత్తరమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పనిదే, జ్ఞాన మూలక సమాజపు రూపురేఖలు స్పష్టం కావు. 'నాలెడ్జ్ సొసైటీ' అంటే అక్షరాస్యత కలిగిన సమాజమా, లేక విజ్ఞత కలిగిన సమాజమా? శిక్షణ పొందిన సమాజమా, లేక జ్ఞానుల సమాజమా? లేక - ప్రపంచంలో ఉన్న సమాచారాన్ని అంతనూ వినియోగించగలిగే సమాజమా? 'నాలెడ్జ్' అనే ఆంగ్లపదానికి అనేక అర్థాలు ఉన్నాయి - సమాచారం, విజ్ఞత, శిక్షణ, విద్య, జ్ఞానం ఇత్యాదివి. మన రాష్ట్రపతి శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ 'నాలెడ్జ్ ఎకానమీ' అనే కొత్త విధి విధానం 21 శతాబ్దంలో ఉదయిస్తుందని చెపుతున్నారు.

మరో మౌలిక ప్రశ్న, నిరక్షరుడు కావడం అజ్ఞాని కావడానికి ప్రమాణమా? అయితే - కబీరు అజ్ఞానియా? ఆయన కాగితం, కలం పట్టుకోలేదు. ఆయన అజ్ఞాని కారుకదా, కబీరుకు ఉన్న జ్ఞానం జగత్ ప్రసిద్ధం. ఇది అక్షరాస్యతను వ్యతిరేకించడం కాదు. అక్షరాస్యతతోపాటు జీవితాన్ని గురించిన అవగాహన ఉండాలని చెప్పడమే ఇక్కడ ఉద్దేశ్యం. స్వరాజ్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యంలో పేదలూ, నిరక్షరాస్యులూ అందరికీ వోటుహక్కు ఇవ్వడం ఈ విషయాన్ని బలపరుస్తోంది.

ఏది ఏమయినా - అక్షరాస్యత, అవగాహన సమన్వయం పొందడం ఆదర్శమైన స్థితి. శిక్షణ విద్యతో మేళవించాలి. జ్ఞానం జీవించే కళకు కొత్త మార్గాలను కనుగొనాలి. నేటి ప్రపంచ దృక్పథం ఈ దిశలో తొలి అడుగు వేసింది. ఈ దిశలో జరగవలసింది చాలా ఉంది. ఈ తొలి అడుగువేయని దేశాల పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది.

ఈ సమస్యకు మరో కోణం ఉంది. బాగా చదువుకుని ఉన్నత పదవులలో ఉన్నవారు కూడ రకరకాల మానసిక రోగాలతో సతమతం అవుతున్నారు. విజ్ఞత, సదవగాహన, సద్బుద్ధి లోపించడంవల్ల ఈ ప్రమాదం తీవ్రతరం అవుతోంది. కనుక సద్ జ్ఞానం, సద్ బుద్ధి అత్యవసరం అవుతున్నాయి. విద్యతోపాటు సద్బోధ అవసరం అవుతోంది.

జ్ఞానానికి మూలాధారం అయిన గాయత్రీ మహా మంత్రంయొక్క పరమ శిక్షణ పొందడం ద్వారానే ఈ ఆవశ్యకత పూర్తవుతుంది. ఆ మహామంత్రంలో ధ్యాన బీజంతో **ఓం,భూర్భువః స్వః** - అనగా చింతన, శీలం, వ్యవహారణ అనే మూడు రంగాలలో వ్యాపకత - ముడిపడి ఉంది. దీనితోపాటు **తత్సవితుర్వరేణ్యం** అనే సిద్ధాంతాన్ని స్వీకరించి మనిషి శ్రేష్ఠత్వాన్ని వరించడం నేర్చుకోవాలి. **భర్గో దేవస్య ధీమహి** అనే తత్వాన్ని నేర్చుకుని పరమేశ్వరుని తేజాన్ని ధారణ చేయాలి. తేజస్విగా రూపొందాలి. **ధియో యోనః ప్రచోదయాత్** ప్రకారం సన్మార్గాన్ని అనుసరించాలి.

జ్ఞానమూలక సమాజానికి మూలాధారం ఇదే. దీనిని సాకారం చేయడానికై జ్ఞాన జనని గాయత్రీ మాత మానవ చేతనలో అవతరించింది.

H H H

**ఉపాసనకు అర్థం - మన గుణ కర్మ స్వభావాల సంస్కరణ.**

# గాయత్రీ సాధన కురిపించే వరాల జల్లు

సమస్త బ్రహ్మాండాన్నీ ధారణచేసే, పోషణచేసే, అభివృద్ధిచేసే పరమాత్మను సద్బుద్ధిని ప్రదానం చేయవలసిందిగా గాయత్రీ మహామంత్రంలో మనం ప్రార్థనచేస్తాం. శ్రద్ధా విశ్వాసాలతో చేసే ఈ ఉపాసన సాధకుని ఆంతరిక చేతనలో, మనస్సులో, అంతఃకరణలో, మెదడులో, ఆలోచనలలో, భావనలలో సన్మార్గంవైపు పురోగమించాలనే ప్రేరణను నింపుతుంది. ప్రపంచంలోని సుఖ సమృద్ధులూ, జీవితంలోని మహత్తర సాఫల్యమూ సద్బుద్ధిని పొందడంలో ఉన్నాయనే నమ్మకం ఈ మహామంత్రంలోని అర్థాన్ని మననం చేసినప్పుడు సాధకునికి కలుగుతుంది.

## సాధకునివద్ద సత్సంకల్పాల సమాహారం

ఈ విశ్వాసం స్థిరపడినపుడు దీనిని పొందాలనే ఆకాంక్ష సాధకుని ఇచ్ఛాశక్తిలో రగులుతుంది. జ్వలిస్తున్న ఈ ఆకాంక్షవల్ల అంతరంగ క్షేత్రంలో ఒకవిధమైన ఆకర్షణశక్తి ఉదయిస్తుంది. ఈ ఆకర్షణ వల్ల ఆకాశమంతటిలోని ఈథర్‌లో ఉన్న సత్ తత్వాలు, సదాలోచనలు, సద్ భావనలు, సద్ ప్రేరణలు ఆ అంతరంగ క్షేత్రంలో కేంద్రీకృతం కావడం ప్రారంభం అవుతుంది. ఆలోచనల ఆకర్షణ శక్తియొక్క విజ్ఞానం సర్వవిదితమే. ఒక తరహా ఆలోచనలు తమ తరహా ఆలోచనలను ఆకాశంనుండి లాగికొంటాయి. ప్రపంచంలోని మరణించిన, జీవిస్తున్న సత్‌పురుషులు వ్యాప్తి చేసిన నాశనంలేని సంకల్పాలు శూన్యంలో సదా తిరుగాడుతూ ఉంటాయి. గాయత్రీ సాధకునివద్దకు ఈ సత్ సంకల్పాలన్నీ దేవుని వరాలవలె సునాయాసంగా వచ్చి ఏకమవుతూ ఉంటాయి. కూడబెట్టే పెట్టుబడిలా వాటి భాండాగారం పెరిగి పెద్దదవుతూ ఉంటుంది.

## ఇంద్రియాలపై అదుపు

శరీరంలో సత్‌తత్వాలు అభివృద్ధి కావడంవల్ల శరీరంయొక్క కార్యకలాపాలలో పెద్ద మార్పు వస్తుంది. ఇంద్రియాలు భోగాలలో తిరుగాడే వేగం తగ్గుతుంది. జిహ్వాచాపల్యం, మాటిమాటికీ తినాలనే కోరిక, అతిగా భుజించడం, ఇవి తినదగినవీ ఇవి తినదగనివీ అన్న విచక్షణ లోపించడం, సాత్విక ఆహారంపట్ల అయిష్టం, తీపి వస్తువులపట్ల బరువైన వస్తువులపట్ల ఇష్టం - ఇటువంటి చెడు అలవాట్లు క్రమక్రమంగా తగ్గుతూపోతాయి. తేలికైనవీ, సులభంగా జీర్ణమయ్యేవి, సరసమైనవీ, సాత్వికమైనవీ అతడికి తృప్తి కలిగిస్తాయి. రాజసిక, తామసిక ఆహారపట్ల విముఖత ఏర్పడుతుంది.

అలాగే, సత్వగుణంతో కూడిన ఆలోచనలవల్ల కామేంద్రియాల ఉత్తేజన అదుపులోకి వస్తుంది. చెడు దారిలో, వ్యభిచార - వాసనలో మనస్సు పరుగెత్తడం తగ్గుతుంది. ఫలితంగా వీర్యరక్షణ సుగమం అవుతుంది.

కామేంద్రియం, స్వాదేంద్రియం (నాలుక) - ఇవే ఇంద్రియాలలో ప్రధానమైనవి. ఇవి అదుపు కావడం ఆరోగ్య రక్షణకూ, శరీర అభివృద్ధికీ దోహదకారి. దీనితోపాటు - శ్రమ, స్నానం, నిద్రించడం - మేలుకోవడం, స్వచ్ఛత, సాదా జీవితం, ఇతర దినచర్యలుకూడ సత్వగుణంతో నిండుతాయి. ఫలితంగా - ఆరోగ్యం, దీర్ఘాయువుల పునాదులు గట్టిపడతాయి.

## జీవితం ఆనందమయం

సద్గుణాల అభివృద్ధివల్ల మానసిక క్షేత్రంలో దోష - దుర్గుణాలు తగ్గుముఖం పడతాయి. మనస్సుకు కాలకల్ప చికిత్స జరుగుతుంది. ఫలితంగా - నిత్య జీవితంలో రోజూ వచ్చే అనేక దుఃఖాలు సహజంగానే పరిష్కారం అవుతాయి. ఇంద్రియ సంయమనంవల్ల, క్రమబద్ధమైన దినచర్యవల్ల శారీరిక రోగాలు నయమవుతాయి. వివేకం మేలుకొనడంవల్ల అజ్ఞానం కారణంగా జనించే చింత, శోకం, భయం, అనుమానం, వ్యామోహం, మమకారం, హాని మున్నగు దుఃఖాలనుండి విముక్తి లభిస్తుంది. దైవవిశ్వాసంవల్ల మతి స్థిరంగా ఉంటుంది. భావి జీవితం విషయంలో నిశ్చింత ఏర్పడి స్థిరపడుతుంది. ధార్మిక ప్రవృత్తివల్ల సాధకుడు పాపానికీ, అన్యాయానికీ, అనాచారానికీ

**మనిషి జ్ఞాపకాలకు ఆధారం పూర్వజన్మ సంస్కారం.**

ఒడిగట్టలేడు. ఫలితంగా - రాజదండన, సమాజ దండన, ఆత్మదండన, ఈశ్వర దండనల దెబ్బలు తప్పుతాయి. సేవ, నమ్రత, ఔదార్యం, దానం, నిజాయితీ, సమాజ శ్రేయస్సు గురించి ఆలోచించడంవంటి గుణాలవల్ల సాధకుడు ఇతరులకు సాయపడతాడు. ఇతరులకు హాని కలిగించాలనే ఆలోచన అతడికి రాదు. ఫలితంగా - ప్రజలు సాధకునికి కృతజ్ఞులు, ప్రశంసకులు, భక్తులు, రక్షకులు అవుతారు. సద్భావనలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడంవల్ల ఆత్మకు తృప్తినిచ్చే ప్రేమ, సంతోషం అనే రసాలు రోజురోజుకూ అధికాధికంగా లభిస్తాయి. జీవితం ఆనందమయం అవుతుంది.

ఈ విధంగా శారీరిక, మానసిక క్షేత్రాలలో సత్ - తత్వం వృద్ధిపొందడంవల్ల ఇరువైపులా ఆనందతరంగాలు ఎగసిపడతాయి. గాయత్రీ సాధకుడు ఆ తరంగాలలో ఓలలాడుతూ ఆత్మసంతృప్తి పొందుతాడు. పరమానంద రసాస్వాదన చేస్తాడు.

## సిద్ధయోగి అవుతాడు సాధకుడు

ఆత్మ పరమాత్మలోని అంశ. కనుక - పరమాత్మలో ఉన్న శక్తులన్నీ బీజరూపంలో ఆత్మలో దాగి ఉంటాయి. ఆ శక్తులు నిద్రాణమై ఉంటాయి. మానసిక తాపముల, విషయ - వికారముల, దోష - దుర్గుణముల గుట్టక్రింద అణగి అజ్ఞాతంగా పడి ఉంటాయి. తాము దీనులమనీ, హీనులమనీ, తుచ్ఛులమనీ, శక్తిహీనులమనీ జనం అనుకుంటారు. అయితే, మనోవికారాల ముసుగును తొలగించి, నిర్మలమైన ఆత్మజ్యోతిని దర్శించగలిగిన సాధకుడు సర్వశక్తివంతమైన పరమేశ్వర జ్యోతి తన ఆత్మలో వెలుగొందుతూన్నదని తెలుసుకుంటాడు. తాను పరమాత్మకు నిజమైన వారసుడనని గ్రహిస్తాడు.

నివురును తొలగిస్తే నిప్పు వెలికివస్తుంది. ఆ నిప్పురవ్వ చిన్నదైనా కార్చిచ్చు కాగలుగుతుంది. ఈ తెర తొలగగానే మామూలు మనిషి మహా ఆత్మ అవుతాడు. మహాత్ముడు అవుతాడు. ఆత్మలో అసాధారణమూ, అద్భుతమూ, ఆశ్చర్యజనకమూ అయిన శక్తి భండారం దాగి ఉంది. అది తెరచుకుంటుంది. అతడు సిద్ధయోగి అవుతాడు.

సిద్ధులు పొందడం కోసం బయటినుంచి దేనినీ తేవలసిన అవసరం లేదు. దేవమానవుల కృప అవసరం లేదు. అంతఃకరణపై క్రమ్ముకున్న ఆవరణలను, ముసుగులను తొలగించవలసి ఉంటుంది. అంతే. గాయత్రి యొక్క సత్వగుణ సాధన అనే సూర్యుడు తామసిక అంధకారం అనే ముసుగును తొలగిస్తాడు. ఆత్మయొక్క సహజమైన ఈశ్వరీయ రూపం వెలికివస్తుంది. ఆత్మయొక్క ఈ నిర్మల రూపం సిద్ధులన్నింటికీ నిలయం.

## వివేకం ద్వారా సుఖ సమృద్ధులు

గాయత్రివల్ల సత్వగుణాలలో కలిగే అభివృద్ధి పలువిధములైన ఆధ్యాత్మిక, సాంసారిక సమృద్ధులకు జన్మనిస్తుంది. శరీరం, మనస్సు నిర్మలం కావడంవల్ల ప్రాపంచిక జీవనంలో సుఖ శాంతులు లభిస్తాయి. ఆత్మలో వివేకం, ఆత్మబలం పెరగడంవల్ల - ఇతరులకు పర్వతాలుగా కనిపించే కష్టాలు సాధకునికి గడ్డిపోచలుగా కనిపిస్తాయి. అతడి పని ఏదీ ఆగదు. అతడి ఇచ్ఛ ప్రకారం పరిస్థితి మారుతుంది. లేదా - పరిస్థితికి అనుగుణంగా అతడు తన ఇచ్ఛను మార్చుకుంటాడు. ఇచ్ఛ, పరిస్థితుల మధ్య వైరుధ్యం మనోవ్యధకు కారణం అవుతుంది. వివేకి ఈ రెండింటిలో ఒకదానిని స్వీకరించి ఆ సంఘర్షణను నివారిస్తాడు. సుఖ శాంతులతో జీవిస్తాడు. అతడి కోసం ఈ పృథివికి స్వర్గమయ ఆనందం అనే సురనది (గంగ) దిగివస్తుంది.

వాస్తవానికి - సుఖానికీ, ఆనందానికి ఆధారం బయటి సాధన సంపత్తిలో లేదు, మనిషి మనఃస్థితిలో ఉంది. రాజస భోజనానికీ, హంసతూలికా తల్పాలకూ అలవాటుపడిన వ్యక్తి ఒక సంత్ ఉపదేశాన్ని పాటించి సన్యాసి అయితే - అడవి నేలే అతడికి పట్టు పరుపు అవుతుంది; కందమూలాలే పంచభక్ష్య పరమాన్నాలు అవుతాయి. మనోభావాలు, ఆలోచనలు మారడంవల్ల ఈ మార్పు వస్తుంది.

## దుఃఖ కారణాల తొలగింపు

గాయత్రి సద్బుద్ధికి, ఋతంభరా ప్రజ్ఞకు అధిష్ఠాన దేవత. సాధకుడు ఆమె నుండి సద్బుద్ధిని యాచన చేస్తాడు.

**యోగాభ్యాసంవల్ల మనలో జ్యోతిర్మయములైన దివ్య అవయవములు నిర్మాణం అవుతాయి.**

ఈ సద్బుద్ధి అన్ని రకాల దుఃఖాల మూల కారణాలనూ తొలగిస్తుంది.

ఈ ప్రపంచంలో రకరకాల దుఃఖాలు ఉన్నాయి. ప్రతి వ్యక్తికీ స్వంత సమస్యలూ, ఇబ్బందులూ ఉంటాయి. ఎవరి చిక్కులు వారివి. వాటి కారణాలుకూడ వేరు వేరుగా ఉంటాయి. అయితే దుఃఖాలన్నింటికీ కారణాలు మూడు - అజ్ఞానం, అసమర్థత, లేమి. త్రిపద అయిన గాయత్రి ఈ మూడు కారణాలనూ తొలగిస్తుంది.

## అజ్ఞానం తెచ్చే దుఃఖం

అజ్ఞానంవల్ల మనిషి దృక్పథం కలుషితం అవుతుంది. మనిషికి తత్వజ్ఞానం తెలియదు. కనుక అతడు తలక్రిందులుగా ఆలోచిస్తాడు. తలక్రిందులుగా, అపసవ్యంగా పనిచేస్తాడు. ఫలితంగా సమస్యల వలయంలో చిక్కుకుంటాడు, దుఃఖిస్తాడు. స్వార్థం, భోగం, లోభం, అహంకారం, ఔదార్య రాహిత్యం, కామ భావనలు మనిషిని కర్తవ్య పథంనుండి తప్పిస్తాయి. అతడు దూరదృష్టిని కోల్పోతాడు. క్షణికములు, క్షుద్రములు, నీచములు అయిన విషయాలను గురించి ఆలోచిస్తాడు. ఆ ప్రకారమే పని చేస్తాడు. ఫలితంగా పాపాలు మూటకట్టుకుంటాడు. పాపాల ఫలితం దుఃఖం. ఖచ్చితంగా.

అంతే కాదు. తన, ఇతరుల కార్యకలాపాల వెనుక ఉన్న మూల కారణాలను అజ్ఞాని తెలుసుకోలేడు. ఫలితంగా - అతడు అసాధ్యములైన ఆశలు పెట్టుకుంటాడు; కోరికలు కోరుకుంటాడు; ఊహలు పెంచుకుంటాడు. ఈ తలక్రిందులు దృక్పథంవల్ల మామూలు విషయాలుకూడ అతడికి దుఃఖమయములుగా కనిపిస్తాయి. కనుక అతడు విచారిస్తాడు, ఏడుస్తాడు, గగ్గోలు పెడతాడు. ఆత్మీయుల మరణం, సహచరుల అభిరుచులు వేరుకావడం, పరిస్థితులలో ఎగుడుదిగుడులు - ఇవన్నీ సహజమైనవే. కానీ - తాను కోరుకున్నదే ఎప్పుడూ జరగాలనీ, ప్రతికూలత అనేది అసలు రాకూడదనీ అజ్ఞాని అనుకుంటాడు. అసాధ్యమైన ఈ ఆశ అడియాస అయ్యేసరికి అతడు హతాశుడు అవుతాడు. దుఃఖిస్తాడు. గావుకేకలు పెడతాడు.

మూడవ విషయం. అజ్ఞానంవల్ల రకరకాల పొరపాట్లు జరుగుతాయి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు అందకుండా పోతాయి, అందువల్ల మనోవ్యథ కలుగుతుంది.

ఇలా అజ్ఞానంవల్ల మనిషి పెక్కు దుఃఖాలు అనుభవిస్తాడు.

## బలహీనునికి దుఃఖమే దుఃఖం

శారీరికమూ, మానసికమూ, సామాజికమూ, బుద్ధిపరమూ, ఆత్మపరము అయిన బలహీనతలు కారణంగా మనిషి సహజసిద్ధమూ, జన్మసిద్ధమూ అయిన తన అధికారాల బరువును మోయలేకపోతాడు. ఫలితంగా వాటిని కోల్పోతాడు. ఆరోగ్యం చెడిపోయింది; రోగం పట్టుకుంది. ఆ స్థితిలో రుచికరమైన భోజనం, అందమైన భార్య, మధుర గీతాలు, సుందర దృశ్యాలు నిరర్థకాలు అవుతాయి. సిరి సంపదలవల్ల అతడికి చెప్పుకోదగ్గ సుఖం లభించదు. బుద్ధి మందగిస్తే - సాహిత్యం, కావ్యం, దర్శనం, మననం, చింతనల ఆనందం లభించదు. ఆత్మ బలహీనపడితే - సత్సంగం, ప్రేమ, భక్తి మున్నగువానినుండి ఆత్మానందం లభించదు.

అంతే కాదు. బలహీనులను నిర్మూలించడానికై ప్రకృతిలోని 'ఉత్తముల రక్షణ' సిద్ధాంతం అమలు జరుగుతుంది. బలహీనులను వేధించడానికీ, నశింపజేయడానికీ ఎన్నో వాస్తవాలు వెలికివస్తాయి. దోషరహితములు, సాదాసీదావీ అయిన తత్వాలు సైతం బలహీనుణ్ణి వ్యతిరేకిస్తాయి. చలి బలవంతుల బలాన్ని పెంచుతుంది. రసికులకూ రసాన్ని ఇస్తుంది. అదే చలి బలహీనులలో నిమోనియావంటి రోగాలకు కారణం అవుతుంది, బలహీనులకు ప్రాణాంతకాలు అయిన తత్వాలు బలవంతులకు సహాయకాలు అవుతాయి. బలహీనులు ఎప్పుడూ కష్టాలపాలు అవుతారు. వారికి మంచి తత్వాలు సైతం ఆశావహములుగా పరిణమించవు.

## కొరతలు తెచ్చే దుఃఖాలు

కొరతలు పలు విధాలు. వస్తువుల కొరత ఒకటి. అన్న వస్త్రాలు, నీరు, ఇల్లు, పశువులు, భూమి, సహాయకులు, మిత్రులు, ధనం, ఔషధాలు, పుస్తకాలు, ఆయుధాలు,

**ఆలోచనా శక్తి నిజమైన శక్తి.**

అధ్యాపకులు కొరవడడంవల్ల రకరకాల దుఃఖాలు కలుగుతాయి. తప్పనిసరి అవసరాలను తగ్గించుకుని మనస్సును చంపుకోవలసివస్తుంది. జీవితంలోని విలువైన సమయం వృధా అయిపోతుంది. యోగ్యుడు, సమర్థుడు అయిన వ్యక్తిసైతం సాధనాలు కొరవడినప్పుడు నిస్సహాయుడు అయిపోతాడు. దుఃఖంతో విలవిలలాడతాడు.

### కామధేనువు గాయత్రి

గాయత్రి కామధేనువు. ఆమెకు పూజ, ఉపాసన, ఆరాధన, వందనం చేసిన వ్యక్తి ప్రతి క్షణం అమృతంవంటి తల్లిపాలు త్రాగిన ఆనందాన్ని పొందుతాడు. అజ్ఞానం వల్ల, బలహీనతవల్ల, కొరతవల్ల కలిగే దుఃఖంనుండి విముక్తి పొందుతాడు. తాను కోరుకున్న ఫలాలను పొందుతాడు. యోగ్యుడైన గురువు మార్గదర్శనంలో జరిపిన గాయత్రీ సాధన ఆశించిన ప్రయోజనాలను అందిస్తుంది.

ఈ సాధనలలో సాఫల్యాన్ని పొందడానికి కొద్దోగొప్పో సమయం పట్టవచ్చు; కొద్దో గొప్పో శ్రమ అవసరం కావచ్చు. కానీ, కష్టదాయకములైన ఇతర సాధనలకన్న ఈ సాధనలు త్వరగా సాఫల్యాన్ని ఇస్తాయి. కష్టసాధ్యమూ, సుదీర్ఘమూ అయిన యోగ మార్గం గాయత్రి ద్వారా అత్యంత సరళం అయిపోతుంది. వనవాసులైన తపస్వులు పొందే సాఫల్యాలను గృహస్థు ఇంటిలో నివసిస్తూనే పొందగలుగుతాడు.

కష్టాలు కలిగించే భవ బంధనాలనూ, మాయా మోహాల సంకెళ్లనూ త్రెంచుకుని, పరమలక్ష్యాన్ని సాధించడం ఇతర మార్గాలద్వారాకన్న ఈ మార్గంద్వారా మరింత సరళం అవుతుంది. గాయత్రీ సాధనద్వారా మనస్సు సంస్కరించబడుతుంది; వ్యక్తిత్వం వికసిస్తుంది; దుఃఖాలు తొలగిపోతాయి; ఆత్మపరంగా ఎదుగుదల జరుగుతుంది. ఇవన్నీ దివ్య వరాలు. అంతే కాదు, ఎన్నో సిద్ధులుకూడ అందుతాయి. క్రమంగా ఈ శక్తులను సంపాదిస్తూ సాధకుడు అసాధారణమూ, నిరుపమానమూ, అద్వితీయమూ అయిన వ్యక్తిత్వాన్ని గాయత్రీ మాత దివ్యవరంగా ఆర్జిస్తాడు.

H H H

## రత్నాలను పోగొట్టుకొన్న అవివేకి

నీటిలో పడిన వస్తువులను పైకి తెచ్చే పని చేసేవాడు ఒకడు చాలారోజుల నుండి విఫలుడుగా ఉన్నాడు. ఘోర పరిశ్రమ చేసినా చేతికేమీ లభించుట లేదు. పొట్టలో ఎలుకలు పరుగెత్తుతున్నాయి. మార్గమేదీ తోచుట లేదు. ఒకరోజు ఒడ్డున కూర్చుని దేవతను ఎంతో ప్రార్థించాడు - "మీరు సహాయపడకపోతే నేను ఎలా జీవిస్తాను?" దేవతకు దయ కలిగింది. ఈ సారి మునకవేయగా చేతికి ఒక పొట్లం తగిలింది. తీసి చూడగా దానిలో చిన్నచిన్న రాళ్ళు నిండి కట్టబడిఉన్నాయి. అతడు తన దౌర్భాగ్యానికి తనను నిందించుకొన్నాడు. దేవతను నిష్ఠురురాలంటూ రాతిముక్కలను నీళ్ళలో పారవేయుట ప్రారంభించాడు. తన వృత్తినే మానివేయాలని ఆలోచించసాగాడు. రేపటి నుండి చేపలు పడ్తాను, వెంటనే రొక్కం లభిస్తుంది. పైగా ప్రమాదానికి అవకాశం ఉండదు. ఇలా ఆలోచిస్తూ ఆ రాతిముక్కలు ఒక్కటొక్కటే పారవేస్తూ ఉన్నాడు. చివరి ముక్కను పరికించి చూడగా, అది అతిఖరీదైన నీలం. దేవతానుగ్రహంతో లభించిన ఈ సంపత్తినంతా తన చేతులతో పోగొట్టుకొన్నందుకు చాలా దుఃఖం కలిగింది. దేవత ప్రత్యక్షమై అన్నది - "ప్రపంచంలో నీవొక్కడివే తెలివితక్కువ వాడివి కావు. ప్రజలు రత్నరాశికంటే విలువైన జీవన సంపదను ఇలాగే పోగొట్టుకొంటున్నారు. వెళ్ళు. మిగిలిన దాన్ని అమ్ముకొని ఈ రోజు గడుపుకో. వివేకం పెంచుకో. ధనం పొందటమే కాక, దానిని ఉపయోగించటం కూడా నేర్చుకో."

స్త్రీ కూడా సమాజంలో అటువంటి విలువైన రత్నమే. దానిని గవ్వపెంకులా పారవేసుకొని తర్వాత తలబాదుకుంటూ ఉన్నారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**సాహసవంతులనే వరిస్తుంది అదృష్టం.**

# మూర్తీభవించిన గాయత్రీ మహాశక్తి ఆయన

## గాయత్రీమయ జీవితం

"నన్ను తెలుసుకున్న వ్యక్తి గాయత్రిని తెలుసుకున్నాడని గ్రహించండి."

- అని 1986లో వసంత పంచమి పర్వదినాన చేసిన చరిత్రాత్మకమైన ప్రసంగంలో పరమపూజ్య గురుదేవులు ప్రకటించారు.

పూజ్యవరుల జీవితం యావత్తూ గాయత్రీమయం అన్నది నిస్సంశయం. అనవరతమైన గాయత్రీ సాధనా నిష్ఠ వారిని తపోనిష్ఠులను చేసింది. వేదమాత వరద పుత్రులై వారు వేదమూర్తిగా ప్రసిద్ధిపొందారు.

## ఆదిశక్తి, వేదమాత, విశ్వమాత

వేదమాత గాయత్రి సృష్టిలోని ఆదిశక్తి. మొట్ట మొదట బ్రహ్మ కఠోర తపస్సు చేసి, గాయత్రి రహస్యాన్ని తెలుసుకున్నాడు. తద్వారా ఆయన సృష్టికి అవసరమైన జ్ఞాన విజ్ఞానాలనూ, శక్తి సామర్థ్యాలనూ పొందగలిగారు.

గాయత్రి జ్ఞాన విజ్ఞానాలకు మూల స్రోతస్సు, జన్మ స్థలం. కనుకనే గాయత్రి వేదమాత అయింది. వేదాలలో నిండి ఉన్న జ్ఞాన విజ్ఞానాలన్నీ బీజ రూపంలో గాయత్రీ మంత్రంలో ఇమిడి ఉన్నాయి. దేవ శక్తులన్నీ ఈ మహాశక్తిలోని వివిధ ప్రవాహాలు. ఆ శక్తులన్నీ ఈ మహాశక్తి నుండి జనించాయి; దీనినుండే పోషణ పొందుతున్నాయి. కనుక గాయత్రి దేవమాత. విశ్వమంతా గాయత్రి గర్భంనుండి ఉత్పత్తి అయింది. కనుక, గాయత్రి విశ్వమాత.

## త్రిపద

ఈవిధంగా - వేదమాత, దేవమాత, విశ్వమాత అయిన గాయత్రి సృష్టికి మూలశక్తి. గాయత్రి త్రిపద. సత్వగుణం, రజోగుణం, తమోగుణములు ఆధారాలుగా గాయత్రిని సరస్వతి, లక్ష్మి, కాళికలని పిలుస్తారు. ఈ దేవతలు వరుసగా సద్బుద్ధికీ, పోషణకూ, శక్తికీ అధిష్ఠాన శక్తులు, ఉత్పత్తి, పోషణ, పరివర్తనల పుంలింగ శక్తుల రూపంలో ఇవే బ్రహ్మ, విష్ణుమూర్తి, మహేశ్వరుడు అని పిలువబడుతున్నాయి. ప్రాణ రక్షక శక్తి కారణంగా ఈ దేవతను గాయత్రి అని పిలిచారు. వ్యక్తిలో సద్బుద్ధినీ, సద్భావాన్నీ మేలుకొలిపే ఈ మహాశక్తి వాస్తవానికి ధరిత్రిలోని కామధేనువు. తన పాలను త్రాగేవారి దుఃఖాన్నీ, సంతాపాన్నీ, లేమినీ ఈమె తొలగిస్తుంది. వారికి సుఖ శాంతులనూ, సామర్థ్యాన్నీ ప్రదానం చేస్తుంది.

## సంస్కృతికి జనని

ఈ విశిష్టతలు కారణంగా గాయత్రిని భారతీయ సంస్కృతికి జననిగా కీర్తించారు. భారతీయ జీవనంలో గంగానదికి ఉన్న విశిష్టత జ్ఞాన గంగ అయిన గాయత్రికి ఉన్నది. పరమపావని అయిన గంగ శరీరంలోని మాలిన్యాలను తొలగిస్తుంది. శరీరాన్ని స్వచ్ఛంగా, నిర్మలంగా చేస్తుంది. జ్ఞాన గంగ అయిన గాయత్రి ఆత్మను పవిత్రం చేస్తుంది. ఆదికాలం నుండి నేటివరకు - మహర్షులందరూ ఏకగ్రీవంగా గాయత్రి మహిమను గానం చేశారు. అవతార పురుషులందరూ గాయత్రిని ఉపాసన చేశారు. భారతీయ జీవనంలో గాయత్రీ మహావిజ్ఞానం లోపించినప్పుడల్లా, ఇక్కడి సంస్కృతి పతన, పరాభావాల కూపంలోనికి దిగిపోయింది. ఈ మహావిజ్ఞాన పునరుద్ధరణలోనే భారతీయ సంస్కృతీ సభ్యతల పునరుద్ధరణ ఇమిడి ఉంది.

## నవయుగ విశ్వామిత్రుడు

ఈ యుగంలో పరమపూజ్య గురుదేవులు తన

**ఇతరులను ద్వేషించడం ఎలుక ఉన్నదని ఇంటిని తగలబెట్టుకోవడమే.**

కఠోర తపో సాధన ద్వారా గాయత్రిలో లోపించిన శక్తులను వెలికితెచ్చారు. గాయత్రీ మహావిద్యనూ, దాని మహావిజ్ఞానాన్నీ వ్యక్తి వ్యక్తికీ అందించాలని సంకల్పం చేశారు. 24 లక్షల 24 మహాపురశ్చరణలు పూర్తయిన సందర్భంలో 1951 ఆగస్టులో అఖండజ్యోతిలో వారు తమ అనుభూతులను ఇలా వర్ణించారు-

"మా జీవితంలో అధిక భాగం గాయత్రీ మాత ఒడిలో గడచింది. ఆధ్యాత్మిక సాధనలలో గాయత్రీ సాధనను మించిన సాధన ఏదీ లేదని ఈ మహామంత్రంపై వ్రాయబడిన వేలాది ఆర్ష గ్రంథాల పరిశోధన ద్వారా మేము తెలుసుకున్నాము.''

గాయత్రీ మహామంత్రంపై ఉన్న నిషేధాలన్నింటినీ నిర్మూలించడం, దానిని అందరికీ అందుబాటులోకి తేవడం అనే పనిని ఈ మహాశక్తితో ఏకరూపం అయిన సమర్థ సత్తామాత్రమే చేయగలుగుతుంది. తన భగీరథ తపో సాధనద్వారా గాయత్రీ మహాశక్తి అనే జ్ఞానగంగను ఈ భూమిపై ప్రవహింపజేసిన పూజ్య గురుదేవులు ఈ యుగపు విశ్వామిత్రులు. విశ్వామిత్రుడు గాయత్రీ మహామంత్రానికి ప్రథమ ద్రష్ట అయిన మహర్షి. గాయత్రీ జయంతి మహాపర్వం రోజునే ఆయన ఆ మహామంత్రాన్ని దర్శించారు. ఆ మహామంత్రం ఆధారంగా ఆయన బ్రహ్మర్షి పదాన్ని పొందారు; సృష్టి నిర్మాణ, సంచాలనల శక్తిని సంపాదించారు. ఈ శక్తి ఆధారంగా ఆయన నవసృష్టి జరిపే సాహసం చేశారు.

## సహస్రాంశు బ్రహ్మయజ్ఞం

ఈ యుగంలో పరమపూజ్య గురుదేవులు చేసిన నవనిర్మాణం అనే యుగ పరివర్తన పురుషార్థం ఈవిధమైన సత్‌సాహసమే.

1947 ఆగస్టు 15న మన దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం లభించింది. సుదీర్ఘ సంఘర్షణ తర్వాత, ఎన్నెన్నో త్యాగ బలిదానాల ఫలితంగా వచ్చింది ఆ స్వరాజ్యం. అయితే, మన దేశం గణతంత్ర రాజ్యంగా 1950న రూపొందింది. 1926 వసంత పంచమి రోజున ప్రారంభమైన గురుదేవుల 24 సంవత్సరాల తపో సాధన ఆ సంవత్సరంలోనే పూర్తయింది. దానితోపాటే సహస్రాంశు బ్రహ్మయజ్ఞం రూపంలో యుగ పరివర్తన మహా సంకల్పం కూడ ఆవిర్భవించింది.

సహస్రాంశు బ్రహ్మయజ్ఞం ప్రభావంవల్ల యుగ పరివర్తన ఎలా జరుగుతుందో 1951 నవంబరు అఖండజ్యోతిలో వారీ విధంగా వివరించారు -

"ఈ మహాయజ్ఞం మహత్తరమైన సత్‌ఫలితాలను ప్రసాదిస్తుంది. ఈ యజ్ఞంలో యుగ పరివర్తన బీజం ఇమిడి ఉంది. నవ ప్రభాతపు పుణ్య సంధ్యలో బ్రాహ్మీ సాధన అవసరం అవుతుంది. అలాగే - రకరకాల పాప తాపాలతో బాధలకు గురిచేస్తూ చిమ్మచీకటితో నిండిన ఈ పరిస్థితిని పరివర్తన చేసి, శాంతియుతమైన కృతయుగ ఉషోదయాన్ని స్వాగతించడానికే ఈ మహాయజ్ఞం జరుగుతోంది.''

## గాయత్రి ఉపాసనద్వారా నరరత్నాల ఉత్పత్తి

పరమపూజ్య గురుదేవులు తమ భావి లక్ష్యాన్ని వివరిస్తూ జూన్ 1953 అఖండజ్యోతి 29వ పుటలో ఇలా వ్రాశారు -

"తపిస్తున్న మానవాళికి త్రోవ ఇవ్వడం. ఆధ్యాత్మిక నిష్ఠనూ, ధర్మ ధారణనూ ప్రతిష్ఠించడం, మాతృశక్తి మహిమను చాటిచెప్పడం, భారతీయ సంస్కృతి పునరుద్ధరణ - ఇవే మన లక్ష్యాలు. సదాచారం, ప్రేమ, కర్తవ్య పరాయణత్వం, సద్భావం, పవిత్రత, సంయమనం,

**పనిచేయని వ్యక్తికి నమ్మకం ఉన్నా ప్రయోజనం ఉండదు.**

సద్బుద్ధి, ఆస్తికత, మానవోచితమైన జీవనానికి తగు వ్యవస్థ - ఇవే మన కార్యక్రమాలు. గాయత్రీ ఉపాసన ఈ దేవ సంపదలకు కేంద్ర బిందవు.''

ఈ సత్యాన్ని మరింత స్పష్టంగా ప్రకటిస్తూ వారు ఆగస్టు 1953 అఖండ జ్యోతి 11వ పుటలో ఇలా వ్రాశారు -

"నైతిక, ధార్మిక వాతావరణాన్ని నిర్మించడమే జాతి నిర్మాణానికి నిజమైన పునాదిరాయి. ప్రభుత్వాల ద్వారా జరిగే పని కాదిది. సంత్‌లూ, తాపసుల పని ఇది. గాయత్రీ మహాశక్తి ద్వారా భారత్ తిరిగి తన లక్ష్యాన్ని సాధిస్తుంది. ఈ మహావిద్య ఆధారంగా కోల్పోయిన మన రత్న భండారాలను కనుగొనగలుగుతాము. జాతి అంతటిలో తపస్సు పెరగడంవల్ల నరరత్నాలు ఉత్పన్నం అవుతారు. వారు వివిధ సమస్యలను సులువుగా పరిష్కరించగలుగుతారు.''

అక్షర సత్యం ఈ మాట. వాస్తవానికి - భారతీయ సంస్కృతి, ధర్మం, ఆత్మ విజ్ఞానముల మూలాధారం గాయత్రిగా ఉంటూవచ్చింది. ప్రాచీన కాలంలో మహర్షులు ఈ మహాశక్తిని ఉపాసించి, ప్రపంచాన్ని జ్ఞాన విజ్ఞానాల వెలుగు వెల్లువతో ముంచెత్తారు. ప్రాచీన భారతీయ వైభవోజ్వల చరిత్రకు మూలాధారం సాధనద్వారా జనించిన ఆత్మశక్తియే. ఆనాడు మనదేశం తన ఆచరణ కారణంగా, ఆంతరిక బలం కారణంగా ప్రపంచానికి దీప స్తంభంగా, ధృవతారగా వెలుగొందింది, జగద్గురువుగా విరాజిల్లింది. మన దేశపు భావి ప్రతిష్ఠకు ఆధారంకూడ ఇదే అవుతుంది.

పరమపూజ్య గురుదేవుల జీవితం యావత్తూ ఈ మహాలక్ష్య సాధనకే అంకితం అయింది. వారు స్వయంగా వేదమాత గాయత్రికి మహిమామయ తేజోమూర్తిగా ప్రకాశించారు. వారు మూర్తీభవించిన గాయత్రీ మహాశక్తి.

గాయత్రి యొక్క సజీవ సాకార మూర్తి అయిన పరమపూజ్య గురుదేవులు 1990 జూన్ 2న గాయత్రీ జయంతి పర్వదినాన నిరాకారుని విరాట్ విస్తరణలో విలీనం అయినారు. దీనితోపాటు వారి తపో చేతన మరింత విస్తృతం అవుతూ వచ్చింది. తన వరద పుత్రుణ్ణి తనలో లీనం చేసుకుని, వేదమాత గాయత్రి స్వయంగా మహిమాన్విత అయింది. గాయత్రీ మహామంత్ర సాధన ద్వారా ఎవరైనా ఈ మహిమను తెలుసుకోగలుగుతారు. ఈ సాధనలో జీవితం యొక్క అభ్యుదయం, పూజ్యవరుల దివ్య ఆశీస్సు - రెండూ ఇమిడి ఉన్నాయి.

H H H

## విదుషీమణి రమాబాయి

పూనాకు చెందిన జడ్జి మహాదేవ గోవింద రానడే ఆ కాలంలో ప్రసిద్ధ కాంగ్రెసు నాయకుడు. ఆయనకు చిన్న తనంలోనే వివాహమయ్యింది. ధర్మపత్ని రమాబాయికి ఏమీ చదువు లేదు. కానీ కుటుంబ నిర్వహణలో కుశలురాలు. మూర్తీభవించిన సజ్జనత్వం అయిన రానడే భార్యను చదివించటం ప్రారంభించాడు. ఆమె గొప్ప విద్వాంసురాలైంది. భర్తతో పాటు సార్వజనిక కార్యక్రమాలలో పాల్గొనేది. మరాఠీ, ఆంగ్లం, బెంగాలీ మూడు భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించింది. వితంతువైన తర్వాత మహిళల సేవకోసం 'మాతృ సదన్' స్థాపించి తన సమస్త సంపత్తి దానికి వినియోగించింది. ప్రతి కోణంలోనూ ఆమె ఆదర్శ గృహస్థురాలైంది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ప్రతీకారం తీర్చుకోవడంకాక ఓర్చుకోవడం నిజమైన వీరత్వం.**

ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం - 1

# గాయత్రి పంచముఖముల సందేశం

*పరమపూజ్య గురుదేవులు రచించిన "గాయత్రీ మహావిజ్ఞాన్" గాయత్రిపై విజ్ఞాన సర్వస్వంగా విశ్వవిఖ్యాతి పొందింది. ప్రాచీన శాస్త్ర గ్రంథాలలోని అనేక అమూల్య విషయాలతో పాటు గాయత్రి తపస్సులో తాము పొందిన దివ్య అనుభవాల సారాన్ని కూడ వారా గ్రంథంలో పొందుపరచారు. ఆ హిందీ గ్రంథాన్ని శ్రీ డి.వి.ఎన్.బి.విశ్వనాథ్ తెలుగులోనికి అనువదించారు. ఆ తెలుగు గ్రంథం మూడవ భాగాన్ని ఈ గాయత్రి జయంతి ప్రత్యేక సంచిక నుండి ధారావాహిక ప్రచురిస్తున్నాం.*

గాయత్రి పంచముఖి యని పిలువబడుతున్నది. శంకరుని వలె గాయత్రి కూడా పంచముఖియే. ఈ విధమైన వర్ణన పురాణాలలో చాల చోట్ల మనకు కనిపిస్తుంది. దేవతలకు చేతులు, ముఖములు హెచ్చుగా ఉండడం మనకు విచిత్రంగా కనిపిస్తుంది. ఎన్నో సందేహాలు కలుగుతాయి. నాలుగు ముఖములు గల బ్రహ్మదేవుడు, పంచముఖుడైన శంకరుడు, ఆరు ముఖములు కలిగిన కార్తికేయుడు, చతుర్భుజుడైన విష్ణువు, అష్ట భుజముల దుర్గ, దశ భుజములు కలిగిన గణేశుడు ప్రసిద్ధులు. ఇంకా పది తలలు కలిగి ఇరువది చేతులు కలిగిన రావణాసురుడు, సహస్ర బాహుడైన కార్తవీర్యార్జునుడు, వేయి కనులు గలిగిన దేవతల రాజు ఇంద్రుడు ఉన్నారు.

ఇందువలన ఎదురయ్యే ప్రశ్నలు, సమస్యలు ఆకర్షణీయంగా ఉంటాయి. రహస్యాలను విడగొట్టి జవాబీయడానికి ఉపక్రమించినప్పుడు ఒక విశేష, మహత్తర మనోవైజ్ఞానిక ప్రక్రియ వికసిస్తుంది. చిన్న పిల్లలు ప్రశ్నలు వేసినప్పుడు వారికి జవాబీయడానికి మన మస్తిష్కాన్ని దూరతీరాలకు పయనింపచేసినప్పుడు బుద్ధికి తగినంత పని కల్పిస్తాము. మనకు జవాబు దొరకకపోతే ఇతరుల నడిగి తెలుసుకుంటాము. అటువంటి ప్రశ్నలకు జవాబులు దొరకకపోతే మనస్సులో గొప్ప ఉత్సుకత, వ్యాకులత చోటు చేసుకుంటాయి. ఈ విధంగా సీదా సాదా ప్రశ్నలకు జవాబు లీయడం వలన పిల్లల బుద్ధి వికసిస్తుంది. మనసుకు ఆహ్లాదం కల్గుతుంది.

## దేవతల అధిక అంగముల రహస్యం

దేవ దానవుల అధిక ముఖములు, అధిక అంగముల చిక్కు ప్రశ్నల వలన తత్వ సంబంధమైన ప్రముఖ తథ్యముల రహస్యాలు తెలుస్తాయి. వీని వైచిత్ర్యం ఆలోచింప జేస్తుంది. అన్వేషణ పెరుగుతుంది. ఇటువంటి చిక్కు ప్రశ్నలు లేకపోతే దృష్టి ఇటువంటి రహస్యమయ విశేషముల వైపుకు పోదు. అందు మూలకంగా ఎంతో అమూల్యమైన విజ్ఞానాన్ని మనం తెలుసుకొనే అవకాశమును పోగొట్టుకుంటాము. ప్రశ్నోత్తరముల ద్వారా పిల్లలు తెలుసుకున్నది ఎన్నటికీ మరచిపోరు. ఆధ్యాత్మిక కక్ష్యలోని విద్యార్థులుకూడ ఎక్కువ ముఖములు కలిగిన దేవతలను గురించి తెలుసుకోవాలని ఉత్సాహము కల్గినంతనే వివరాలు తెలుసుకోగలుగుతారు. దానికి కారణం అవి దివ్యశక్తులతో సంబద్ధం కావడమే.

సమయం వచ్చినప్పుడు ఇతర దేవతల విషయం చెప్పుకుందాము. హనుమంతులవారి తోక, వినాయకుని తొండం, హయగ్రీవుని అశ్వముఖం, బ్రహ్మ నాల్గు ముఖములు, దుర్గ ఎనిమిది భుజములు, శివుని మూడు కన్నులు. కార్తికేయుని ఆరు ముఖములు, ఈ దేవతల మూషిక, మయూర, వృషభ, సింహాది వాహనముల విస్తృత వర్ణన అప్పుడు తెలుసుకుందాము.

ప్రస్తుతం మనం గాయత్రీ పంచముఖములను గురించి మాత్రమే తెలుసుకుందాము. గాయత్రి సువ్యవస్థిత ధార్మిక జీవనంలోని అవిచ్ఛిన్నమైన అంగము. అందువలన దాని మర్మ రహస్య తథ్య ఉపకరణములను గురించి తప్పక

**బలహీనుడికి అడ్డం అయిన రాయి బలవంతుడికి సోపానం అవుతుంది.**

తెలుసుకొని తీరాలి. డాక్టరు, ఇంజనీరు, మెకానిక్, వడ్రంగి, కమ్మరి, అద్దకం చేసేవాడు, మిఠాయి తయారుచేసి అమ్మేవాడు, గాయకుడు, రైతు మొదలైన అన్ని వర్గముల వ్యక్తులు తమ తమ పనులను, పనిముట్లను గురించి, ప్రయోగ విధిని గూర్చి, హాని లాభములను గురించి పూర్తిగా తెలుసుకుని ఉంటారు. గాయత్రీ మహావిజ్ఞానము నందలి అన్ని విషయములను తెలిసికొని ఉండాలి. లేకపోతే సాఫల్య క్షేత్రము అందుబాటులోనికి రాదు. గాయత్రిలోని పంచముఖముల మహాశక్తిని, సత్యములను, వాస్తవములను తెలిసి సరియైన అవగాహనతో సంసార సాగరము నందలి దుస్తర దురితములను అతి తేలికగా దాటవచ్చు. ఋషులు చెప్పిన మాట ఇది.

గాయత్రి పంచ ముఖములు గాయత్రీ మంత్రంలోని పంచ భాగములు (1) ఓం (2) భూః భువః స్వః (3) తత్స వితుర్వ రేణ్యం (4) భర్గోదేవస్య ధీమహి (5) ధియో యోనః ప్రచో దయాత్. యజ్ఞోపవీతము నందు పంచభాగము లున్నవి. మూడు సరములు, నాల్గవది మధ్య గ్రంధి. ఐదవది బ్రహ్మగ్రంధి. పంచదేవతలు ప్రసిద్ధులు. ఓం అనిన గణేశుడు. వ్యాహృతులు భవాని. ప్రథమ చరణం బ్రహ్మ. ద్వితీయ చరణం విష్ణువు. తృతీయ చరణం మహేశుడు. ఈ రీతిని ఆ దేవతలు గాయత్రి యొక్క ప్రముఖశక్తి పుంజములుగా చెప్పబడిరి.

గాయత్రి యొక్క ఈ పంచభాగములలోను మానవ జీవితము నందలి బాహ్య, అంతరంగిక సమస్యలను పరిష్కరించ గల సందేశం నిక్షిప్తమై ఉన్నది. మనమెవరము? ఏ కారణము వలన జీవితమును ధరింపవలసి వచ్చినది? మన లక్ష్యమేమి? దరిద్రులముగా దీనులముగా ఎందుకు ఉండవలసి వచ్చినది? ప్రాపంచిక సౌఖ్యములతో పాటు ఆత్మశాంతి నెటుల పొందవచ్చును? జనన మరణ చక్రమునందు మనల నే బంధము బందీ చేయుచున్నది? ఏ యుపాయమున విడుదల పొందగలము? అత్యంతానంద ప్రాప్తి ఎక్కడ? విశ్వమేది? విశ్వమునకు మనకు గల సంబంధమేమి? ఈ విధమైన ప్రశ్నలకు సరళమైన సమాధానములు ముందు చెప్పబోవు పంచకములందు దొరుకుతాయి. గాయత్రి యొక్క పంచముఖము లందు లెక్కింప నలవిగాని సూక్ష్మ రహస్యములు, తత్వములు నిక్షిప్తమై ఉన్నవి. అవి తెలుసుకున్న వారికి ఎంత తృప్తి కలుగుతుందీ అంటే ఇంకా ఏదో తెలుసుకోవాలనే విషయం వారికి తట్టదు. ఉద్దాలక మహర్షి వివరించిన గాయత్రీ విద్య తెలిసిన వారికి తెలిసికొనవలసినది ఏదీ మిగలదు. నాలుగు వేదములు, యజ్ఞం, గాయత్రి యొక్క పంచముఖములు - ఇందు సమస్త జ్ఞాన విజ్ఞానములు, ధర్మ కర్మములు బీజరూపంలో కేంద్రీభూతమై ఉన్నవి.

శరీరం పంచ తత్వములతో నిర్మించబడినది. ఆత్మ పంచ కోశములచే ఆవరింప బడినది. మట్టి, నీరు, గాలి, నిప్పు, ఆకాశముల మిశ్రమంతో శరీరం తయారవుతుంది. గాయత్రి పంచముఖములు దానినే తెలియజేస్తాయి. ఈ శరీరం పంచతత్వముల మిశ్రణమే కాని వేరేమీ కాదు. కానీ శరీరం మనకెంతో ఉపయుక్తమైన పనిముట్టు, సేవకుడు, వాహనము. "నువ్వు" నీ శరీరమే అనుకుంటే పొరపాటు. ఈ పొరపాటునే మాయ అనీ, అవిద్య యనీ పిలుస్తారు. శరీరముయొక్క, జగతియొక్క వాస్తవ రూపాన్ని తెలుసుకున్న తరువాత మానవుడు మోహనిద్ర నుండి మేలుకొని సంచయం, అధికారం, మోహము అను బాల్యక్రీడలకు వెగటుపొంది ఆత్మకల్యాణం వైపు అడుగువేస్తాడు. గాయత్రీ పంచముఖముల సందేశమిదే! పంచ తత్వములతో తయారుకాబడిన పదార్థాలను ఉపయోగించుకోవాలి. అంతేకాని వానియందు తన్మయత్వాన్ని, ఆసక్తిని, మోహాన్ని, తాదాత్మ్యాన్ని పెంచుకోకూడదు.

H H H

**సాధుత్వం పనికిరాని చోట కఠినత్వం ప్రదర్శించదగినదే.**

కబీరు జయంతి వ్యాసం

# ఆచరణలో అధ్యాత్మ : కబీరు జీవన వేదం

## జన్మకథను దాచని కబీరు

ఒక వితంతువు అపుడే పుట్టిన తన శిశువును సమాజానికి వెరచి కాశీలోని అగర్తలా చెరువు ఒడ్డున ఉన్న కాలిబాటమీద వదలివేసింది. ఆ దారిన పోయే పుణ్యాత్ములు ఎవరైనా ఆ శిశువును తీసుకువెళ్లి పెంచుతారనే ఆశతో. ఆ పిల్లవాణ్ణి ఒక ముస్లిం చేనేత కార్మికుడు పెంచాడు. ఆ కార్మికుని పేరు నీరూ. అతడి భార్య పేరు నీమా. ఈ కుటుంబంలోనే ఆ పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యాడు. అతడీ విషయాన్ని ఎన్నడూ దాచలేదు. ఆనాటి హిందూ సమాజంలోని సంకుచితత్వాన్నీ, ముస్లిం సమాజంలోని ఔదార్యాన్నీ ఈ విషయంద్వారా గుర్తుచేయడానికి అతడు ప్రయత్నించాడు. సమాజ నాయకులు వితంతువుల సమస్యలను కొత్త కోణంనుంచి పరిశీలించాలనే ఉద్దేశ్యంతో, భార్యను కోల్పోయిన పురుషునికి రెండో పెళ్లి చేసుకునేందుకు పూర్తి హక్కు ఉన్నప్పుడు వితంతువులైన స్త్రీలకు ఆ హక్కు ఎందుకు ఉండకూడదని ఆలోచించాలనే ఉద్దేశ్యంతో ఆయన అలా చెప్పారు. ఆయన పేరు కబీరు.

## గురుదీక్ష

ఒక రోజున బ్రహ్మ ముహూర్తంలో గురువు రామానందజీ గంగా స్నానానికి వెళుతున్నారు. పెద్దవాడయిన కబీరు ఆ దారిలో పడుకున్నాడు. ఆ చీకటిలో గురువుగారి పాదం కబీరు గుండెమీద పడింది. ఆయన నివ్వెరపోయారు. 'రామ - రామ' అంటూ వెనుకకు అడుగు వేశారు. అదే కబీరుకు గురుదీక్ష అయింది. ఇందులో గురువుగారి అనుగ్రహం లేదు. శిష్యుని విశ్వాసమే ఉంది. ఈ విశ్వాసం కాలక్రమంలో ఫలించి పుష్పించింది.

15 సంవత్సరాల వయస్సులో అతడి అంతరంగంలో ఒక కొత్త ప్రేరణ ఉదయించింది. "నీ జీవితం మహత్తర లక్ష్యాల సాధన కోసం ఉద్దేశించబడింది" - అన్నదే ఆ ప్రేరణ. అతడు తానేమి చేయాలని పలువిధాలుగా తర్జన భర్జన చేసుకున్నాడు. దారి తప్పిన జన మానసానికి సరైన దారి చూపాలని నిర్ణయించుకున్నాడు. అతడు తెల్లవారుజామునే లేచి, తండ్రి వృత్తిని చేపట్టేవాడు. తనకు కడుపునిండేటంత పని చేసి, బయటికి వెళ్లేవాడు. ఇంటింటిలో, వీధి వీధిలో, పల్లె పల్లెలో భావజ్యోతిని వెలిగించేవాడు. అతడి ఆలోచనలను విన్న ప్రతిఒక్కడూ చలించిపోయాడు. కొద్ది రోజులలోనే వేలాది మంది ఆయన ప్రశంసకులుగా, సమర్థకులుగా, సహాయకులుగా మారిపోయారు. సంత్‌గా ఆయన ప్రఖ్యాతి పొందారు. కానీ, శ్రమించి కడుపు నింపుకునే పనిమాత్రం ఆయన వదలలేదు.

## గృహస్థ సంత్

ఆచరణ శుద్ధి, లోక కళ్యాణం, మత సామరస్యం దుష్ప్రవృత్తి నిర్మూలన అనే అంశాలు ఆయన మత ప్రచారంలోని మూల సూత్రాలు. ఈ ప్రచారంవల్ల తమ స్వార్థ ప్రయోజనాలకు భంగం కలుగుతోందని కొందరు వ్యక్తులు ఆందోళన చెందారు. వేషం, వంశముల పేరిట జరుగుతూన్న అనాచారం ఆయన ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. ఆయనపై పలుమారులు ఆక్రమణలు జరిగాయి. కబీరు ప్రాణాలతో బయటపడ్డారు. అయినా ఆయన భయపడలేదు. ఆగిపోలేదు. తన పని చేసుకుంటూ పోయారు. ప్రశంసకులపట్ల అనురాగం కాని, నిందకులపట్ల ద్వేషం కాని ఆయనలో చోటుచేసుకోలేదు. ఆయన దృష్టి అంతా తన లక్ష్యంపై లగ్నమై ఉంది. ఆయన తన మార్గంలో ఏకాకిగా ముందుకు సాగారు. ఇంటికి వచ్చే వ్యక్తుల సౌకర్యం కోసం ఆయన పెళ్లి చేసుకున్నారు. గృహస్థుగా ఉంటూనే,

**నింద, అసూయలు అసురత్వానికి ఆయుధాలు.**

శ్రమించి సంపాదిస్తూనే - సంత్‌యొక్క జీవన క్రమాన్ని మరింత చక్కగా నిర్వహించవచ్చునని ఆయన తన ఉదాహరణద్వారా నిరూపించారు.

## రామనామం, రామకార్యం

అనుచరులు ఆయన జీవన చర్యను ప్రత్యక్షంగా చూచారు - రాత్రిపూట బట్టలు నేయడం; ఉదయంనుండి ప్రచార, సత్సంగాలలో నిమగ్నం కావడం. ఆయన భజన ఎప్పుడు చేసేవారు? భజన చేయని వ్యక్తి సంత్ ఎలా అవుతాడు? కబీరు బట్టలు నేస్తూ నేస్తూ రామనామం జపించేవారు. అయినా - యథార్థవాద దృష్టితో ఆయన ప్రజలపై ఇలా వ్యంగ్యబాణాలు వదిలేవారు -

**కబీరా మన్ నిర్మల భయా, జైసే గంగా నీర్ ।**
**పాఛై పాఛై హరి ఫిరే, కహత కబీర కబీర ।**
**కబీర్ మాలా న జపై, జిహ్వా కహౌ న రామ్ ।**
**సుమిరన మేరా హరి కరే, మై పా ఊ విశ్రామ్ ॥**

అనగా -

రామ నామంకన్న రాముని పని చేయడం మరింత ముఖ్యం. పని చేస్తూ చేస్తూ కూడ రామ నామాన్ని మనసులో జపించవచ్చు.

## సంస్కర్తల నిర్మాణం

కబీరు తన ప్రచార యాత్రలలో ఆలోచనాపరులు పలువురిని కలుసుకున్నారు. కులాల పేరిట హెచ్చు తగ్గుల భావనను నిర్మూలించే ప్రయత్నం జరపడానికి వారిని అంగీకరింపజేశారు. ఈవిధంగా ఆయన పలువురు సంత్‌లనూ, సంస్కర్తలనూ తయారుచేశారు.

ఆరోజుల్లో కాశీ నివాసం పట్ల నమ్మకం కలిగిన భావుకులైన ప్రజలను కర్మకాండల పేరిట కొందరు దోచుకునే వారు. గోరఖ్‌పూర్ బస్తీ పొలిమేరలలో ఉన్న మగహర్ అనే స్థలంలో చనిపోయినవాళ్ళు నరకానికి వెళతారని జనం నమ్మేవారు. తన చివరి రోజులలో కబీరు అక్కడికి వెళ్ళారు. ఆ గ్రుడ్డి నమ్మకాన్ని వమ్ముచేయాలన్నది ఆయన ఉద్దేశ్యం. చివరి క్షణంలో కూడ ఆయన రామ స్మరణలో తన్మయులై ఉన్నారు.

ఆయన స్వర్గస్థులైనారన్న వార్త తెలుసుకుని, భక్తులు వేల సంఖ్యలో వచ్చారు. వారిలో హిందువులూ, ముస్లింలూ ఉన్నారు. మృతదేహాన్ని దహనం చేయాలని హిందువులు వాదించారు. దాన్ని ఖననం చేయాలని ముస్లింలు వాదించారు. ఏ మత సామరస్యం కోసం తనద్వారా జీవితమంతా కృషి జరిగిందో, ఆ మత సామరస్యం దెబ్బతింటోందని కబీరు ఆత్మ చూచింది. ఫలితంగా - ఆ మృతదేహం అదృశ్యం అయిపోయింది. తగాదాపడినవారికి ఆ స్థలంలో పువ్వులే కనిపించాయి. ఈ సిద్ధికి అంతా ఆశ్చర్యచకితులు అయినారు. సగం పువ్వులను హిందువులు దహనం చేశారు. ఆ స్థలంలో సమాధి నిర్మించారు. సగం పువ్వులను ముస్లింలు ఖననం చేశారు. ఆ స్థలంలో మక్‌బరా నిర్మించారు.

## గుండెనుండి పెల్లుబికిన భజనలు

వెనుకబడినవారిని ముందుకు తీసుకుపోవడానికీ, మత సామరస్యాన్ని పెంపొందించడానికీ, దురాచారాల నిర్మూలనకూ కబీరు జన్మించారు. ఈ పనిని ఆయన తాను జీవించి ఉన్నప్పుడు సూక్ష్మ శరీరంతో కూడ చేస్తూ వచ్చారు. మహత్తరమైన తన ఆత్మబలంతో అసంఖ్యాకుల ఆలోచనలను మార్చారు. తన సంపర్కంలోనికి వచ్చిన వ్యక్తులను తన వర్చస్సుతో ఉన్నతోన్నతులను చేశారు. వారికి మరిన్ని సాఫల్యాలు లభించేటట్లు చేశారు.

కబీరు చిన్నతనంనుండీ సత్యాన్వేషణలో నిమగ్నులు అయినారు. సత్యాన్వేషణలో, భ్రమలను తొలగించడంలో, సత్ సంప్రదాయాలను ప్రతిపాదించడంలో ప్రాణాలను ఒడ్డి నిమగ్నం కాని రోజు ఆయన జీవితంలో లేదు. ఆయన ఇలా ఆలోచించేవారు - వ్యక్తి భవసాగరాన్ని దాటడానికి ఈ జన్మలో సన్నాహాలు చేయకపోతే, వచ్చే జన్మలలో ఏమి ఆశించగలం?

పనిచేస్తున్నంతసేపూ, ఆయన ఏవో భావాలు

**మౌనంగా ఉన్నవాడికి కలహం రాదు.**

అల్లుకుంటూ వాటిని మాటలలో, పాటలలో పేర్చుకుంటూ ఉండేవారు. ఇలా తన్మయంగా అల్లుకున్న పదాలు భజనలుగా వెలికివచ్చేవి. ఇలా లోలోపల పాడుకున్న భజనలను ఆయన ప్రతిరోజూ స్వామి రామానందజీ సత్సంగ గోష్ఠిలో వినిపిస్తూ ఉండేవారు. కబీరు చదువుకున్నవారు కారు. అయినా - ఆయన హృదయం నుండి పెల్లుబికివచ్చిన, భక్తిరసంతో పొంగిపొరలిన ఆ భజనలు శ్రోతల గుండె లోతులను తాకేవి. వారు తన్మయులు అయ్యేవారు. కాలక్రమంలో కబీరు కవిగా ప్రసిద్ధి పొందారు.

సత్సంగం మనిషి ఆత్మను ప్రభావితం చేస్తుందన్నది నిశ్చయం. మనస్సు, బుద్ధి, వివేకం, ప్రతిభలను మేలుకొలుపుతుంది ఆ ఆత్మ వెలుగు. కనుకనే, సత్సంగం మహిమను శాస్త్రాలు నొక్కివక్కాణించాయి. సత్సంగంలో పాల్గొని చదువుకోని వ్యక్తిసైతం యోగ్యుడు అవుతాడు, మూఢుడు పండితుడు అవుతాడు.

## నా కులం మానవత, నా మతం ప్రేమ

కబీరుకు వివాహం జరిగింది. ఆయన భార్య పేరు లోఈ. జనం కబీరు ఇంటికి వచ్చిపడ్డారు. వారిలో ఇద్దరు ముగ్గురు ఆయనను ఇలా గద్దించారు - ఇలా చేయి పట్టుకుని పెళ్లి చేసుకునే హక్కు నీకు ఎవ రిచ్చారు? కాజీనీ పిలువలేదు. బంధువులనూ పిలువలేదు. ఈ వివాహం చెల్లదని మేము నిర్ణయిస్తున్నాం.

కబీరు ప్రశాంతంగా ఇలా అన్నారు - లోఈ నన్ను పెళ్లి చేసుకుంది. నేను ఆమెను పెళ్ళి చేసుకున్నాను. పూర్తిగా ఇష్టపడి పెళ్లి చేసుకున్నాం. పెళ్లి చేసుకోవడం, చేసుకోకపోవడం అన్నది మా ఇద్దరిమధ్యా ఉన్న విషయం. ఆ పెళ్లి చెల్లుతుందని కాని, చెల్లదని కాని నిర్ణయించే హక్కు మీకు లేదు. మీ సమాజంలోని బలహీనత ఇదే. కుళ్లిపోయిన పాతకాలపు ఆచార వ్యవహారాలను మీరు అనుసరిస్తున్నారు. వాటికోసం అప్పులమీద అప్పులు తెస్తున్నారు. ఆ వడ్డీల ఉచ్చులో చిక్కుకుని గిలగిలలాడుతున్నారు. పేదరికంలో మ్రగ్గుతున్నారు. ఆకలి చావులకు గురి అవుతున్నారు. ఇకనైనా మీరు మీ జీవితాలలోకి కొత్త వెలుగును ఆహ్వానించండి. విజ్ఞతతో వ్యవహరించండి. పనికిమాలిన ఆచార వ్యవహారాలను వదులుకోండి. మిమ్మల్ని మీరు సంస్కరించుకోండి.

ఈ మాటలు విని వారిలా అన్నారు -

నిన్ను కులంనుంచి వెలి వేస్తున్నాం. నీవు కాఫిర్ అయిపోయావు. ఈ మాట చెప్పడానికి మేము వచ్చాం.

కబీరు ఇలా అన్నారు -

మంచిది. నాకసలు కులమే లేదు. మరి మీరు నన్ను దేనినుంచి వెలివేస్తారు? నా కులం మానవత్వం. నా మతం ప్రేమ. నమ్మకాన్ని కోల్పోయిన ముస్లిములే కాఫిర్‌లు అవుతారు. నేను ముస్లింను కాను. నేను నా నమ్మకాన్ని కోల్పోలేదు. నా నమ్మకం నిలచి ఉన్నప్పుడు, నా మార్గం ఋజుమార్గం అయినప్పుడు - నేను కాఫిర్‌ను ఎలా అవుతాను?

గుంపులోని మనుషులు ఒకరి ముఖం ఒకరు చూస్తూ ఉండిపోయారు. వారి హృదయాలపై లోతైన సంస్కారపు ముద్ర పడింది.

## గోశాలల నిర్మాణం

స్వామి రామానందజీ కృప, పైన వర్ణించిన సంఘటన, భక్తిభావ భరితములైన భజనలు - అన్నీ కలసి కబీరుపట్ల ప్రజలలో శ్రద్ధాభక్తులను ఇనుమడింపజేశాయి. కబీరు మహాత్మా కబీర్‌దాస్‌గా ప్రఖ్యాతి పొందారు. కబీరు భజనలలో, ప్రవచనాలలో ప్రముఖాంశం - మూఢ నమ్మకాల, ఆడంబరాల, మత విక్రయాల ఖండన. ఆయన ప్రజలకు సమత, సమానత, భేదభావ రాహిత్యాలను బోధించారు. కులతత్వాన్నీ, మతతత్వాన్నీ, అంటరానితనాన్నీ

**భగవంతుని సిద్ధాంతం ప్రేమ. ఆయన భాష మౌనం.**

ఖండించడానికి ఆయన ఎన్నడూ సంకోచించలేదు. నిజాన్ని సూటిగా చెప్పడంలో ఆయన చూపిన సాహసం అనుకరించదగినది. ఆత్మనుండి సూటిగా వెలువడి, లోకకళ్యాణ భావనతో పొంగిపొరలే ఆయన వాణి అద్భుతమైన ప్రభావాన్ని కలిగించింది. ఆ వాణి విన్నవారంతా నతమస్తకులు అయ్యేవారు. ఆయన ఎందరెందరో వితంతులవులకూ, అనాథ బాలలకూ ఆసరాగా నిలచారు. ఎందరెందరో పిల్లలను చదివించారు. వారిని పనులలో, వృత్తులలో ప్రవేశపెట్టారు. ఆయన వివిధ స్థలాలలో బావులు త్రవ్వించారు. చెట్లు నాటించారు. గోశాలలు నిర్మింపజేశారు.

## సాధు సంత్‌లలో ఆడంబరాలు

కబీర్‌దాసు ఇలా ఆనందంగా పరోపకారం చేస్తూ ఉండగా - కొద్ది వ్యవధిలోనే రెండు విచారకర సంఘటనలు జరిగాయి. ఒకటి తల్లి స్వర్గస్థురాలు కావడం, రెండవది ఆయన ఆత్మకు ప్రియతములు స్వామి రామానందజీ దివంగతులు కావడం.

ఈ సంఘటనలవల్ల అనాసక్తమైన కబీర్‌దాసు హృదయంసైతం చలించిపోయింది. కబీరు ఆత్మశాంతి కోసం గౌతమ బుద్ధునివలె ఇల్లు వదలి బయలుదేరారు. సుమారు సంవత్సరంపాటు సాధు సంత్‌లనూ, మహాత్ములనూ, మహంత్‌లనూ కలిశారు. అయినా ఆయనకు ఎక్కడా శాంతి లభించలేదు.

సాధువుల ఆడంబరాలు, సమాజంలోని అజ్ఞానం - వీటిని సన్నిహితంగా పరిశీలించడంతో, ఆయనలో అశాంతి మరింతగా పెరిగింది. సాధువుల జీవితాలలోని లోభం, తృష్ణ, మాయా మోహాలు మామూలు గృహస్థులలోని ఈ దుర్గుణాలను మించిపోయాయని ఆయన గమనించారు. ఇంటిలోనే ఉంటూ, తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, భగవద్ భజన చేస్తూ ఉండడాన్ని మించిన సాధన లేదని ఆయన తన అనుభవాల ద్వారా నిర్ణయించుకున్నారు. ఫలితంగా - ఆయన ఇంటికి తిరిగివచ్చి, తన ఆధ్యాత్మిక సాధనను కొనసాగించారు.

## రామ్ - రహీమ్ శిష్యులం మనమంతా

స్వామి రామానందజీ కుటీరంలో ఆయన పద్ధతిలోనే కబీర్‌దాసు సత్సంగం చేయడం ప్రారంభించారు. స్వామి రామానందజీ పరమపదించిన తర్వాత మూగబోయిన ఆ పవిత్రస్థలం తిరిగి జవంతో, జీవంతో తొణికిసలాడింది. కబీరు ఉపదేశాలనూ, భజనలనూ వినడానికి ప్రజలు వేలాదిగా వచ్చేవారు. కబీరు రచనలలో, వచనాలలో సత్యపు వెలుగు వెల్లువ పెల్లుబికేది. సమాజంలోని గ్రుడ్డి నమ్మకాలూ, అనాచారాలూ, దురాచారాలూ ఆ వెల్లువలో కొట్టుకు పోసాగాయి. అంటరానితనం, కులాల హెచ్చు తగ్గుల భేద భావాలు త్వరత్వరగా తొలగిపోసాగాయి. ఆధ్యాత్మికంగా ఒకరికొకరు సమానులన్న భావం ప్రజలలో వ్యాపించింది.

ఆనాటి సమాజంలో అది ఒక అభినవ విప్లవం. ఛాందసవాదులూ, పురాతన వాదులూ, ఆధిక్యవాదులూ దీన్ని సహించలేక పోయారు.

మీవంటివాళ్లమధ్య ఉంటే ఎవరికయినా ఆధ్యాత్మిక ప్రయోజనం కలుగుతుందా? - అని వారు ప్రశ్నించేవారు.

కబీరు వారికిలా సమాధానం చెప్పేవారు -

మీవంటి వారికన్న మామూలు గృహస్థులు గొప్పవాళ్ళు. తాము సాధువులమంటూ వారు గొప్పలు చెప్పుకోకపోవచ్చు. అయినా వారు తమ కుటుంబాలను నిర్వహిస్తూ పరంపరను కొనసాగిస్తున్నారు.

హిందూ - ముస్లిం, ఉన్నతులు - అధములు, ధనికులు - పేదలు, పెద్దలు - చిన్నలు - అనే భేద భావాలను మీ మనస్సుల నుండి తొలగించుకోండి. అంతా ఒకే రామ్ - రహీమ్ యొక్క శిష్యులు. కలసి మెలసి ప్రేమాదరాలతో సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోండి భగవానుని పట్ల భక్తి పెంచుకోండి. పవిత్ర జీవనం గడపండి. ఇదే నా సందేశం.

## స్వర్గ నరకాలు మనస్సులోనే

ఆ తర్వాత ఆయన తన కుమారుడు కమాల్‌కు

**మూర్ఖుని మొదటి లక్షణం అహంకారం.**

జీవిత కర్తవ్యాన్ని బోధించి ఇలా చెప్పారు -

నన్ను మగహర్‌కు చేర్చు. కాశీలో చనిపోవాలనే కోరిక నాకు లేదు.

కమాల్ ఆశ్చర్యచకితుడై ఇలా అన్నాడు -

అబ్బా! మరణించడం కోసం జనం దూర దూరాల నుండి కాశీకి వస్తున్నారు. మరి మీరు కాశీ వదిలి పెట్టి మగహర్ వెళ్లాలని అనుకుంటున్నారు. కాశీలో చనిపోతే స్వర్గం లభిస్తుందనీ, మగహర్‌లో చనిపోతే నరకం లభిస్తుందనీ విన్నాను.

కబీరు నవ్వి, ఇలా వివరించారు -

నిజమే బేటా! కాశీ, మగహర్‌ల విషయంలో వచ్చిన ఈ భ్రమను తొలగించాలన్నది నా ఉద్దేశ్యం. స్వర్గ నరకాలు మనిషికి తన మంచి చెడు కర్మలు ఆధారంగా లభిస్తాయి. నా పనుల పవిత్రతపై నాకు పూర్తి నమ్మకం ఉంది. మగహర్‌లో చనిపోయినా, నేను స్వర్గాన్ని సంపాదిస్తాను.

వాస్తవానికి నాకు స్వర్గ నరకాలమీద నమ్మకం లేదు. స్వర్గ నరకాలు మనిషి మానసిక స్థితిలో నివసిస్తాయి.

**ప్రపంచంలో సత్కర్మల నుండి లభించే ఆత్మశాంతి స్వర్గం. పాప కర్మలనుండి లభించే యాతన నరకం.**

## మనసులోని మాలను త్రిప్పు

కబీరు మతపరమైన గ్రుడ్డి నమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకించారు. మత గురువులు అమాయక ప్రజలను దోచుకోవడం ఆయన ఏవగించుకున్న విషయం. కనుకనే ఆయన హిందూ, ముస్లిం వృత్తిపర మత గురువులను తీవ్రంగా విమర్శించారు. వారి ఉచ్చులనుండి బయటపడవలసిందిగా ఆయన ప్రజలను హెచ్చరించారు. ఇందువల్ల - హిందూ, ముస్లిం మతాలకు చెందిన గుత్తాధిపతులు ఆయనపై ఆగ్రహించారు. ఆయనకు రకరకాలు ఇబ్బందులు కలిగించారు.

ఎదుటివారికి తాము ధార్మికులుగా కనిపించాలని చేసే మత కర్మలనూ, పూజా పురస్కారాలనూ, కర్మకాండనూ ఆయన వ్యతిరేకించారు. సౌశీల్యం, నైతికత కలిగి ఉండాలని ఆయన ప్రజలకు ఉపదేశించారు. ముస్లింలతో ఆయన ఇలా చెప్పేవారు -

మీరు ఎత్తయిన మీనార్ ఎక్కి బిగ్గరగా కేకలు వేస్తారు. మరి ఖుదా (దేవుడు) చెవిటివాడు అయిపోయాడా? ఇలా అరిస్తేనేకాని ఆయనకు వినబడదా?

ఆయన హిందువులకు ఇలా చెప్పేవారు -

మీరు జపమాలలు త్రిప్పి యుగాలు గడిచాయి. కానీ, పరమాత్మ జ్ఞానం ఇంతవరకు మీకు కలుగలేదు. కనుక - కరతో చేసిన మాలలోని పూసలు త్రిప్పడానికి బదులు, మనసులోని మాలలో ఉన్న పూసలు త్రిప్పితే, మీకు భగవత్ ప్రాప్తి తప్పక కలుగుతుంది. ఎందుకంటే - భగవంతుడు అంతర్యామి. భక్తి ప్రదర్శనకూ, నిజమైన భక్తికీ మధ్య ఉన్న తేడాను ఆయన గ్రహిస్తాడు.

## ప్రజల భాషలో రచనలు

కబీరు అచ్చమైన అహింసావాది. ఏప్రాణికయినా బాధ కలిగించడం, ఏ ప్రాణినయినా చంపడం ఘోర పాపమని ఆయన బోధించారు.

మహాత్మా కబీర్‌దాస్ పేరున కబీర్ పంథ్ ఇప్పటికీ నడుస్తున్నది. ఆయన రచించిన భజనలనూ, గీతాలనూ ప్రజలు ఎంతో శ్రద్ధగా గానం చేస్తున్నారు. తద్వారా జ్ఞానం పొందుతున్నారు. ఆయన సాహిత్యం బీజక్, సాఖీ, ఉలట్ బాసయో అనే గ్రంథాలలో లభిస్తోంది. దాని భాష పూర్తిగా ప్రజల భాష. అయితే - దానిలో నిండి ఉన్న ఆధ్యాత్మిక రహస్యాలు ఏ మతగ్రంథంలోని రహస్యాలకూ ఏమాత్రం తీసిపోవు.

H H H

**మన అంతః చైతన్యం మన పనులన్నింటినీ పరిశీలించే న్యాయమూర్తి.**

తత్వ చింతన

# పరమాత్మ ప్రథమ నామం - ఓం

ఓమిత్యేవ సునామధేయమనఘం
విశ్వాత్మనో బ్రహ్మణః ।
సర్వేష్వేవ హి తస్య నామసు
వసోరే తత్ప్రధానం మతమ్ ।
యం వేదా నిగదన్తి న్యాయనిరతం శ్రీ సచ్చిదానన్దకమ్।
లోకేశం సమదర్శినం నియమనం
చాకారహీనం ప్రభుమ్ ॥

**అర్థం:-** ఎవరిని వేదాలు న్యాయకారుడు, సచ్చిదానందుడు, విశ్వానికి స్వామి. సమదృష్టి కలవాడు, నిరాకారుడు అని చెబుతున్నాయో ఆ విశ్వ ఆత్మ, ఆ బ్రహ్మకు ఉన్న సమస్త నామాలలో శ్రేష్ఠ నామంగా ధ్యాన యోగ్యమైన 'ఓం' గుర్తించబడుతోంది.

## ఓంకారం స్వయంప్రకటితం

గాయత్రీ మంత్రానికి ముందు 'ఓం' కలుపబడి ఉంటుంది. 'ఓం' పరమాత్మ ప్రథమ నామం. భగవంతుడిని అనేక నామాలతో పిలుస్తారు. 'ఏకం సద్విప్రా బహుదా వదన్తి'. ఆ ఒకే పరమాత్మను బ్రహ్మవేత్తలు అనేకరకాలుగా చెబుతుంటారు. విభిన్న భాషలు, సాంప్రదాయాలలో ఆయనకు అనేక పేర్లున్నాయి. ఒక్కొక్క భాషలో ఈశ్వరునితో సమానార్థం గల అనేక నామాలుంటాయి. అయినా ఆయన ఒక్కడే. ప్రకృతిని నిర్వహించే కార్యకలాపాలను తమ యోగబలంతో చూడగలిగిన మన ఋషులు సమాధి అవస్థలో ఉన్నపుడు ఈ ప్రకృతి అంతరాళాల్లో ఒక ధ్వని ఉత్పన్నమవుతుందని, అది 'ఓం' శబ్దంలా ఉంటుందని కనుగొన్నారు. అందువలన భగవంతుని నామాలలో 'ఓం'కు ప్రాధాన్యం ఇవ్వబడింది. సూక్ష్మ ప్రకృతి ఈ నామాన్ని ప్రతిక్షణం జపిస్తూ, ఉద్ఘోషిస్తూ ఉంటుంది. ఇందువలననే ఇది సహజసిద్ధమైనదనీ, దైవమనీ, స్వయంఘోషితమనీ, ఈశ్వరనామమనీ, సర్వశ్రేష్ఠమైనదనీ చెప్పబడింది.

## ఉపాసన వల్ల సత్వగుణ అభివృద్ధి

ఆస్తికత అనగా సత్వగుణాలను, దైవత్వాన్నీ, భగవంతుడిని, పరమార్థ భావనల్ని హృదయంగమం చేసుకోవడం. నాస్తికత అనగా తామస, అసుర, సైతానీ, భోగవాద, స్వార్థపర కోరికలలో మునిగి ఉండడం. భగవంతుడు మంచి, చెడు రెండింటిలోను ఉంటాడు. అయితే మనం పూజించే, భజన చేసే, ధ్యానించే ఈశ్వరుడు సత్వగుణాలకు ప్రతీక. ఒక సువిస్తృత రాజ్యానికి ప్రతీకగా ఒక జాతీయ పతాకం ఉంటుంది. ఏదైనా మరో దేశం ఆ పతాకాన్ని గౌరవించినా, అవమానించినా - అది ఆ దేశాన్ని గౌరవించడంగా అవమానించడంగా అవుతుంది. ఇదే ప్రకారం మానవుల అంతఃకరణాలలో నివాసముండే సత్వగుణాలకు ప్రతీకయైన ఈశ్వరుడిని మనం పూజిస్తాము. ఈశ్వర ప్రతిష్ఠ, పూజ, ఉపాసన, ప్రశంస, ఉత్సవాలు, కథాగానం, యాత్రలు మొదలైన వాటి తాత్పర్యం సత్వగుణాల పట్ల మన అనురాగాన్ని ప్రకటించడం; వాటిని హృదయంగమం చేసుకోవడం; వాటిలో తన్మయులం కావడం. ఈ ప్రక్రియలతో మన మనసు పవిత్రమవుతుంది. మన ఆలోచనలు, కార్యాలు వ్యక్తిగత జీవితంలో, సామూహిక జీవితంలో సుఖశాంతులను సృష్టిస్తాయి. ఈశ్వరుని ఉపాసనా మహా ప్రసాదం సాధకుని అంతరాత్మలో సత్వగుణ అభివృద్ధిరూపంలో తక్షణమే లభించడం ప్రారంభమవుతుంది.

గాయత్రీ గీతలోని పై ప్రథమ శ్లోకంలో ఈశ్వరుని అనేక లక్షణాలు చెప్పబడ్డాయి. అవి - న్యాయకారి, సమదృష్టి కలవాడు, నియామకుడు, నిరాకారుడు, విశ్వ ఆత్మ. విశ్వంలోని సమస్త ప్రాణులతో ఆత్మరూపంలో ఆయన కనిపిస్తాడు. మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాలు అంతః

**చెడును త్రుంచడానికి ఉత్తమ పద్ధతి మంచిని పెంచడం.**

కరణ చతుష్టయాలు. అవి వికృతం కావడం వలన అజ్ఞానం, మాయ, స్వార్థం, భోగాల మాలిన్యం అంటుకొని మానవులు చెడుదారిలో పడడం చూడవచ్చు. అయినా ఈశ్వరుని అంశ అయినందున  అంతరాత్మ లోపలనుండి సన్మార్గంలో నడవాలనే ఆదేశిస్తుంది. ఆ అంతరాత్మ పిలుపును విని ఆ సంకేతాలను అనుసరించగలిగితే ఎంత చెడ్డవారైనా కొద్ది సమయంలోనే శ్రేష్ఠులుగా, గొప్పవారుగా తయారు కావచ్చు. 'అన్నీ వదిలివేసి నా శరణులోకి రండి; అన్ని పాపాల నుండి విముక్తులను చేస్తాను'-అని భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. అంతరాత్మను, పరమాత్మను శరణు కోరి ఆత్మసమర్పణ చేసుకోవడం వలన, దైవీ ప్రేరణలను హృదయంగమం చేసుకోవడం వలన మనిషి ఈశ్వరునికి నిజమైన భక్తుడవుతాడు. భగవంతుని ప్రత్యక్షరూపమే భక్తుడు.

## ద్వేషరహితంగా ఉండాలి దండన

కనుక భగవంతుడు ప్రతి ఆత్మలో నివాసముంటాడు. అందువలన ఏ వ్యక్తినీ మనం దుష్టునిగా చూడకూడదు. ద్వేషించకూడదు. దుర్మార్గపు ఆలోచనలు, దుష్టకార్యాలనే మనం ద్వేషించాలి. దుష్టత్వం ఒక రోగం. రోగాన్ని తరిమికొట్టి రోగిని కాపాడడం కోసం ఎంతో ప్రయత్నం చేయాలి. అలాగే దుష్టత్వాన్ని తొలగించి దుష్టులను సజ్జనులుగా మార్చడానికి అంతే ప్రయత్నం చేయాలి. ఆత్మ మూల స్వరూపం దైవం. అందువలన ప్రయత్నం చేస్తే చెడు దూరమవుతుంది. ఆత్మలో భగవంతుడుంటాడు.బాధను నివారించడానికి పుండును కోసే విధంగా మనిషిని దండన ద్వారా సంస్కరించవచ్చు. కాని మనసులో ఎవరి పట్ల ద్వేషానికి తావివ్వకూడదు.

## పదహారు కళల అవతారం కృష్ణుడు

ఈశ్వరుడు సర్వవ్యాపి. అందువలన ఆయన ఒక స్థలానికి సంబంధించినవాడు కాదు. ఆయన ఆత్మస్వరూపుడు. అందువలననే నిరాకారుడు. అయినా ఈ సృష్టి నిర్మాణం అంతా తనదే కావడంతో, అంతటా నిండి ఉండడంతో ఆయన సాకారుడే. మహాపురుషులలో ఆయనలోని విశేష శక్తులు, విశేష కళలు ఉంటాయి. అప్పుడు అతడిని ఆ కళలకు చెందిన అవతారంగా చెప్పుకోవచ్చు. పరశురామునిలో మూడు కళలు ఉన్నాయని చెప్పబడింది. ఒకే సమయంలో ఎన్నో అవతారాలు, ఎంతోమంది మహాపురుషులు ఉండవచ్చు. రాముడు, పరశురాముడు ఒకే సమయంలోని రెండు అవతారాలు. భగవద్గీత ప్రకారం అధర్మం వృద్ధి చెందినపుడు ధర్మస్థాపన కోసం అవతారాలు దిగి వస్తాయి. ఆ అవతార పురుషులు ఒంటరిగానే అంతా చేయలేరు. ప్రజలలో నూతన ఆలోచనలను, ఉత్సాహాన్ని ప్రవేశపెట్టి వారిని మేలుకొల్పుతారు. అనేకమంది ఆసరాతో ఆ ఈశ్వరీయ ఉద్దేశ్యాన్ని పూర్తి చేస్తారు. కృష్ణుడి ద్వారా కౌరవుల నాశనం, రాముడి ద్వారా రాక్షస నాశనం ఒంటరిగానే జరుగలేదు.  వారికి అపార జనసమూహం బాసటగా నిలబడి వారికి విజయం చేకూర్చింది. దోషాలను తొలగించి మంచిని స్థాపించే కార్యక్రమం ఎక్కడ జరిగినా, దాని వెనుక ఈశ్వరుని ప్రేరణ ఉంటుంది. అవతార పురుషులు దానిని పూర్తి చేయడానికి ముందుకు వస్తారు. చివరికి ప్రజల సహకారంతో ఆ కార్యక్రమం పూర్తవుతుంది. అలాంటి అవతార ప్రక్రియలు చిన్న, పెద్ద రూపాలలో నిరంతరం జరుగుతూనే ఉంటాయి. పెద్దపెద్ద అవతారాలు అప్పుడప్పుడు ప్రత్యేక సమయాలలోనే ముందుకు వస్తాయి. ఈ అవతార కార్యకలాపాలలో పాల్గొనడం అనేది హనుమంతునివలె, అర్జునునివలె యశస్సును, ప్రతిష్ఠను పొందడమే అవుతుంది.

పరమాత్మ భట్రాజులంటే ఇష్టపడడు. ఎవరి సుత్తిగాని, నిందగాని ఆయనకు అవసరం లేదు. ఆయన ఎవరిమీదా ప్రసన్నుడూ కాడు. అప్రసన్నుడూ కాడు. పూజ, ఉపాసన అనేవి మన ఆత్మబలాన్ని పెంచే ఒక రకమైన ఆధ్యాత్మిక వ్యాయామాలు. వీని ద్వారా సత్వగుణాలు వృద్ధి చెందుతాయి. ఈశ్వరుని సర్వవ్యాపిగా భావించేవారు పాపాలకు భయపడతారు. పోలీసు ముందు ఉన్నపుడు చోర స్వభావం కలవారు సైతం సాధువులుగా అభినయిస్తారు. అందరికంటే పెద్దపోలీసు అయిన భగవంతుని తమలోపల, బయట

**పరిమిత కుటుంబం, మితవ్యయం మన జీవిత రథానికి రెండు చక్రాలు కావాలి.**

చూడగలిగిన వారు ఆయన విధించే దండనకు భయపడతారు. పాపాలు చేయలేరు. ప్రాణికోటిలో ఈశ్వరుని సర్వవ్యాపకునిగా చూడగలిగినవారు అందరితో మంచిగా వ్యవహరిస్తారు. ఇలాంటి ఈశ్వరీయ దృష్టిని పొందడం ఈశ్వరారాధన ప్రథమ ఉద్దేశ్యం. ధ్యానం, ప్రార్థన, పూజ, కీర్తన, జపం మొదలైన మనోవైజ్ఞానిక క్రియలు మనసులో దాగిఉన్న అనేక చెడు సంస్కారాలను తొలగించి మంచి సంస్కారాలను స్థాపిస్తాయి. ఈశ్వరుని పేరు మీద లోకహిత కార్యాల కోసం దానం ఇవ్వడం అనేది వ్యక్తిగతంగానే కాక సామూహికంగా కూడా సత్వగుణాలను వృద్ధి చేయడమే అవుతుంది.

## ఈశ్వరుడు కర్మఫల దాత

ఈశ్వరుడు సమదృష్టి కలవాడు. పుత్రులందరూ ఆయనకు ప్రియపాత్రులే. అందరూ సమానమే. నిష్పాక్షిక న్యాయాధికారిగా అందరికీ వారి కర్మలు ఆధారంగా ఫలితాన్నిస్తాడు. వారి వారి మంచి, చెడుల పరిపక్వమే కాలాంతరాన ప్రారబ్ధం, అదృష్టం, కర్మరేఖలు, భగవంతుని కృప, దైవీ వరదానం, గ్రహదశ మొదలయిన వాటి రూపంలో బయటపడతాయి. కర్మలు ఇప్పటివైనా, పాతవైనా వాటి ఫలితం మనకు లభించితీరుతుంది. ఈశ్వరుడు తనకు తానుగా ప్రత్యేకంగా ఎవరినీ కోపంగానూ, ప్రేమగానూ చూడడు. అందరికీ అత్యంత విలువైన శరీర రథాన్ని, విలక్షణమైన మస్తిష్కం అనే అస్త్రాన్ని, సృష్టిలో లభించే ఎన్నో సుఖమయమైన వస్తువులను ఇచ్చి తన దయార్ద్రతను చాటుకున్నాడు. మంచి, చెడు కర్మల ద్వారా జీవితాన్ని దుఃఖమయంగానో, సుఖవంతంగానో చేసుకోవలసిన బాధ్యత మనదే. ఎవరి క్రియాకలాపాలలోను ఆయన జోక్యం చేసుకోడు. తమ ఇష్టం వచ్చిన పనులు చేసుకోవడానికి అందరికీ సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చాడు. కర్మఫలం నుండి ఎవరూ తప్పించుకోలేరు. ప్రతి ఒక్కరూ దానిని అనుభవించవలసిందే. న్యాయాధీశుడైన ఈశ్వరుని న్యాయం నుండి ఎవరూ తప్పించుకోజాలరు.

## నియమోల్లంఘనకు దండన తప్పదు

ఆయన నియామకుడు. స్వయంగా నియమరూపుడు. ఆయన ప్రతి పనీ నియమరూపంగానే జరుగుతూ ఉంటుంది. గ్రహ నక్షత్రాలు ఒక్క క్షణం కూడా ముందు వెనుక ఉదయించడం, అస్తమించడం జరగదు. బియ్యం నుండి బియ్యమే ఉత్పత్తవుతాయి. వస్తువులు తమతమ గుణాలను ధారణ చేసి ఉంటాయి. ఎప్పుడయినా నియమాలు తప్పినట్లు కనిపిస్తే, అది కూడా ఏవో సూక్ష్మ నియమాలు ఆధారంగానే జరుగుతుంది. ఈశ్వరీయ నియమాలను పాటించేవారు, ప్రాకృతికంగా జీవించేవారు, కర్తవ్య ధర్మంలో స్థిరంగా ఉండేవారు ఈశ్వరుని ఆనందమయ సృష్టిలోని ఆనందాన్ని ఆస్వాదిస్తారు. నియమాలను ఉల్లంఘించే వారు చెడిపోక తప్పదు. అగ్ని దయాళువు. చలిని నివారిస్తుంది. భోజనాన్ని ఉడికిస్తుంది. ఆవిరి యంత్రాన్ని నడిపిస్తుంది. దానివల్ల ఇంకా అనేక ప్రయోజనాలున్నాయి. అయితే దానిని నియమవిరుద్ధంగా తాకితే అది చేతులను కాల్చుతుంది. విద్యుత్తుతో మనం అనేక ప్రయోజనాలను పొందుతున్నాము. అయితే దానిని పొరపాటున తాకినా అది ప్రాణాలను తీస్తుంది. ఇదే ప్రకారం భగవంతుడు మనకు అనేక సుఖాల నిస్తాడు. అయితే ఆయన నియమాలను ఉల్లంఘిస్తే మాత్రం భయంకరమైన నరకాగ్నిలో కాల్చివేసే క్రూర యమధర్మరాజుగా మారిపోతాడు. ఆయన ఏర్పరచిన నియమాలను ఆచరిస్తూ ముందుకు సాగడమే ఈశ్వరునికి అత్యుత్తమమైన పూజ అవుతుంది.

సాధారణ మానవుల అంతఃకరణాన్ని ఆత్మ అంటారు. అది వికసించినపుడు అహంభావం విస్తృతమై వసుధైక కుటుంబం రూపంలో పరిణతి చెందుతుంది. అందరూ తన ఆత్మీయులుగానే కనబడతారు. అప్పుడు లఘు ఆత్మ పరమ ఆత్మ (పరమాత్మ), మహా ఆత్మ (మహాత్మ)గా తయారవుతుంది. విశ్వం యొక్క సమృద్ధ ఆత్మయే విశ్వాత్మ లేదా పరమాత్మ. దీనినే సమాజ సంస్కర్త, భగవంతుడు, జనార్దనుడు మొదలైన పేర్లతో పిలవడం జరుగుతుంది.

**సదాచారం మిన్నకున్నప్పుడే అనాచారం ప్రబలుతుంది.**

విశ్వమానవులను ఉపాసించడం, సమాజ పురుషసేవ భగవంతుడైన 'ఓం'ని ఆరాధించడమే అవుతుంది. భగవద్గీతలోని 10వ అధ్యాయంలో భగవంతుడు "వృక్షాలలో రావి, పశువులలో గోవు, మనుషులలో బ్రాహ్మణుడు, నక్షత్రాలలో చంద్రుడు, గ్రహాలలో సూర్యుడు, ఇంద్రియాలలో మనసు, పర్వతాలలో హిమాలయాలు, పక్షులలో గరుడుడు, నదులలో గంగ, మంత్రాలలో గాయత్రీ మంత్రం, ఋతువులలో వసంతం నేనే'' - అని చెప్పాడు. అనగా శ్రేష్ఠమైన సాత్వికమైన, దృఢమైన, ఉపయోగకరమైన శక్తులన్నింటిలోను ఆయన అంశే ఉన్నది. ఏ ఆలోచనలలో, వ్యక్తులలో, వస్తువులలో ఇలాంటి తత్త్వాలు అధికంగా ఉంటాయో వాటిలో ఈశ్వరుని కళలను ప్రత్యేకంగా గుర్తించవచ్చు. ప్రభువు నివాసమున్న చోట ఖచ్చితంగా శ్రేష్ఠత్వానికి, సాత్వికతకు, దృఢత్వానికి, పరోపకారానికి ప్రాధాన్యం ఉంటుంది. ప్రయత్నం మీద అనేక చోట్ల అలాంటి ప్రభు నివాసాన్ని అన్వేషించి, దర్శించి తృప్తి పడవచ్చు. ఇందువలననే సత్సంగంలో భగవంతుడుంటాడని చెబుతారు. ప్రాచీనకాలంలో సత్పురుషులు అధికంగా ఉండడం వలన తీర్థాల మహిమ ఉండేది. తీర్థయాత్రలను పుణ్యప్రదములుగా భావించేవారు. ఈరోజు కూడా మహాపురుషుల నివాసాలు ప్రత్యక్ష తీర్థాలే.

### సద్గుణాలకు నమూనాలు - విగ్రహాలు

రాముడు, కృష్ణుడు మొదలైన వారి సుందర కాంతులను, వారి గుణాలను ధ్యానించడం వారి ఉన్నత ఆదర్శాలను లక్ష్యంగా చేసుకోవడమే. పెద్దపెద్ద భవనాలు నిర్మించాలంటే ముందు వాటి నమూనా తయారు చేస్తారు. ఆరోగ్యం, సౌందర్యం, బలం, గుణం మున్నగు ప్రత్యేకతల ద్వారా ఆత్మనిర్మాణం ఎలా చేసుకోవాలో ఒక నమూనాను తయారు చేసుకొని అనన్య ప్రేమపట్ల తీవ్ర అభిలాషను ఉత్పన్నం చేసుకోవాలి. అందుకోసం భగవంతుని కల్పిత రూపాలను ధ్యానిస్తాము. ఆలయాలు, మఠాలు ఆత్మజ్ఞాన ప్రచార కేంద్రాలు. ఆ కేంద్రాల కార్యకర్తల గౌరవార్థం, వారి జీవన యాపన కోసం దక్షిణ ఇవ్వడం, పూజ మొదలైన విధి వ్యవస్థ తయారైంది. ప్రస్తుతం ఆ పరిస్థితులన్నీ గందరగోళంగా తయారయ్యాయి. అనాచారాలు, ధూర్తత్వం, మూర్ఖత్వం ఎక్కువయ్యాయి. అయితే కొద్దిపాటి ప్రయత్నంతో ప్రాచీన ఆదర్శాలను పునరుజ్జీవింప జేయవచ్చు. భగవంతుని పూజ ఆధారంగా ధర్మ, సమాజ, జాతీయ, సాంస్కృతిక, సామాజిక సదాచారాలను మరల ఉద్ధరించే విశాల ప్రణాళికను తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం దేవాలయాలను, మఠాలను, పురోహితులను సంస్కరించి వారినే కేంద్రబిందువులుగా చేసి కార్యాన్ని సాధించవచ్చు.

గాయత్రీ మంత్రంలోని మొదటి అక్షరం 'ఓం' ఈ విషయాలలోనే శిక్షణ నిస్తుంది. ఇది ఈశ్వరుని అత్యున్నత నామం. దీని ఉచ్చారణతో సూక్ష్మ ప్రకృతి ఆత్మచేతనతో సంబంధం ఏర్పరచుకునే సాధన దానంతట అదే జరుగుతుంది. ఇది ఈశ్వరుని స్వయంప్రకటిత నామం. అన్నిటి కంటె చిన్న నామము. అంతేగాక గాయత్రీగీత ఆ ఈశ్వరుడు న్యాయకారి, ప్రభువు, సమదర్శి, అవినాశి, చైతన్యం, ఆనందస్వరూపి, నియమరూపుడు, నిరాకారుడు, విశ్వాత్మ అని చెబుతోంది. ఈ నామాలలో దాగి ఉన్న తత్వజ్ఞానాన్ని తెలుసుకొని ఆచరించి 'ఓం' ఉపాసన చేయాలి.

### మూడు అక్షరాలలో మూడు బోధనలు

'ఓం'లో మూడు అక్షరాలు కలసి ఉన్నాయి అ,ఉ,మ్. 'అ' అనగా ఆత్మపరాయణత. శరీర విషయాలను మనసు నుండి తొలగించి ఆత్మానందాన్ని పొందడం. 'ఉ' అనగా - ఉన్నతి. శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక, ఆత్మిక సంపదను వృద్ధి చేసుకోవడం. 'మ్' అనగా - మహిమ. క్షుద్ర, సంకీర్ణ, స్వార్థ, ఇంద్రియ లాలస తత్త్వాలను వదలిపెట్టి ప్రేమ, దయ, ఔదార్యం, సేవ, త్యాగం, సంయమనం, ఆదర్శాలతో జీవించడం. ఈ మూడు అక్షరాలలో ఉన్న శిక్షణను అనుసరిస్తూ వ్యావహారికంగా 'ఓం'ను, ఈశ్వరుని, ఉపాసన చేయాలి.

- అనువాదం: డి.వి.ఆర్.మూర్తి.


**జనమానసాన్ని మార్చేది మౌన సేవ.**

# ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 18

# సిద్ధిమార్గంలో పయనించే సంకల్పం - 1

## కాశీ మహాసభ

1925 - 26 సంవత్సరాల ప్రాంతంలో భారతీయ సమాజంలో మథనం జరిగింది. విదేశీయుల బానిసత్వం నుండి విముక్తి పొందాలనే ఆకాంక్ష సమాజంలో రగులుతోంది. మరోప్రక్క - దురాచారాలనుండి, వికృతుల నుండి విమోచన పొందాలని సామూహిక చేతన తహతహ లాడుతోంది. వెనుకబడిన వర్గాలకూ, దళిత వర్గాలకూ దేవాలయంలో ప్రవేశించే అధికారం లేదు. చదువుకునే హక్కు లేదు. వారు ఊరుమ్మడి బావుల నుండి నీళ్లు తెచ్చుకోవడానికి వీలు లేదు. ఉన్నత కులాలవారి సరసన వారు కూర్చొనడానికి వీలులేదు. వారి ఎదుట తల ఎత్తి నడవడం శిక్షార్హమైన అపరాధంగా పరిగణించబడేది.



ఈ దురవస్థకు కారణాలను చర్చిస్తూ - మహామనా మదనమోహన మాలవ్యా, స్వామి శ్రద్ధానంద, రాజేంద్ర ప్రసాద్ మున్నగు మహనీయులు ఇలా హెచ్చరించేవారు - అంటరానివారినీ, దళితులను అక్కున చేర్చుకున్నప్పుడే హిందూ సమాజం బలపడుతుంది; ఛిన్నాభిన్నమైన సమాజం స్వతంత్రం కాజాలదు; స్వతంత్రం అయినా ఎక్కువ కాలం ఆ స్వాతంత్ర్యాన్ని రక్షించుకొనజాలదు.

మహాత్మా గాంధీ ఈ అభిప్రాయాన్ని సామాన్య ప్రజలలోనికి తీసుకువెళుతున్నారు. తిరుగులేని ప్రజా నాయకుడుగా ఆయన పేరుప్రఖ్యాతులు పెరుగుతున్నాయి. ఆయన చెప్పిన మాటలకు ఎంతో విలువ ఉంటోంది.

అయితే మాలవ్యాజీ ఈ సమస్యను విభిన్నమైన రీతిలో ప్రతిపాదించసాగారు. సంస్కరణ అభిలాషను మేలుకొలిపి, సమాజంలో పరివర్తన తేవడానికి ఆయన తగు చర్యలు తీసుకుంటున్నారు. పండితులూ, విద్వాంసులూ, ఆచార్యులూ ఆయనను గౌరవించేవారు. మాలవ్యాజీ స్వయంగా శాస్త్రవిద్యల ప్రాచీన పరంపరతో ముడిపడి ఉన్న నాయకుడు. సాంఘిక నాయకుని వేదన, విస్తృత నేపథ్యంలో సమస్యలను విశ్లేషించే మహాపురుషుని వేదన గాంధీజీ మాటలలో వ్యక్తమయ్యేది. మాలవ్యాజీ మాటలలో ఈ ప్రత్యేకతలతోపాటు సంప్రదాయ బలంకూడా ఉండేది.

1923లో కాశీలో హిందూ మహాసభ మహాసభలు జరిగేయి. ఆనాడు ఆ సంస్థ భారతీయ ధర్మంలోని అన్ని ప్రవాహాల, అన్ని వర్గాల సంయుక్త వేదిక. మాలవ్యాజీ ఆ మహాసభలకు అధ్యక్షత వహించారు.

మాలవ్యాజీ కృషి ఫలితంగా ఆ మహాసభలలో ఒక నిర్ణయం తీసుకోబడింది. సవర్ణ హిందువులతో సమానంగా దళిత కులాలకు ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యాలయాలలో చదువుకోవడానికీ, బావులనుండి నీళ్లు తోడుకోవడానికీ, చెరువులలో స్నానం చేయడానికీ, సభలలో ఇతరులతోపాటు కూర్చొనడానికీ, రహదారులలో నడవడానికీ, దైవ దర్శనానికీ హక్కు ఉన్నదనీ, ఆ హక్కును అందరూ గౌరవించాలనీ ఒక తీర్మానంలో పేర్కొన్నారు. తీర్మానమయితే ఆమోదించబడింది. కానీ, దాన్ని అమలు చేయడం అంత సులభం కాదు. అందుకోసం సమాజంలో అనుకూల వాతావరణాన్ని నిర్మాణం చేయవలసి ఉంటుంది. అది మరో పోరాటం. అయినా కాశీలో ఎందరో పండితుల, పురోహితుల సమక్షంలో, వారి అంగీకారంతో అలాంటి తీర్మానం ఆమోదింపబడడం ఒక పెద్ద సాఫల్యం.

**సాధకుని సదాచారం దైవ కృపకు సోపానం.**

1925లో హిందూ మహాసభ మహాసభలకు లాలా లజపత్ రాయ్ అధ్యక్షత వహించారు. మేధావులకూ, కాశీకివలెనే ఛాందసవాదులకూ నిలయమైన ఆధునిక నగరం కలకత్తాలో ఆ మహాసభలు జరిగాయి. అంటరానివారికీ, శూద్రులకూ వేదాన్ని పఠించే అధికారాన్ని ఇచ్చే విషయాన్ని ఆ సందర్భంగా లాలా రామప్రసాద్ ప్రస్తావించారు. ఈ ప్రస్తావన రాగానే మహాసభలో అలజడి చెలరేగింది. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మాలవ్యాజీకూడ ఆ సభలో ఉన్నారు. ఆయన పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. ఆయన ఇలా అన్నారు - పరమేశ్వర ప్రసాదం అందరికీ అందవలసిందే. వేదాధ్యయనం ఎవరికీ నిషిద్ధం కాదు. అయితే అందుకు కఠోర తపస్సు అవసరం అవుతుంది. ఆ తపస్సు ప్రతి ఒక్కరికీ మొదటి ప్రయత్నంలోనే సాధ్యపడదు. భగవద్గీత భూమండలంలోని సర్వశ్రేష్ఠమైన గ్రంథం. దానిని అధ్యయనం చేయడం, మననం చేయడం అందరికీ సులువు. గీతద్వారా కొద్ది ప్రయత్నంతో వేదాలలోని మూలతత్వాన్ని అర్థంచేసుకోవచ్చు.

ఈ మాటలతో మాలవ్యాజీ అప్పుడు ఏర్పడిన వైమనస్యాన్ని ఏదోవిధంగా శాంతింపజేశారు. సమాజంలో ఇతర వర్గాలకు ఉన్న అధికారాన్ని అంటరానివారికి ఇవ్వడం ఆయనకు ఇష్టమే. సాధన, స్వాధ్యాయముల రంగాలకు సైతం ప్రాకిన తరతమభేదాలు హిందూ సమాజాన్ని పూర్తిగా దొలచివేశాయన్నది ఆయన అభిప్రాయం. కలకత్తా మహాసభలలో ఏర్పడిన వైమనస్యాన్ని తొలగించిన తర్వాత ఆయన జాతీయ భావాలను ప్రచారం చేస్తూ వివిధ స్థలాలలో పర్యటించారు. జాతీయోద్యమాన్ని ముందుకు నడిపిస్తూ ఆయన సంఘ సంస్కరణ కార్యక్రమాలనుకూడ ప్రోత్సహిస్తూ వచ్చారు. ఆయన ఉపన్యాసాలు అంటరానివారి ఉద్ధరణకూ, మహిళల పరిస్థితిని చక్కదిద్దడానికీ, సాంఘిక దురాచారాల నిర్మూలనకూ ప్రేరణ ఇచ్చేవి. శూద్రుల వేద అధికారంకూడ ఆ ఉపన్యాసాలలో ప్రస్తావనకు వచ్చేది.

1927లో ఆయన ఒక సాహసోపేతమైన చర్య తీసుకున్నారు. ప్రయాగలో అన్ని కులాలవారికీ మంత్రదీక్ష ఇచ్చారు. దానిపై విమర్శలు వచ్చాయి. తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా మాలవ్యాజీ వాటిని లెక్కచేయలేదు. ఆయన ప్రశాంతంగా, నిశ్చలంగా, దృఢంగా తమ పనిలో నిమగ్నులు అయినారు. కలకత్తా, నాసిక్, పూనా, కాశీ మున్నగు స్థలాలలోకూడ సామూహిక మంత్రదీక్ష కార్యక్రమాలు జరిగాయి. వ్యతిరేకత, సమర్థనలతో కూడిన మిశ్రమ ప్రతిస్పందన వాటికి లభించింది.

## సమాజ అనుష్ఠానం

ప్రయాగలో సామూహిక దీక్ష ఇవ్వడానికి కొద్ది నెలలముందు మాలవ్యాజీ ఆగ్రా విచ్చేశారు. మార్గదర్శక సత్తా సాక్షాత్కారం, మహాపురశ్చరణసాధన ప్రారంభం జరిగిన తర్వాత శ్రీరామ్ సామాజిక కార్యకలాపాలలోకూడ మునుపటివలెనే పాల్గొంటున్నారు. మాలవ్యాజీ గురించి ఏ వార్త అందినా, ఆయన దాన్ని శ్రద్ధగా వినేవారు. దాని పూర్తి సమాచారం సేకరించేవారు. వారి సమాజ అనుష్ఠానంలో ఏవిధంగా సహకరించాలా అని ఆలోచించేవారు. 1926 వసంత పర్వం తర్వాత ఆయన తన మునుపటి కార్యకలాపాలను సమీక్షించుకున్నారు. సంఘ సంస్కరణ రంగంలో గత మూడు సంవత్సరాలలో తన పరిసరాలలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, తనకోసం కొన్ని బాధ్యతలను ఎంపిక చేసుకున్నారు.

మాలవ్యాజీ ఆగ్రా విచ్చేశారని తెలిసిన వెనువెంటనే శ్రీరామ్ అక్కడికి బయలుదేరారు. రెండు మూడు రోజులలో తిరిగివస్తానని చెప్పి పయనమయారు. మాలవ్యాజీ ఆగ్రాలో హిందూసభ భవనంలో బస చేశారు. వాస్తవానికి అది సేఠ్ గిరిధర దాస్ గృహం. ఆయన దానిని హిందూసభ కార్యకలాపాలకోసం ఇచ్చివేశారు. ఇలా సామాజికంగా ఉపయోగపడడంతో - అది హిందూ సభ భవన్ అయింది. మాలవ్యాజీ సభా భవనంలోని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు -

బౌద్ధులు, జైనులు, సిక్కులు అందరూ విరాట్

**తన పరిస్థితిని మించి కోరుకోవడం దుఃఖహేతువు.**

హిందూ జాతిలోని అవయవాలు. గ్రామ గ్రామంలో సభ శాఖలను ప్రారంభించాలి. సమాజాన్ని పతనస్థితి నుండి ఉద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. మనం అంటరానివారని పిలుస్తున్నవారు మన సోదరులే. వారిని ప్రేమించాలి. వారి స్థితిగతులను మెరుగుపరచడానికి కృషి చేయాలి. వారిని స్వంత అన్నదమ్ములుగా చూచుకోవాలి. ప్రతి ఊరిలో పాఠశాలలూ, వ్యాయామశాలలూ స్థాపించాలి. మన శరీరాలుకూడ బలిష్ఠంగా ఉండాలి. మనలో శక్తి ఉంటే - మనం బయటి శత్రువులతోనూ, లోపలి శత్రువులతోనూ పోరాడగలుగుతాం. బలమైన శరీరంలోనే బలమైన ఆత్మ నివసిస్తుంది. మనస్సును బలీయం చేయడానికై పూజ, ధ్యానం, జపం, శాస్త్రాల అధ్యయన, మననాలు జరపాలి.

ఛిన్నాభిన్నమై, చిక్కిశల్యమైన హిందూ సమాజాన్ని తిరిగి సంఘటితం చేయాలని మాలవ్యాజీ తమ ప్రవచనాలలో నొక్కి చెప్పేవారు. చర్చలలో కూడ ఆయన అస్పృశ్యుల ఉద్ధరణను ప్రస్తావించేవారు. ఆనాటి ఉపన్యాసం పూర్తయిన తర్వాత ఆయన కార్యకర్తలతో ఇష్టాగోష్ఠి జరిపారు. ఒక కార్యకర్త ఇలా ప్రశ్నించాడు-

అంటరానివారి ఉద్ధరణ అనే మీ ఆలోచన జాతీయ ఉద్యమానికి విభిన్నం కాదా? ఈ కార్యక్రమానికి ప్రాముఖ్యం ఇస్తే, ప్రజల దృష్టి జాతీయోద్యమంనుండి ప్రక్కకు మళ్లుతుంది. అలా మనం మన ప్రధాన లక్ష్యాన్ని విస్మరిస్తాం.''

మాలవ్యాజీ ఎదురు ప్రశ్నవేశారు -

"ప్రధాన లక్ష్యం ఏమిటి?''

"స్వరాజ్యం''

"స్వరాజ్యం ఎందుకు?''

ప్రశ్నించిన కార్యకర్త బాగా తయారయ్యే వచ్చాడు. అతడు ఇలా జవాబిచ్చాడు -

"ప్రపంచంలో మనం తల ఎత్తుకుని తిరగడానికి; మన గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకునేందుకు వాటిని పెంపొందించుకునేందుకు.''

ఈ జవాబుతో మాలవ్యాజీ ఆ కార్యకర్త మనసులోని భావాన్ని గ్రహించారు. ఆయన ఇలా వివరించారు -

'గౌరవ ప్రతిష్ఠలు ఎవరో ఒక వ్యక్తివి కావు - దేశమంతటి ఆత్మగౌరవం, సమాజపు ఆత్మగౌరవం. అందుకోసం మనకు స్వరాజ్యం కావాలి. మనం ఈ సంగతి మరువకూడదు. లక్షలాది, కోట్లాది మన సోదరుల గౌరవాన్ని కాలరాస్తూ ఉంటే, మనకు ఆత్మగౌరవం లభించదు. వారి గౌరవ ప్రతిష్ఠలను కాపాడడం ద్వారానే మనం మొత్తం జాతి గౌరవాన్ని పునఃప్రతిష్ఠ చేయగలుగుతాము.'

ఆయన సమన్వయ సూత్రాన్ని ఇలా వివరించారు -

"రోగం వచ్చినప్పుడు అందరి ఆలోచన దాన్ని నయంచేయడంపై లగ్నం కావాలి. ఔషధం భోజనం కాదు. శాశ్వత సంస్కరణ తాత్కాలిక చర్య కాదు. దాని ప్రభావం ఎల్లకాలం నిలచి ఉండాలి. జాతీయోద్యమానికి విరుద్ధమైన పనిని దేనినీ మనం చేయకూడదు. అంటరాని వారి స్థితిగతులను మెరుగుచేయడానికి కృషి చేయకపోతే, వారిని మనతో కలుపుకుని ముందుకుపోలేము.''

## దీక్షాగురువుతో పునస్సమాగమం

ఆనాటి సభలో మాలవ్యాజీ ఉపన్యాసం విన్న తర్వాత శ్రీరామ్ ఈ చర్చాగోష్ఠిలోనికి కూడ వచ్చారు. ఆయన మాలవ్యాజీకి ప్రణామంచేసి, ఒకప్రక్కన కూర్చున్నారు. గోష్ఠిలో ఇతరులుకూడ కూర్చున్నారు. వారిలో హెచ్చుమంది యువ కార్యకర్తలు. ప్రతి ఒక్కడూ తన పరిచయం చేసుకున్నాడు. శ్రీరామ్ తన పరిచయం చేసుకుంటూ ఒకటి రెండు వాక్యాలు చెప్పేసరికి మాలవ్యాజీకి గతంలో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. కొన్ని సంవత్సరాలక్రితం పండిత రూపకిశోర్‌తోపాటు కాశీ వచ్చిన ఈ బాలుడు, ఇతడికి సంబంధించిన సంఘటనలు స్మృతిపథంలో మెదిలాయి. ఆ బాలునిలో శుభ లక్షణాలు తనకు కనిపించిన సంగతి, అతడు ముందు ముందు దేశానికీ, సమాజానికీ విశిష్టమైన సేవ చేస్తాడనే ఆశ తనకు కలిగిన సంగతి

**సువ్యవస్థిత దినచర్య ఆరోగ్యానికి మూలం.**

ఆయనకు గుర్తు వచ్చాయి.

ఈలోగా ఒక కార్యకర్త శ్రీరామ్ గురించి మరో సంగతి ప్రస్తావించాడు. తన గ్రామంలో జబ్బుపడిన ఒక అస్పృశ్య మహిళకు శ్రీరామ్ సేవ చేయడం, ఆ కారణంగా అతడు కొంత కాలం దండనకు గురికావడం - ఇదంతా చెప్పాడు. మాలవ్యాజీ ఈ సంఘటనను స్వయంగా శ్రీరామ్ నోటినుండి విన్నారు. సేవ చేస్తున్న సమయంలో అతడి మనస్సులో ఏయే భావాలు మెదిలాయో అడిగి తెలుసుకున్నారు. అంతా విన్న తర్వాత శ్రీరామ్ వీపు తట్టి ఇలా అన్నారు -

''ముందు ముందు నీవు మరిన్ని సవాళ్ళను ఎదుర్కొనవలసి ఉంటుంది.''

ఈ సమావేశంలో మాలవ్యాజీతో మామూలు విషయాలు మినహా చెప్పుకోదగ్గ చర్చ జరగలేదు. సమాజ సంస్కరణపై, జాతీయ ఉద్యమంపై జరిగిన చర్చలోనే సమయం గడచిపోయింది. ప్రత్యక్షంగా ప్రధానమైన చర్చ జరిగే అవకాశం లేకపోయింది. గోష్ఠిలో పాల్గొన్న ప్రజలు, స్వరాజ్య సమర సేనానులు, సామాజిక కార్యకర్తలమధ్య జరిగిన సంభాషణ వినే అవకాశం కలిగింది. శ్రీరామ్ తన పాత్రను నిర్ణయించుకోవడానికి ఆ సంభాషణ దోహదం చేసింది. అక్కడ కార్యకర్తల సంభాషణ సాగుతోంది. ఇక్కడ ఆవల్‌ఖేడా వెళ్లిన తర్వాత తాను ఏమి చేయాలో ఆయన నిర్ణయించుకుంటున్నారు.

ఆవల్‌ఖేడా చేరగానే, శ్రీరామ్ బాలసేన సమావేశం ఏర్పాటుచేశారు. తన ఆగ్రా యాత్ర వివరాలు తెలిపారు. ఆగ్రాలో సైనిక స్థావరం ఉన్నప్పటికీ ప్రజలు ఎలా ధైర్యంగా, నిర్భయంగా పోరాడుతున్నారో ఆయన వివిధ సంఘటనలను వర్ణిస్తూ వివరించారు. మామూలుగా ప్రజలు సైనికులను చూస్తే భయపడతారు. అయితే యువకులలో ఉత్సాహం ఉరకలు వేస్తోందనీ, తలపడడానికి వారు తహతహలాడుతున్నారనీ ఆయన పేర్కొన్నారు.

రామప్రసాద్ అనే యువకుడు ఉత్తేజంతో ఇలా అన్నాడు -

"శ్రీరామ్! మనమూ తయారుగానే ఉన్నాం. మనమూ ఎవ్వరికీ భయపడము. ఆనాడు ఆ లావుపాటి ఆఫీసరునూ, నల్ల సైనికులనూ మనం ఎలా తరిమికొట్టామో నీకు గుర్తులేదా?''

"అది గ్రామంలో జరిగిన సంఘటన. సైనిక స్థావరంలో ఎదిరించడం చాలా పెద్ద విషయం. మనం వాళ్లనుండి ఎన్నో విషయాలు నేర్చుకోవాలి.''

- అని శ్రీరామ్ జవాబిచ్చారు.

రామప్రసాద్‌కు తమపట్ల ఈ చిన్నచూపు నచ్చలేదు. ఆగ్రా యువకులతో పోల్చి తమను తాము కించపరచుకుంటున్నామని అతడికి అనిపించింది.

అతడు ఇలా అన్నాడు -

"ఎవరన్నారు ఆ మాట? ఆగ్రాలో మీరే ఒక లావుపాటి ఆఫీసరు తల పగులగొట్టలేదా?''

అందరూ రామప్రసాద్‌తో ఏకీభవించారు.

ఆ సంఘటన 1923నాటిది. అప్పుడు శ్రీరామ్ వయస్సు 12 సంవత్సరాలు. ఆయన ఆగ్రా వెళ్లారు. అక్కడ ఒక ఆంగ్లేయ సైనికాధికారి ఒక యువతిని వేధిస్తూ ఉండడం చూచారు. ఆ అధికారి ఆ యువతిని తనవద్దకు రమ్మని జబర్దస్తీగా కేకవేశాడు. ఆమె తెలివికలది. ఆ అధికారి ఉద్దేశ్యం ఏమిటో ఆమె పసికట్టింది. ఆ అధికారివైపు వెళ్లడానికి బదులు - ఆమె చకచకా ముందుకు సాగిపోయింది.

### ఆతతాయి తల పగిలింది

అధికారి ఆమెను వెంబడించాడు. ఆ యువతితో పాటు వెళుతూన్న యువకుడు "ఏమిటి విషయం?'' అని అడిగాడు. అధికారి దృష్టిలో అలా అడగడం అపరాధం. దానికి శిక్ష పడవలసిందే అనుకుని - అతడు తన తుపాకీ మడమతో ఆ యువకుని వీపుమీద కొట్టాడు. ఆ దెబ్బకు యువకుడు క్రింద పడిపోయాడు. అధికారి అతడిని అలా వదిలివేసి యువతివెంట పరుగెత్తాడు. ఆమె భయపడి పారిపోతోంది. తెల్ల

**ప్రాణశక్తిని పెంచుకోవాలంటే గాయత్రిని జపించాలి.**

అధికారి ఆమెను వెన్నాడుతున్నాడు.

శ్రీరామ్ ఒక దుకాణంవద్ద నిలబడి ఇదంతా చూస్తున్నారు. ఆయన మనస్సు రోషంతో కుతకుతలాడింది - ఆ రోషం ఆ తెల్ల అధికారి మీదా, ఇదంతా చూస్తూ ఊరుకుంటూన్న జనంమీదా. తాను ఏమి చేయాలో ఆయన తక్షణం నిర్ణయించుకున్నారు. దుకాణం తలుపునకు అడ్డంపెట్టి ఉన్న రాయిని చేతితో ఎత్తారు. సరిగ్గా గురి చూచి ఆ అధికారిపైకి విసిరారు. ఆ దెబ్బకు అధికారి తూలి క్రిందపడ్డాడు. ఏడుస్తూ పైకి లేచాడు. కానీ, అతడి కాళ్లలో సత్తువ లేదు. అతడు ఇటూఅటూ తూలుతూ నడుస్తున్నాడు. అరుస్తున్నాడు. పెడబొబ్బలు పెడుతున్నాడు. జనం ఇంకా అలా వింత చూస్తూనే ఉన్నారు. రాయి ఎవరు విసిరారో ఎవ్వరూ చెప్పలేదు. అతడు జనాన్ని భయపెడుతున్నాడు. బెదిరిస్తున్నాడు. అయినా ఎవ్వరూ ఏమీ చెప్పలేదు. ఈలోగా ఆ యువతి ఒక సురక్షిత స్థలంలో దాగికొన్నది. ఆంగ్ల అధికారి తిరిగివెళ్లిపోయాడు.

ఈ సంఘటన తర్వాత శ్రీరామ్ తన వయస్సుగల యువకులను సంఘటితం చేయాలని నిర్ణయించారు. ఆ కారణంగా - బాలసేన సభ్యులకు ఈ సంఘటన బాగా గుర్తుంది.

మాలవ్యాజీని కలుసుకుని తిరిగివచ్చిన తర్వాత శ్రీరామ్ మరింత క్రియాశీలం కావడానికి పథకాలు రూపొందించసాగారు. కొన్ని కార్యక్రమాలు ఖాయమైనాయి. సాధనా క్రమం దాని తరహాలో అది సాగుతోంది. దానికోసం అదనంగా 4 - 5 గంటల సమయం కేటాయించవలసి వచ్చింది. అందుకోసమై ఆయన నిద్ర సమయాన్ని తగ్గించారు. ఆవుపాలు, మజ్జిగ, జొన్న రొట్టె మున్నగువాటి ఏర్పాటు తల్లిగారు చూచేవారు. అఖండ దీపంలో నేయి వేస్తూ ఉండే పనికూడ ఆమె చేసేవారు.

శ్రీరామ్‌కు వివాహం చేయాలన్న ఆమె పట్టు కొనసాగుతోంది. అది మరింత తీవ్రమయింది కూడా. శ్రీరామ్ గ్రామంలోని యువకులను ప్రోగుచేసి గోష్ఠులు నిర్వహించడంతో, హెచ్చు సమయం ఇంటి బయట గడపడంతో, కరపత్రాలూ, పోస్టర్లూ పంచుతూ అతికిస్తూ ఉండడంతో - తల్లిగారి పట్టుదల మరింత ఉధృతం అయింది. సంబంధాలు చూడవలసిందిగా బంధువులందరికీ ఆమె చెప్పి ఉన్నారు. ఫలితంగా కొన్ని సంబంధాలు వచ్చాయి. వాటిలో ఏదో ఒక సంబంధాన్ని ఎంపికచేసి చెప్పమని ఆమె శ్రీరామ్‌ను అడిగారు. శ్రీరామ్ కొంతసేపు ఆలోచించి ఇలా అన్నారు -

"ఇప్పుడంత తొందర ఎందుకు? ఈ వయస్సులో పెళ్లి చేసుకోవడం మత విరుద్ధం అవుతుంది."

## సహధర్మచారిణికోసం అన్వేషణ

"గ్రామంలోని మగపిల్లలంతా 14 - 15 సంవత్సరాల వయస్సుకే పెళ్లిచేసుకుంటున్నారు. నీ స్నేహితులలో పలువురికి పెళ్లిళ్లు జరిగాయి. నీవుకూడ పెళ్లి చేసుకో."

- అని తల్లిగారు నచ్చజెప్పారు. శ్రీరామ్ మౌనం వహించారు. తల్లిగారు మళ్లీ చెప్పారు, గట్టిగా చెప్పారు. శ్రీరామ్ కొంచెం ఆలోచించి ఇలా జవాబిచ్చారు -

"కొంత కాలం ఆగమ్మా."

"ఎంత కాలం?"

"అదే, ఓ ఏడాదిపాటు."

తల్లిగారు కారణం అడిగారు. శ్రీరామ్ ఇలా వివరించారు -

"మగపిల్లలు 16 సంవత్సరాలలోపు వయస్సులో పెళ్లి చేసుకోకూడదని మాలవ్యాజీ మహారాజ్ నిర్దేశించారు. 20 - 21 సంవత్సరాల వయస్సువరకు ఆగితే మంచిదనీ, 16 సంవత్సరాల పరిమితిని పాటించవలసిందేననీ ఆయన వివరించారు."

మాలవ్యాజీ మహారాజ్ ప్రస్తావన విని తాఊజీ మిన్నకున్నారు. మళ్లీ ఇలా అడిగారు -

**నిండుమనసుతో ప్రయత్నించక పోవడమే వైఫల్యానికి మూల కారణం.**

"అయితే పెళ్లికూతురు వయస్సు ఎంత ఉండాలి?''

"కనీసం 12 సంవత్సరాలు. అఖండ దీపం సంగతి చూడడానికీ, గోసేవకూ నీకు కోడలి అవసరం ఉన్నదని నాకు తెలుసు. అయినా - శాస్త్ర నియమాన్ని పాటించవలసిందేకదా.''

ఇందుకు ఏమి జవాబు చెప్పాలో తాఈజీకి తోచలేదు. కొంచం ఆలోచించి ఆమె ఇలా అన్నారు -

"ఈలోగా వధువును చూడవచ్చుకదా.''

"ఆ సంగతి నీకే తెలియాలి. కోడలు కావలసింది నీకు. నీవు చూచి నిర్ణయించు.''

వివాహం కోసం 16 సంవత్సరాల వయస్సు వరకు ఆగాలని శ్రీరామ్ చెప్పడానికి కారణం ఉంది. ఆడపిల్లకు 8 - 10 సంవత్సరాలు వస్తే చాలు, పెళ్లి ఈడు వచ్చిందని ఆరోజుల్లో జనం భావించేవారు. ఆ వయస్సు వరకు ఆడపిల్లకు పెళ్లికాకపోవడం కొన్ని కుటుంబాలలో, కులాలలో, గ్రామాలలో చింతించవలసిన విషయంగా ఉండేది. కనుక ఏ వయస్సుగల పిల్లవాడు దొరికినా, అతడితో ఆడపిల్ల పెళ్లి జరిపించేవారు. మగపిల్లవాడి వయస్సు 10 - 12 నుండి 20 - 21 సంవత్సరాల వరకు ఏదైనా సరిపోయేది. అది 10 - 11 సంవత్సరాలు ఉంటే మరీ మంచిది.

ఈ బాల్య వివాహ ఆచారంవల్ల ఆడపిల్లలూ మగపిల్లలూ యౌవనం రాకముందే ముసలివాళ్లయే పరిస్థితులు ఏర్పడ్డాయి. హిందూ సమాజాన్ని శక్తిశాలిగా, సంఘటితంగా రూపొందించే ఉద్యమాన్ని ప్రారంభించిన మాలవ్యాజీ బాల్య వివాహాలను గురించికూడ ఆలోచించారు. అస్పృశ్యుల ఉద్ధరణ, శుద్ధి సంస్కారం, మహిళలకు గౌరవం - అనే త్రిసూత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాలవ్యాజీ బాల్య వివాహాలను నిరుత్సాహపరచాలని కూడ నొక్కిచెప్పసాగారు. 1923 ఆగస్టులో కాశీలోనూ, 1925 జనవరిలో ప్రయాగలోనూ జరిగిన మహాసభల సమయంలో మాలవ్యాజీ విద్వత్ పరిషత్తులను ఏర్పాటుచేసి, సమాజ సంస్కరణపై విద్వాంసుల, ఆచార్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆడపిల్లకు 12 సంవత్సరాల వయస్సులోపు, మగపిల్లవాడికి 16 సంవత్సరాల వయస్సులోపు పెళ్లి చేయకూడదని ఆ పరిషత్తులలో ఏకాభిప్రాయం ఏర్పడింది. ఆడపిల్ల వయస్సు 16 సంవత్సరాలు, మగపిల్లవాడి వయస్సు 20 సంవత్సరాలు ఉంటే మరీ మంచిదని కూడ ఏకాభిప్రాయం ఏర్పడింది.

ఆనాటి ఆచార వ్యవహారాల దృష్ట్యా కనీస వయస్సు పై ఈ నిర్ణయం ఒక పెద్ద ముందడుగే. సమాజంలో ఇందుకు నిరసన వ్యక్తం కావచ్చు. పండితులు దీన్ని వ్యతిరేకించారుకూడా. ఏమైనా - ఈ నిర్ణయం వెంటనే అమలు జరగలేదు. కొద్ది మంది మాత్రమే మాలవ్యాజీ నిర్దేశాలను పాటించారు.

ఆవల్ఖేడాలో ఈ నియమాన్ని పాటించిన మొట్టమొదటి వ్యక్తి శ్రీరామ్. పెళ్లికూతురుగా ఎవరిని ఎంపిక చేసినా, ఆ అమ్మాయి వయస్సు 12 సంవత్సరాలలోపు ఉండకూడదని ఆయన తన తల్లిగారితో స్పష్టంగా చెప్పారు. వివాహానికి మరి నాలుగు సంవత్సరాలు ఆగాలని ఆయన అనుకున్నారు. అయితే, పూజ గదిలో అఖండ దీపం పని తల్లి అయినా చూడాలి, భార్య అయినా చూడాలి. తల్లిగారికి రోజంతా ఇతర పనులు చాలా ఉండేవి. పెద్ద కుటుంబం. వచ్చిపోయే బంధువుల తాకిడి హెచ్చు. తల్లిగారికి ఆ పనులే సరిపోయేవి. కనుక అఖండ దీపం పనిని భార్యకు అప్పగించడం మంచిదని శ్రీరామ్ అనుకున్నారు. గోసేవ, నేయి, మజ్జిగ మున్నగువాటిని తయారుచేసి పూజకోసం సిద్ధం చేయడం భార్యద్వారానే సక్రమంగా జరుగుతాయని ఆయన భావించారు. కుటుంబాన్ని ఏర్పాటుచేసుకుని మామూలు వ్యక్తివలె వంశాన్ని కొనసాగించడానికి కాక - తన ధర్మపత్ని సాధనలో తన సహచరి అవుతుందనే భావంతో శ్రీరామ్ తన వివాహానికి అనుమతి ఇచ్చారు.

H H H

**అశుభ కర్మ, దేహాభిమానం మనిషిని మరుగుజ్జుగా మార్చుతాయి.**

# 2020 నాటికి కృతయుగ వాతావరణం

## జీవించే కళకు దీపస్తంభం

మన విరాట్ యోజనలతో నిండిన 12 సంవత్సరాల సాఫల్యాలు 'యుగ నిర్మాణ యోజన' సిద్ధాంతాన్ని సామాన్య ప్రజలకు అందించాయి. స్వచ్ఛందసేవకుల స్థాయిలో లక్షలాది వ్యక్తులు అంశదానం, సమయదానం, శ్రమదానముల ద్వారా విరాట్ యోజనల పరంపరను ఎలా అమలు చేయగలరో ప్రజాసామాన్యం తెలుసుకున్నది.

వీటన్నిటికీ మరింత మహత్తరమైన సాఫల్యం తోడయింది. జీవించే కళకు వెలుగు దివ్వెగా దేవసంస్కృతి విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది.

గురుసత్తా ఆకాంక్షకు అనుగుణంగా - నలందా, తక్షశిలల నమూనాలో ఈ విశ్వవిద్యాలయ స్థాపన జరిగింది. 1980లో గాయత్రీ విద్యాపీఠ్ రూపంలో గురుకులాన్ని స్థాపించే సమయంలో వారిలా అన్నారు -

"భారతీయ సంస్కృతిని బోధించే ఒక విశ్వవిద్యాలయ స్థాయి వ్యవస్థను మేము నిర్మాణం చేస్తాము. ఎపుడు చేస్తాము? మీరు చూస్తారు కదా. మేము ఉన్నా లేకపోయినా - విత్తనాన్ని మాత్రం నాటుతున్నాం. మా వారసులు వచ్చే 10 - 15 సంవత్సరాలలో ఈ సమగ్ర వ్యవస్థను నిర్మాణం చేస్తారు." (గురువర్ కీ ధరోహర్ - భాగ్ 2, పుట 80).

ఇందుకు అయిదు సంవత్సరాలు ఆలస్యం అయింది. అయితే, ఈ వ్యవధిలో ప్రశిక్షకుల స్థాయి కార్యకర్తల నిర్మాణం జరిగింది. 1999లో మనకు స్థలం దొరికింది. 28 ఎకరాల స్థలం కొనుగోలు జరిగింది. 1999 మే 23న జాతీయ సంత్‌ల సమక్షంలో భూమిపూజ జరిగింది. క్రమక్రమంగా నిర్మాణం పని ఆరంభం అయింది. మొదట 2001లో నిర్మాణమైన భవనంలో ఒక కళాశాల ప్రారంభమయింది. శ్రీవేదమాతా గాయత్రీ ట్రస్టు విజ్ఞప్తిపై ఉత్తరాంచల్ ప్రభుత్వం 2002 ఏప్రిల్ 22న దేవసంస్కృతి విశ్వవిద్యాలయానికి అధికారికంగా గుర్తింపు ఇచ్చింది. 2002 జూన్‌లో మొదటి బ్యాచ్ ఎంట్రెన్స్ పరీక్ష వ్రాశారు. జూలైలో జ్ఞానదీక్షా మహోత్సవం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు చేరారు. మనోవిజ్ఞానం, యోగం, మత విజ్ఞానం, సమగ్ర ఆరోగ్య యాజమాన్యం, వివిధ భాషల పాఠ్యప్రణాళికతో పాటు జీవించే కళలో ప్రశిక్షణకు వ్యవస్థ నిర్మాణమయింది. విద్యార్థినీ విద్యార్థుల మొదటి బ్యాచ్ గత సంవత్సరం జూలైలో ఉత్తీర్ణులు అయినారు. 2004 నవంబరు 8న జరిగిన భవ్యమైన స్నాతకోత్సవంలో వారికి డిగ్రీలు ప్రదానం చేయబడ్డాయి. గౌరవనీయులు ఉపరాష్ట్రపతి ఉత్సవానికి విచ్చేశారు. భారతీయ వేషభూషలతో విద్యార్థులు డిగ్రీలను స్వీకరించారు.

## సాకారం అయిన దివ్య స్వప్నం

గత మూడు సంవత్సరాలలో ఇదంతా ఇంత వేగంగా జరిగిపోవడం ఒక కలలా అనిపిస్తోంది. అదనంగా సుమారు 55 ఎకరాల స్థలం కొనుగోలు చేయబడింది. గ్రామ యాజమాన్య విభాగం ప్రారంభమయింది. సుమారు 44 కోట్ల రూపాయల నిర్మాణం ఈ స్థలంలో జరిగింది. దీనిని గాయత్రీ కుంజ్ అని పిలుస్తారు. హరిద్వార్ - ఋషీకేశ్ - డెహ్రాడూన్ రోడ్డుమీద శాంతికుంజ్‌కు సుమారు 3/4 కిలోమీటరు దూరంలో ఉంది ఈ స్థలం.

ఈ ధనమంతా వ్యక్తుల అంశదానంద్వారా సమకూరింది. ఆవాస విశ్వవిద్యాలయంలోని విద్యార్థినీ విద్యార్థులేకాక - అధ్యాపకులూ, అధ్యాపికలూ కూడ దేవసంస్కృతి నిబంధనలన్నింటినీ అక్షరాలా పాటిస్తున్నారు. సాదాగా జీవిస్తున్నారు. ఉదాత్తంగా ఆలోచిస్తున్నారు. ధ్యానంలో, భగవద్గీతలో శిక్షణ పొందుతున్నారు. అన్ని మతాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులూ ఇక్కడ ఉన్నారు. వీరంతా నవయుగానికి పునాది వేస్తున్నారు.

**ఉడతా భక్తిని తేలిక చేయకు, సేతు బంధనం దారిని మూయకు.**

## భావి కార్యకర్తల తరం నిర్మాణం

6నెలల సర్టిఫికెట్ కోర్సు, ఒక సంవత్సరం డిప్లొమా కోర్సు, రెండు సంవత్సరాల పి.జి.కోర్సు - వీటిలో ఉత్తీర్ణులు అయిన తర్వాత పిల్లలందరూ ఇంటర్న్‌షిప్ కోసం కార్యక్షేత్రాలకు వెళతారు. 3నుండి 6 నెలలపాటు ఫీల్డ్‌లో అనుభవం పొంది తిరిగివస్తారు. కేంద్రానికి తమ సమయదానం ఇస్తారు. లేదా పిహెచ్.డిలో చేరతారు.

ప్రస్తుతం 35కన్న హెచ్చుమంది విద్యార్థినీ విద్యార్థులు మిషన్‌కు సంబంధించిన వివిధ విషయాలపై పరిశోధన జరుపుతున్నారు. బ్రాహ్మణోచితమైన బ్రతుకు దెరువు భత్యం తీసుకుని వారు గురువరుల ఆకాంక్షకు అనుగుణంగా భావి కార్యకర్తలుగా రూపొందుతున్నారు. ఆశావాదంతో నిండిన ఈ యువకార్యకర్తలు మిషన్‌ను ముందుకు తీసుకువెళ్లడం నిస్సంశయం.

## విశ్వవిద్యాలయ భావి యోజనలు

ఈ సంవత్సరమే దూరవిద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) కేంద్రాల ద్వారా విశ్వవిద్యాలయ సిద్ధాంతాలను దేశమంతటా విస్తరించాలనే సంకల్పం జరిగింది.

దీనితోపాటు దేశమంతటా యోగ శిక్షార్థులకు పది రోజుల శిక్షణ శిబిరాలు 20 స్థలాలలో సంవత్సరం పొడవునా నిర్వహించే ప్రణాళికకూడా రూపొందింది.

2005 జూన్‌నుండి 'మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం'లో రెండు సంవత్సరాల కోర్సు ప్రారంభం అవుతోంది. ఇందువల్ల మిషన్ సిద్ధాంతంతో నిండిన భారతీయతను ప్రజానీకానికి వ్యాప్తి చేయాలని సంకల్పించిన పాత్రికేయులూ, ఎలెక్ట్రానిక్ మీడియాలో పనిచేసేవారూ అయిన జర్నలిస్టులు భావాత్మకమైన ఆధ్యాత్మిక చింతనను వ్యాప్తి చేయడానికై పెద్ద సంఖ్యలో వెలికివస్తారు.

అలాగే, ప్రత్యామ్నాయ - పూరక చికిత్సా విధానాల వికాసానికీ, పరిశోధనకూ - ఒక విరాట్ కేంద్రం త్వరలో ఇక్కడ నిర్మాణం అవుతుంది. ఈ కేంద్రం శారీరక - మానసిక ఆరోగ్య రంగానికి ఒక విప్లవాత్మకమైన మలుపు ఇస్తుంది. ఈ కేంద్రంలో జరిగే పరిశోధనలవల్ల భారతీయ చికిత్సా విధానాలకు వైజ్ఞానిక ఆధారం లభిస్తుంది.

రెండు సంవత్సరాల తర్వాత విశ్వవిద్యాలయం 500 కళాశాల స్థాయి కేంద్రాలను అధికారికంగా ప్రారంభిస్తుంది. ఇవి భారతదేశమంతటా విస్తరించి ఉంటాయి.

**2011 నాటికి నలందా, తక్షశిల విశ్వవిద్యాలయాలను మించిన వ్యవస్థగా ఈ విశ్వవిద్యాలయాన్ని రూపొందించే యోజన జరిగింది.**

ఈ సంవత్సరమే ఒక అంతర్జాతీయ ప్రశిక్షణ, అవాస వ్యవస్థ నిర్మాణం అవుతోంది. జూలై - ఆగస్టులలో అమెరికా, బ్రిటన్, కెనడాలనుండి 200మంది విద్యార్థినీ విద్యార్థులు వచ్చి ఇక్కడ ప్రశిక్షణ పొందుతారు. డిసెంబరు - జనవరిలలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజీలాండ్‌లకు చెందిన విద్యార్థులు ప్రశిక్షణ పొందుతారు. 1 - 1 1/2 మాసాల ఈ ప్రశిక్షణ సంవత్సరమంతా కొనసాగుతుంది.

**విశ్వవిద్యాలయం కోసం ఒక రూపాయినుండి అయిదు రూపాయలు ప్రతిరోజూ ఇచ్చేవారి కోసం లక్షన్నర జ్ఞానఘటాలు దేశమంతటా స్థాపించబడ్డాయి.**

ప్రభుత్వంకాని, ధనవంతులు కాని ఇచ్చే దానంపై ఈ విశ్వవిద్యాలయం ఆధారపడి లేదు. ఇదంతా గురుసత్తాయొక్క సూక్ష్మ, కారణ రూపముల సక్రియ చేతన ప్రభావమే. విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం నుండి కాని, ప్రభుత్వంనుండి కాని సహాయం పొందకుండా ఈ విశ్వవిద్యాలయం తన స్వాభిమానాన్ని ప్రకటించుకున్నది. మన పరిజనులమీద - అఖిల విశ్వగాయత్రీ పరివార్ కార్యకర్తలమీద - ఆధారపడి, అంశదానాలతో ఈ వ్యవస్థ ఏర్పడింది.

## ఇక మిగిలింది చివరి అడుగే

పెద్దపెద్ద పనులను వేగవంతం చేయడానికే, వాటిని ఎన్నో రెట్లు తీవ్రతరం చేయడానికే మన గురుసత్తా సూక్ష్మ, కారణాలలో ప్రవేశించారని ఈ సాఫల్యాలన్నింటివల్లా మనం విశ్వసించాలి. వారు బాష్పీభూతులై విరాట్‌తో ఏకాకారులు

**సత్యవిచారణ లేనిచోట ధన భాండారం వ్యర్థం.**

అయినారు. ప్రపంచంలోని శ్వాస పీల్చే ప్రతి వ్యక్తికీ ప్రాణప్రేరణనూ, ప్రేమనూ ప్రదానంచేసే సామర్థ్యం వారికి ఉంది.

పూజ్యవరులు కొత్త కొత్త రంగాలలో ప్రవేశిస్తున్న కొలదీ మన బాధ్యత మరింతగా పెరుగుతోంది. జనజాగరణ కార్యాన్ని వ్యక్తి వ్యక్తికీ అందించే పని పరిజనులమైన మనది. పంట చేతికి వస్తోంది. ఈ దశలో పలాయనం చేసే వ్యక్తి దురదృష్టవంతుడు అవుతాడు. రంగంలో స్థిరంగా నిలబడవలసిన తరుణం ఇది. ఎందుకంటే - ఇంతవరకు జరిగిన మన కార్యముల చివరి అడుగు మాత్రమే ఇక మిగిలి ఉంది. అది పూర్తయే వరకు మనమంతా క్రియాశీలంగా నిలచి ఉండాలి. ఆ తర్వాత విజయమే విజయం; 'యుగ నిర్మాణమే' జరగవలసి ఉంటుంది.

### వచ్చే ఏడు సంవత్సరాలలో బాధ్యతలు

మన భావి బాధ్యతల విషయం అందరూ తెలుసుకోవాలి.

2005 నుండి 2011-12 వరకు గల సమయం మిషన్ విశ్వమంతటా విస్తరించే సమయం. 2011-12 పూజ్యవరుల శతజయంతి సంవత్సరం.

ఆ తర్వాతి ఎనిమిది సంవత్సరాలలో ఈ వ్యవస్థలు బలపడి, క్రియాశీలం అవుతాయి. వేగం పుంజుకుంటాయి. అప్పుడు కృతయుగ వాతావరణం నలువైపులా కానరావడం ప్రారంభమవుతుంది.

ఈ సంవత్సరంలో మొట్టమొదటి బాధ్యత - మేధావి వర్గంలో మన ప్రభావాన్ని పటిష్టం చేయడం. ఈ సంవత్సరం బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ యొక్క రజత జయంతి (1979 - 2004) సంవత్సరం. దీన్ని మనం 2004 జూన్‌నుండి 2005 జూన్‌వరకు జరుపుతున్నాం. వైజ్ఞానిక అధ్యాత్మవాదంపై లోతయిన పరిశోధన జరిపి, దాని ఫలితాలను సామాన్య ప్రజలకు అందించడానికై ఈ శోధ సంస్థాన్ స్థాపించబడింది. ఫలితాలను సామాన్యులకు తెలియజెప్పడానికై 2004 జూలై నుండి 2004 నవంబరు వరకు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సంవత్సరంకూడ ఆ కృషి కొనసాగుతుంది.

H H H

## ప్రతిభామూర్తి దుర్గాబాయి దేశ్‌ముఖ్

దుర్గాబాయి ఆంధ్రప్రదేశ్‌లోని సాంప్రదాయక జమీందారీ కుటుంబంలో జన్మించింది. విద్యార్జనలో ఆసక్తి, తక్షణ వివాహంలో పూర్తి నిరాసక్తత ఉండేవి. ఇంటిలోనే ఉండి మెట్రిక్ పాసై, విశాఖపట్టణం లోని విశ్వ విద్యాలయానికి దరఖాస్తు పెట్టింది. హాస్టలు వసతి లేనందున ఆమె దరఖాస్తు తిరస్కరించబడింది. ఆమె తన లాంటి వారిని 12 మందిని ప్రోగు చేసింది. వసతి ఏర్పడింది. డిగ్రీ పూర్తి చేసి, న్యాయవాద విద్యలో ఉత్తీర్ణురాలైనది.

సత్యాగ్రహ ఉద్యమం మొదలైంది. దానిలో ముందుకురికింది. ఆ ప్రాంతపు కాంగ్రెసు సంచాలకులు శ్రీనివాసు జైలుకు వెళ్ళగానే ఆయన స్థానంలో ఆమెను కాంగ్రెసుకు బాధ్యురాలుగా చేశారు. ఆమె బాధ్యత వహించి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసింది. ఆమె కూడా జైలుకు వెళ్ళవలసి వచ్చింది. ప్రాంతీయ స్థాయిలో హిందీ ప్రచారం చేసింది. కాకినాడ కాంగ్రెస్ మహాసభకు 500 మంది స్వయంసేవికలతో చేరుకున్నది. మహిళల స్థితిగతుల మెరుగుదలకు ఇంటింటికీ తిరిగి కృషి చేసింది. భారత రాజ్యాంగ నిర్మాణ సమితిలో సభ్యురాలైంది. జీవిత చరమదశలో అప్పటి భారత ఆర్థిక మంత్రి సి.డి.దేశ్‌ముఖ్‌ను వివాహమాడింది. జాతి పునర్నిర్మాణ కార్యక్రమాలలో జీవితాంతం పగలు రాత్రి కృషి చేసింది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**సదాచారాన్ని మించిన సంపద లేదు.**

# శతజయంతి ఉత్సవాలకు షడ్వర్ష ప్రణాళిక

పరమపూజ్య గురుదేవుల శతజయంతి ఉత్సవాల కోసమై ఆరు సంవత్సరాల ప్రణాళిక ఈ సంవత్సరం వసంత పంచమి రోజున ప్రకటించబడింది.

## 2005-6లో ట్రస్టీలకు శిక్షణ

ఈ సంవత్సరంలో దేశంలోని ప్రజ్ఞా సంస్థాన్‌లు అన్నీ చట్టపరమూ, ఆర్థికమూ, అయిన వ్యవహారాలన్నింటినీ సువ్యవస్థితం చేసుకోవాలి. జిల్లా సమన్వయ సమితులూ, శక్తిపీఠాల ధర్మకర్తల బృందమూ కేంద్ర నిర్దేశాల అమలును పర్యవేక్షించాలి. ధర్మకర్తలు తమ కార్యచరణ ప్రణాళికలతో, సహచరులతో శాంతికుంజ్ రావాలి. వారికి అక్కడ శిక్షణ ఇస్తారు. శోధ సంస్థాన్ రజత జయంతి కార్యక్రమాలలో పాల్గొన్న సభ్యులందరూ పరిశోధన సభ్యత్వం స్వీకరించాలి. మేధావులను అలా సభ్యులుగా చేర్చాలి. పత్రికల చందాదారుల సంఖ్యను పదిరెట్లు పెంచే క్రమాన్ని ఈ సంవత్సరం ప్రారంభించాలి.

## 2006-7లో యోగ ఉద్యమ విస్తరణ

ఈ సంవత్సరం యోగ ఉద్యమాన్ని దేశ విదేశాలలో విస్తరించాలి. అందరికీ ఆరోగ్యం దీర్ఘాయువు, యోగానికి కీలకమైన ఆస్తికతను హృదయాలలో నింపడం దీని లక్ష్యాలు. ఇందుకోసం దే.సం.విశ్వవిద్యాలయంలో శిక్షణ పొందిన 100కు పైగా బృందాలు దేశ విదేశాలకు పంపబడతాయి. ఈ బృందాలు 5-10 రోజుల శిబిరాలు నిర్వహిస్తాయి. పూజ్యవరుల సాహిత్యాన్ని అన్ని భారతీయ భాషలలోనికి, పది ఇతర భాషలలోనికి అనువదించే పని ప్రారంభం అవుతుంది.

## 2007-8లో లక్షంబావు అనుష్ఠానాలు

ఈ సంవత్సరంలో ప్రతి సాధకుడూ లక్షంబావు అనుష్ఠానం తప్పకుండా చేయాలి. లక్ష మంది సాధకులు సంవత్సరంలో 1250కోట్ల జపం చేస్తారు. 2011 చివరకు 10000కోట్ల గాయత్రీ జపం పూర్తవుతుంది. లక్షమంది సాధకులు ఒక్కొక్కరు అయిదు కొత్త గృహాలలో దేవ స్థాపన, గాయత్రీ మంత్ర చిత్ర స్థాపన జరపాలి. తద్వారా వాతావరణమంతా గాయత్రీమయం అవుతుంది.

## 2008-9లో విశ్వవిద్యాలయ విస్తరణ

ప్రతి జిల్లాలో సప్త ఉద్యమాలు నిర్వహించబడాలి. దే.సం.విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రాల సంఖ్య 1000కి పైగా, అనుబంధ కళాశాలల సంఖ్య 500 అవుతుంది. ప్రతి కేంద్రం, కళాశాల 1 నుండి 5 లక్షల మందితో సంపర్కం ఏర్పరచుకుంటుంది. అది ప్రపంచంలోకల్లా పెద్ద విశ్వవిద్యాలయంగా రూపొందుతుంది. యుగ సాహిత్యాన్ని అన్ని విద్యాలయాలకూ అందించే కృషి జరుగుతుంది.

## 2009-10లో ప్రత్యామ్నాయ వైద్యంపై పరిశోధన

విశ్వవిద్యాలయం యొక్క పరిశోధన, వికాస కేంద్రం నిర్మాణం అవుతుంది. ప్రత్యామ్నాయ, పూరక వైద్య విధానాలపై అత్యాధునిక పరిశోధన ప్రారంభం అవుతుంది. ప్రాచ్య విద్యపై 200మంది విద్యార్థులతో పరిశోధన కేంద్రం స్థాపించబడుతుంది. లక్షకుపైగా గోశాలలు నిర్మాణం అవుతాయి. వ్యవసాయంలో, స్వావలంబన రంగంలో విప్లవం వస్తుంది.

## 2010-11 నాటికి కోటిమంది సమయదానులు

దేశంలో ఆర్థిక వ్యవస్థ, వైజ్ఞానిక పరిశోధన వ్యవస్థ, విద్యా వ్యవస్థ గాయత్రీ పరివార్ విధానాలకు అనుగుణంగా ఉండేటట్లు చేయడానికి కృషి ప్రారంభం అవుతుంది. సమయదానుల సంఖ్య కోటి అవుతుంది. యుగసాహిత్యం ప్రపంచ భాషలలో లభ్యమవుతుంది.

## 2011-12లో విరాట్ సమ్మేళనాలు

శతజయంతి ఉత్సవాల సందర్భంగా వివిధ స్థలాలలో విరాట్ సమ్మేళనాలు జరుగుతాయి. కొత్తతరం కార్యభారాన్ని వహిస్తుంది. 2020 వరకు కార్య యోజన ప్రకటించబడుతుంది. ఆ యోజన పూర్తయేసరికి యుగనిర్మాణం విశ్వమంతటికీ విస్తరిస్తుంది.

H H H

**విజ్ఞానం బాహ్య ప్రగతి. జ్ఞానం ఆంతరిక అనుభూతి.**

# వార్తలు

## విశాఖజిల్లా జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానోత్సవం

భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష జిల్లాస్థాయి బహుమతి ప్రదానోత్సవం, గాయత్రీ పరివార్ ప్రజ్ఞామండలి ద్వితీయ వార్షికోత్సవం, విశాఖపట్నంలో మార్చి 27న జరిగాయి. జగద్గురు పీఠం పబ్లికేషన్స్ డైరెక్టర్ శ్రీ చింతలపాటి సత్యదేవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. శ్రీబి.హేమచంద్ర రావు స్వాగతం చెప్పారు. శ్రీయుతులు సత్యదేవ్, రాజేష్ ప్రతాప్ సింహ్, కె.ఎన్.శర్మ, చందక అప్పలరాజు, శ్రీమతి వి.నాగరాణి వేదిక నలంకరించారు. శ్రీమతులు ఏ.సావిత్రి, వసంత కుమారి ఆధ్వర్యం వహించగా, బహుమతి పొందిన విద్యార్థులు దీపయజ్ఞం నిర్వహించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన 14 మందికి, వివిధ పాఠశాలలలో ఎక్కువ మార్కులు సాధించిన 36 మందికి గ్రంథాలు బహుమతులుగా ఇవ్వబడ్డాయి. శ్రీయుతులు బి.ఎన్.రావు, అవతారం రాజు, వి.సత్యనారాయణ, ఎమ్.వి.రమణా రావు, పి.మహేశ్వరరావు ఉత్సవ నిర్వహణలో సహకరించారు.

### తిరుపతిలో జ్ఞాన పరీక్ష బహుమతి ప్రదానోత్సవం

తిరుపతి ముత్యాలరెడ్డి పల్లె శాంతినగర్‌లోని శ్రీశేషాచలం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మార్చి 30న శ్రీభాస్కరరెడ్డి అధ్యక్షతన భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానోత్సవం జరిగింది. శ్రీ సముద్రాల లక్ష్మయ్య, శ్రీమతి స్వరాజ్య లక్ష్మి, శ్రీనంజుండప్ప అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. శ్రీనర్రా మునిచంద్ర కూడ ప్రసంగించారు. శ్రీ కె.ముని కృష్ణారెడ్డి వందన సమర్పణ చేశారు. శ్రీమతులు మునిలక్ష్మమ్మ, శ్యామలమ్మ ఉత్సవ నిర్వహణలో సహకరించారు. 72 మందికి బహుమతుల ప్రదానం జరిగింది.

### విశాఖపట్నం సమతా కాలనీలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం

విశాఖపట్నంలో గాజువాకవద్ద గల సమతా కాలనీలోని కొత్త నూకాలమ్మ గుడివద్ద జనవరి 29,30లలో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 29 సాయంత్రం 200 మంది మహిళలతో భవ్య కలశ యాత్ర, 30న యజ్ఞం, నాటి సాయంత్రం వేయి దీపాలతో దీపయజ్ఞం జరిగాయి. 400 మందికి పైగా పాల్గొన్నారు. శ్రీరాజేశ్ ప్రతాప్ సింహ్ ప్రవచనం ఇచ్చారు.

ప్రజ్ఞామండలి విశాఖలో నిర్వహించిన ఇతర కార్యక్రమాలు -

ఏప్రిల్ 5న శ్రీ ఎల్.రమేష్, శ్రీమతి భారతి గృహంలో యజ్ఞం. మార్చి 16న శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీసన్యాసి గృహంలో యజ్ఞం. మార్చి 8న కార్యాలయంలో 1116 దీపాలతో భవ్య దీపయజ్ఞం. మార్చి 8న ఉక్కునగరం సెక్టర్ 6లోని శివాలయంవద్ద 5 కుండముల గాయత్రీ యజ్ఞం. మార్చి 6న వైర్‌లెస్ కాలనీలో డా॥వి.అశోక్ గృహంలో యజ్ఞం. ఫిబ్రవరి 19న జాలరిపేటలో డా॥వి.అశోక్ నూతన గృహంలో యజ్ఞం. ఫిబ్రవరి 17న అక్కయ్యపాలెంలో శ్రీఎస్.నాగేశ్వర రావు నూతన గృహంలో యజ్ఞం. ఫిబ్రవరి 5న శ్రీమతి కామేశ్వరి, శ్రీవేలాయుధన్ గృహంలో యజ్ఞం.

జనవరి 27న విజయనగరం జిల్లా గజపతినగరంలో నలభై రోజుల లలితా సహస్రనామ పారాయణకు పూర్ణాహుతిగా యజ్ఞం. జనవరి 23న విశాఖజిల్లా తగరపు వలసలోని కొత్తపేటలో 54 రోజుల నగర సంకీర్తనకు పూర్ణాహుతిగా నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం. జనవరి 29న విశాఖలోని రత్నగిరి కాలనీలో శ్రీరామ కోటి గృహంలో యజ్ఞం, పుంసవన సంస్కారం. జనవరి 21న విశాఖపట్నం రాంనగర్‌లో శ్రీర్యాలి ప్రభాకర రావు, హేమలత గృహంలో యజ్ఞం.

### పూతలపట్టులో పంచకుండీ యజ్ఞం

మార్చి 25న పూతలపట్టులో డా॥తుమ్మూరి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం, కలశ యాత్ర, 516 దీపాలతో దీపయజ్ఞం జరిగాయి.

### గుడివాడలో నవరాత్రి సామూహిక అనుష్ఠానం

గుడివాడలో వసంత నవరాత్రి సామూహిక సాధన అనుష్ఠానం శ్రద్ధాసక్తులతో వైభవంగా జరిగింది. యోగమిత్ర శ్రీ కె.డి.వి.ఎన్.శ్రీనివాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతిరోజూ 21మంది కార్యకర్తలు కార్యాలయంలో ఉదయం, సాయంత్రం జరిగిన జప, ధ్యాన, హారతి, చాలీసా పఠన కార్యక్రమాలలో పాల్గొన్నారు. చివరి రోజున జరిగిన పూర్ణాహుతి యజ్ఞంలో 60మంది పాల్గొన్నారు.

### జగిత్యాలలో వసంత నవరాత్రి

జగిత్యాల కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏప్రిల్ 9 నుండి 18వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు జరిగాయి. ప్రతిరోజూ ఉదయం యజ్ఞం, సాయంత్రం గాయత్రీ చాలీసా, లలితా సహస్రనామ పారాయణ, భజన, హారతి నిర్వహించారు. శ్రీరామనవమినాడు పూర్ణాహుతి జరిగింది. శ్రీగడ్డం బుచ్చిరెడ్డి పూర్తి దీక్షలో ఉన్నారు.

**ప్రతిరోజూ గాయత్రిని జపిస్తూ, ఆ గాయత్రి నీ బుద్ధిని ప్రేరేపించుగాక అని సంకల్పించుకో.**

## భీమిలిలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం

ఏప్రిల్ 24న భీమిలిలోని శ్రీదుర్గా గాయత్రి శక్తిపీఠంలో చైత్ర పూర్ణిమ, 'చతుర్దశ' 24 లక్షల గాయత్రీ మంత్రజప సామూహిక పూర్ణాహుతి శ్రీమతి భారతి చంద్రశేఖరం ఆధ్వర్యంలో జరిగాయి. శ్రీయుతులు పి.వెంకట్రావు, రామ్ నాయిక్, అప్పలకొండ దంపతులు, డాక్టర్ పెరుమాళ్‌లతో పాటు 60 మంది పరిజనులు పాల్గొన్నారు. శ్రీఅవతారం రాజు పంచకుండీయ యజ్ఞం నిర్వహించారు. శ్రీమతులు లక్ష్మి, విజయలక్ష్మి, రాజరాజేశ్వరి, శ్రీ పి.వి.పండా సహకరించారు. బొల్లాప్రగడ లక్ష్మీగణపతి దంపతులు భోజన ప్రసాదం ఏర్పాటు చేశారు.

## ధర్మారంలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం

ఏప్రిల్ 17న కరీంనగర్ జిల్లా ధర్మారంలోని బ్రిలియంట్ మోడల్ స్కూలులో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. శ్రీయుతులు గౌడ భాస్కర్, గోనె దేవయ్య, కైలాస భూపతిరావు, రాజ్‌పురోహిత్, గణపతి సింగ్, సిరిపురం సత్యనారాయణ, గాజుల శివలింగం, నడిమెట్ల దత్తాత్రేయ, గాజుల సంతోష్, మంథెన సంజీవ్, అడిశేర్ల రామయ్య సహకరించారు. 200 మంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 15న శ్రీదాసి రవి గృహంలో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది.

కరీంనగర్ జిల్లాలో జరిగిన ఇతర కార్యక్రమాలు -

మార్చి 8న మారుపాకలో మృత్యుంజయ పూజ, జాగరణ, దీపపూజ, దీప యజ్ఞం. మార్చి 25న ఏకకుండీ గాయత్రీ యజ్ఞం. ఏప్రిల్ 9నుండి 18 వరకు చైత్రనవరాత్రి లఘు అనుష్ఠానం, చివరి రోజు యజ్ఞం జరిగాయి. 50 మంది పాల్గొన్నారు. హనుమజ్జయంతి రోజున భక్త వీరాంజనేయ ఆలయంలో హనుమాన్ దీక్ష విరమణ సందర్భంగా ద్వికుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. 100మంది పాల్గొన్నారు.

వేములవాడ మండలం అగ్రహారంలో హనుమజ్జయంతి రోజున గాయత్రి పుస్తక స్టాల్ నిర్వహించారు. శ్రీపులి మధుకర్ ఆధ్వర్యం వహించారు. రూ.2000/- విలువగల సాహిత్యం అమ్మబడింది.

ఏప్రిల్ 18న మారుపాకలో హైస్కూలు ప్రధానాచార్యులు శ్రీసిహెచ్.హన్మయ్య సమక్షంలో సరస్వతీ, గాయత్రీ పూజ జరిగింది. 250 మంది పాల్గొన్నారు. శ్రీ పులి మధుకర్ ఆధ్వర్యం వహించారు.

చందుర్తి మండలం మల్యాలలో ఏప్రిల్ 3న ఎముజాల శంకర్-ఉమల గృహంలో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. 100మంది పాల్గొన్నారు.

వెల్లటూరు మండలం కొత్తపేటలో ఫిబ్రవరి 13న శ్రీసంజీవరెడ్డి గృహంలో 108 దీపాలతో దీపయజ్ఞం జరిగింది. 70మంది పాల్గొన్నారు. మార్చి 8న శ్రీ అమరకొండ శంకరయ్య గృహంలో, దాసరి రాజేశం - మణెమ్మల గృహంలో గాయత్రీ యజ్ఞం జరిగింది. మార్చి 10న శ్రీబొల్లి గురువయ్య గృహంలో 108 దీపాలతో దీపయజ్ఞం జరిగింది. మార్చి 25న శ్రీనడిమెట్ల దత్తాత్రేయ గృహంలో గాయత్రీ యజ్ఞం జరిగింది. ఏప్రిల్ 9 నుండి 18 వరకు చైత్ర నవరాత్రి లఘు అనుష్ఠానం జరిగింది. 18న పూర్ణాహుతిగా గాజుల శివలింగం - కమల గృహంలో గాయత్రీ యజ్ఞం జరిగింది.

పై కార్యక్రమాలకు డా॥పులి సత్యనారాయణ, శ్రీనడిమెట్ల రాజేశం ఆధ్వర్యం వహించారు.

## చీరాలలో నిత్య గాయత్రీ యజ్ఞశాలలో సంస్కారాలు

చీరాల నిత్య గాయత్రీ యజ్ఞశాలలో ఏప్రిల్ 9న జన్మదిన సంస్కారం జరిగింది. ఏప్రిల్ 10న అయిదుగురు గురుదీక్ష స్వీకరించారు. ఏప్రిల్ 13న పుంసవన సంస్కారం జరిగింది. ఏప్రిల్ 18న టంగుటూరి వేంకట సత్య సుగుణ, రామయ్య దంపతులు ప్రధాన దంపతులుగా శ్రీరామనవమి ఉత్సవం జరిగింది. ఏప్రిల్ 20న రెండు జన్మదిన సంస్కారాలు జరిగాయి. మే 3న ఒక జన్మదిన సంస్కారం జరిగింది.

M M M

## జూన్, జూలై నెలలలో పర్వదినాలు

**జూన్ :**

1. హనుమజ్జయంతి.
17. గాయత్రీ జయంతి.
22. కబీరు జయంతి.
    ఏరువాక పున్నమి.

**జూలై :**

9. జగన్నాథ రథయాత్ర
21. గురు పూర్ణిమ.
23. తిలక్ జయంతి.

**ఇతరులకు ఉపయోగపడే పని ఏదైనా మొదలుపెట్టు. మిగతా పనులన్నీ దానిని అనుసరించి ఏర్పాటు చేసుకో.**